


# విశ్వంవాయిస్

అవినీతిపై- అక్షరసమరం...
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY




SIMULTANEOUSLY PUBLISHED FROM EAST GODAVARI DISTRICT, CERCULATED AT IN WEST GODAVARI, VISAKHAPATNAM, SRIKAKULAM, VIJAYANAGARAM, VIJAYAWADA, HYDERABAD, BANGLORE, CHENNAI, DELHI, MUMBAI, TIRUPATHI, ANANTAPUR, GUNTUR, KADAPA, KHAMMAM, KARIMNAGAR, KURNOOL, NELLORE, NIZAMABAD, ONGOLE

సంపుటి : 8 | సంచిక : 309 | అమలాపురం | ఎడిటర్ : కె. సునీల్‌కుమార్ | ౦౦౦౦౦౦ | పేజీలు : 12 | వెల : 2/-





- అత్యధికంగా చుందూరులో 27.24, చేబ్రోలులో 23.4 సెం.మీ. వర్షం
- గుంటూరు, విజయవాడల్లో రోడ్లపై 2–3 అడుగుల ఎత్తున వరదనీరు
- కాజ, ఇబ్రహీంపట్నం వద్ద జాతీయ రహదారులపై ప్రవాహం
- ప్రకాశం బ్యారేజికి పోటెత్తిన వరద..
- వేర్వేరు ఘటనల్లో నలుగురి మృతి.. ఇద్దరు గల్లంతు
- దిగువ ప్రాంతాల్లో ప్రజల్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం

# వణికించిన వాన

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

గుంటూరు జిల్లా మేడికొండూరు మండలం విశదలకు వెళ్లే రోడ్డులో వాగు పొంగి వరద నీటిలో చిక్కుకున్న కారు. అందులో ఉన్న ఇద్దరు క్షేమంగా బయటపడ్డారు మంగళవారం రాత్రి 9 గంటలకు మొదలై బుధవారం తెల్లారేదాకా ఒకటే కుండపోత.. గంటల వ్యవధిలోనే 15–20 సెం.మీ. వర్షం.. ఎడతెరపి లేని వర్షాలతో గుంటూరు, విజయవాడ నగరాల్లోని పలు ప్రాంతాలు చెరువుల్ని తలపించాయి. రోడ్లపై 2–3 అడుగుల ఎత్తుకు పైగా నీరు ప్రవహించింది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి ప్రవేశించింది. అత్యధికంగా బాపట్ల జిల్లా చుండూరు మండలంలో 27.24, గుంటూరు జిల్లా చేబ్రోలులో 23.4, దుగ్గిరాలలో 22.58, తాడికొండలో 22.50, మంగళగిరిలో 19.48, నాగాయలంక 19.1, పెదకాకానిలో 18.68, తుళ్లూరులో 18.02, తెనాలిలో 17.84 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కాజ, ఇబ్రహీంపట్నం వద్ద జాతీయ రహదారులపైకి నీరు చేరడంతో రోడ్డంతా వాగులా తయారైంది. పల్నాడు, ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రహదారులపై - మిగతా2లో

## వరద ముంపులో అమరావతి

- కొండవీటి వాగుకు ఉప్పొంగిన వరద ప్రవాహం
- గుంటూరు నుంచి రాజధానికి రాకపోకలు బంద్
- ఉప్పొంగిన కోటేళ్లవాగు, ఎర్రవాగు, పాలవాగు.. సచివాలయానికి అధికారులు వెళ్లలేక నానా ఇబ్బందులు
- 40 వేల ఎకరాల్లో నీట మునిగిన పంట పొలాలు

2

ఇకపై ఒక్కరోజులోనే

## వీసా జారీ



- నిబంధనలను సరళతరం చేసిన కేంద్రం
- విదేశీ విభాగ ఉన్నతాధికారులతో కేంద్రమంత్రి బండి సంజయ్ సమావేశం
- 2024లో జారీ చేసిన మొత్తం వీసాలలో ఈ–వీసాల వాటా 65.15 శాతం
- వీసా విధానాల సులభతరం వల్ల వీసా జారీ సగటు సమయం కొన్ని వారాల నుంచి ఒక రోజులో..

6



ఏసీబీ కోర్టు ఆదేశాలు


## ధిక్కరించలేదు

- కేసు కీలక దశలో ఉంది.. రిమాండును పొడిగించండి
- మద్యం కేసులో వాదనలు వినిపించిన ప్రాసిక్యూషన్ జేడీ
- నిందితులకు ఈ నెల 26 వరకు రిమాండు పొడిగింపు
- మిథున్‌రెడ్డిని కోర్టుకు తీసుకొస్తున్న పోలీసులు

6

## అప్రమత్తంగా ఉండండి

- ఆకస్మిక వరద ప్రవాహాలను అంచనా వేయండి
- కాలువలు, చెరువుల గట్లను పటిష్ఠం చేయండి
- లోతట్టు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు చేర్చండి
- జిల్లాల్లో పరిస్థితిని కలెక్టర్లు పర్యవేక్షించాలి
- రైతులకు ఎప్పటికప్పుడు సమాచారమివ్వండి
- అధికారులకు సీఎం చంద్రబాబు ఆదేశం
- మంత్రులు, అధికారులతో అత్యవసర సమీక్ష
- జిల్లాల్లోనూ కంట్రోల్ రూమ్‌ల ఏర్పాటు: హోంమంత్రి



**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

రాష్ట్రంలో భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. రానున్న మూడు రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున తగిన చర్యలు తీసుకోవాలన్నారు. బుధవారం ఉండవల్లిలోని క్యాంప్ ఆఫీసలో భారీ వర్షాలపై మంత్రులు, అధికారులతో అత్యవసర సమీక్ష నిర్వహించారు. మంత్రులు అనిత, రామానాయుడు, సీఎస్ విజయానంద్ సహా విపత్తు నిర్వహణ, వ్యవసాయ, జలవనరుల శాఖల ఉన్నతాధికారులు హాజర య్యారు. సీఎం మాట్లాడుతూ.. కలెక్టర్లు కూడా అప్రమత్తంగా ఉంటూ, జిల్లాల్లో వర్షాల పరిస్థితిపై ఎప్పటికప్పుడు రైతులకు తక్షణ - మిగతా2లో



## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

- ఇద్దరు మావోయిస్టు అగ్రనేతలు మృతి
- అటవీప్రాంతంలో బుధవారం పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురుకాల్పులు

## ఏజెంట్లే లేకుండా ఎన్నికలా?



- పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికల్లో పట్టపగలు ప్రజాస్వామ్యం ఖూనీ
- టీడీపీ దుర్మార్గాలను సాక్ష్యాధారాలతో కడిగిపారేసిన వైఎస్ జగన్
- ఈ ఉప ఎన్నికలను రద్దు చేసి.. కేంద్ర బలగాల పర్యవేక్షణలో ప్రజాస్వామ్యబద్ధంగా నిర్వహించాలని డిమాండ్
- దీనిపై న్యాయ పోరాటం చేస్తాం
- చంబల్ లోయ బందిపోట్లను మరిపించే రీతిలో దొంగ ఓట్లు వేసుకున్నారు

**విజయవాడ, విశ్వం వాయిస్ న్యూస్ :**

'సూపర్ సిక్స్, సూపర్ సెవెన్ సహా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మీరు ప్రజలను మోసం చేశారు. మీ పాలన మొత్తం రాక్షస పాలన అని ప్రజలకు అర్థమైంది. కాబట్టి మీకు ఓట్లు వేసే పరిస్థితి లేదు. అందుకే పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికల్లో ఇదివరకు చంబల్ లోయ బందిపోటు దొంగలను మరిపించేలా.. పట్టపగలే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసి, అడ్డగోలుగా దొంగ ఓట్లు వేసుకున్నార'ని సీఎం చంద్రబాబుపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మండిపడ్డారు. ఇలా అడ్డగోలుగా రాజకీయాలు చేసే వారిని నాయకుడనరని.. చంద్రబాబు ఒక మాబ్‌స్టర్.. ఫ్రాడ్‌స్టర్ అని తేల్చి - మిగతా6లో



వారి నుంచి

## నాకు ముప్పు ఉండొచ్చు

- సావర్కర్, గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారి నుంచి తనకు ముప్పు పొంచి ఉండొచ్చు
- తనకు అవసరమైన భద్రత అందించడం కేంద్రం బాధ్యత
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

2

# అప్రమత్తంగా ఉండండి

-మొదటిపేజీ తరువాయి

సమాచారం అందించాలని సూచించారు. పట్టణ ప్రాంతాల్లో రోడ్లు, లోతట్టు ప్రాంతాల్లో నిలిచిన నీటిని తక్షణం తొలగించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలో వాగులు, వంకల నుంచి వచ్చే ఆకస్మిక వరద ప్రవాహాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ దిగువ ప్రాంతాలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రకాశం బ్యారేజికి దిగువ ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేసి, లోతట్టు ప్రాంతాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కాలువల్లో నీటి ప్రవాహాలు సక్రమంగా ఉండేలా గుర్రపుడెక్క, తూటికాడను తొలగించాలని స్పష్టం చేశారు. అలాగే కాలువలు, చెరువులకు గండ్లు పడకుండా గట్లను పటిష్ఠం చేయాలని అధికారులను ఆదేశించారు. వరద నిర్వహణ పనుల్లో భాగంగా రూ.40 కోట్లతో బుడమేరు–వెలగలేరు యూటీ నిర్మాణాన్ని చేపట్టేందుకు సీఎం అనుమతి మంజూరు చేశారు. కృష్ణా నదిలో గురువారం నాటికి 5 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చే అవకాశం ఉందని అధికారులు సీఎంకు తెలిపారు. కాలువలకు 5 వేల క్యూసెక్కుల మేర విడుదల చేశామని వివరించారు. మరోవైపు ఎగువ నాగార్జునసాగర్, పులిచింతల గేట్లను ఎత్తినట్లు అధికారులు వివరించారు.

**అధికారులు సిద్ధంగా ఉండాలి: హోంమంత్రి అనిత**

రాష్ట్రంలో భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని హోంమంత్రి వంగలపూడి అనిత అధికారులకు సూచించారు. వర్షప్రభావ ప్రాంత ప్రజలకు అధికారులు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలని ఆదేశించారు. తాడేపల్లిలోని స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ నుంచి వాతావరణ వివరాలను ఆమె పరిశీలించారు. రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయం నుంచి కోస్తా జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లాల్లోనూ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. ఆదివారం వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని సూచించారు. ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యలకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. అత్యవసర సహాయం కోసం విపత్తు నిర్వహణ సంస్థలోని కంట్రోల్ రూమ్ టోల్‌ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101లను సంప్రదించాలన్నారు. ప్రకాశం బ్యారేజి వద్ద ఇన్‌ఫ్లో, ఔట్ ఫ్లో 3.44లక్షల క్యూసెక్కుల నుంచి 4.5లక్షల క్యూసెక్కులకు చేరే అవకాశం ఉన్నందున గుంటూరు, బాపట్ల, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు జిల్లాల నదీ పరివాహక, లోతట్టు ప్రాంత ప్రజల్ని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలన్నారు. వాగులు, కాలువలు, కల్వర్టుల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. విపత్తుల నిర్వహణ శాఖ స్పెషల్ సీఎస్ జయలక్ష్మి, డైరెక్టర్ ప్రఖర్‌జైన్, ఎస్డీఆర్ఎఫ్ ఐజీ రాజకుమారి, ఎన్డీఆర్ఎఫ్ కమాండెంట్, ఏపీ ఐఎండీ డైరెక్టర్ స్టెల్లా, ఏపీఎస్డీఎంఏ ఈడీ వెంకట దీపక్ తదితరులు పాల్గొన్నారు.

# వరద ముంపులో అమరావతి

గుంటూరు/తాడికొండ



రాజధాని అమరావతి మళ్లీ వరద ముంపులో చిక్కుకుంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు వంకలు పొంగిపొర్లడంతో గుంటూరు వైపు నుంచి రాజధాని అమరావతికి రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం రాత్రి పది గంటల నుంచి బుధవారం ఉదయంలోపు జిల్లాలో సగటున 145 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవడంతో తాడికొండ మండలం లాం వద్ద కొండవీటి వాగు ఉప్పొంగి ప్రవహిస్తోంది. దాదాపు ఆరు గంటల పాటు వాహనాల రాకపోకలు స్తంభించిపోయాయి. పెదపరిమి వద్ద కోటేళ్లవాగు, కంతేరు వద్ద ఎర్రవాగు, అయ్యన్నవాగు, పాలవాగులు పొంగడంతో రహదారులపైకి నీరు చేరింది.

**రాజధాని నిర్మాణాలతో స్వరూపం కోల్పోయిన వాగులు..**

రాజధాని ప్రాంతంలో వివిధ నిర్మాణాల కారణంగా పాలవాగు, అయ్యన్నవాగులు వాటి స్వరూపాన్ని కోల్పోయాయి. కొండవీటి వాగు నీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేకుండాపోయింది. నిర్మాణాలతో వాగులు మూసుకుపోవడంతో పాటు రోడ్ల ఎత్తును పెంచడంతో వాగు నుంచి వచ్చే వేల క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేక వేలాది ఎకరాల్లో పంటలు పూర్తిగా నీటమునిగాయి. ప్రత్యామ్నాయ మార్గాలపై ప్రభుత్వం దృష్టిసారించకుండా కొండవీటి వాగు వరదను గాలికొదిలేయడంతో పరిస్థితి అధ్వానంగా తయారైంది. మరోవైపు.. తాడికొండ, తుళ్ళూరు, మేడికొండూరు, మంగళగిరి రూరల్ మండలాల్లోని సుమారు 40 వేల ఎకరాల్లో పంటలు కొండవీటి వాగు వరద ఉధృతికి ముంపుబారిన పడి సముద్రాన్ని తలపిస్తున్నాయి. ఎక్కడ చూసినా వరద నీరే ఉండటంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు.

**ప్రత్యామ్నాయ చర్యలు నిల్..**

ఇక మంగళవారం రాత్రి తాడికొండ మండలంలో 225 మిల్లీమీటర్లు, తుళ్ళూరు మండలంలో 180.2 మి.మీ., మేడికొండూరు 140.2, ఫిరంగిపురం 111.2, మంగళగిరి 194.8 మి.మీ., వర్షం కురిసింది. ఈ వర్షం నీరు అంతా కొండవీడు కొండల మీదుగా మేడికొండూరు, తాడికొండ, తుళ్ళూరు, తాడేపల్లి మండలాల మీదుగా ప్రకాశం బ్యారేజ్‌కు చేరాల్సి ఉంది. కానీ, కొండవీటి వాగు ప్రక్షాళనకు రూ.234 కోట్లతో టీడీపీ కూటమి ప్రభుత్వం తలపెట్టిన ఎత్తిపోతల పథకంలో ఎక్కడా ఎగువ నుంచి దిగువకు వరద నీరు పూర్తిగా వచ్చేలా ఎలాంటి ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోలేదు. నిజానికి.. వందల ఏళ్లుగా కొండవీటి వాగు పల్లపు ప్రాంతమైన రాజధాని ప్రాంతం నుంచే ప్రవహించేది. అయితే, ప్రస్తుతం దానిని మూసేసి ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లుచేయకపోవడంవల్లే రాజధాని ప్రాంతం ముంపునకు గురైందని స్థానిక రైతులు ఆరోపిస్తున్నారు. మరోవైపు.. కాసుల కక్కుర్తి కోసం రాజధానిలో రిజర్వాయర్ల పేరుతో ఇతర నిర్మాణాలను చేపట్టడం కూడా వరద ముంపునకు కారణమైంది. దీంతో.. గత 25 ఏళ్లలో ఎప్పుడూ జరగని నష్టం ఇప్పుడీ ప్రాంతానికి వచ్చింది. ఇటు పంటలు మునగడంతో పాటు గ్రామాల్లో కూడా నీరు కదిలే పరిస్థితి లేక రాజధానితో పాటు పరిసర ప్రాంతాలు జలదిగ్బంధమయ్యాయి.

**రాకపోకలకు తీవ్ర అంతరాయం..**

ఇదిలా ఉంటే.. గుంటూరు నుంచి రాజధానికి వెళ్లేందుకు ప్రధాన రహదారి అమరావతి%–%గుంటూరు రోడ్డే. అయితే, ఈ మార్గంలో లాం వద్ద కొండవీటి వాగు ఏటా ఉప్పొంగి ప్రవహిస్తుంది. ఇక్కడ వంతెన నిర్మాణం హామీ ఇప్పటివరకు ఆచరణకు నోచుకోలేదు.

' మరో మార్గం.. జాతీయ రహదారి మీదుగా కంతేరు%–%తాడికొండ మధ్యలో ఎర్రవాగు వద్ద కూడా వరద పొంగి ప్రవహిస్తుంది. ఇక్కడ కూడా వంతెన నిర్మాణం చేయాల్సి ఉంది. ఆ దిశగా కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదు. మంగళగిరి మీదుగా రాజధానికి ప్రవేశించాలన్నా నీరుకొండ%–%పెదపరిమి రహదారి వద్ద భారీ వర్షం కురిస్తే వారం పాటు రాకపోకలు నిలిచిపోతున్నాయి. ఐనవోలు మీదుగా కూడా రహదారి పూర్తిగా దిగ్బంధం అవుతుంది. ' ఒక్క చంద్రబాబు నివాసం మీదుగా వచ్చే కరకట్ట రహదారి మినహా రాజధానికి రావాలంటే ఏ ఒక్క రోడ్డు అందుబాటులో లేకపోవడంతో రాష్ట్ర సచివాలయానికి ఉద్యోగులు వెళ్లలేక నానా ఇబ్బందులు పడ్డారు.

# డ్రగ్స్ జోలికెళితే జీవితం అంధకారమే





- ఎన్డీపీఎస్ చట్టంపై విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలి
- యునైటెడ్ కాలేజీ ఫస్ట్ ఇయర్ విద్యార్థుల స్వాగతోత్సవం 'సంయుక్త'లో ఈగల్ అధిపతి, ఐజీ ఆకే రవికృష్ణ
- యునైటెడ్ విద్యార్థులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ
- సృజనాత్మకంగా, స్ఫూర్తిదాయకంగా విద్యార్థుల కళా ప్రదర్శనలు
- కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విజయవాడ డీసీపీ కె.జి.వి. సరిత, ఈగల్ ఎస్పీ కె. నగేష్ బాబు

విజయవాడ

విద్యార్థులు మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధన దిశగా అడుగులేయాలని ఈగల్ అధిపతి, ఐజీ ఆకే రవికృష్ణ అన్నారు. యునైటెడ్ హెూటల్ మేనేజ్మెంట్ కాలేజీ ఫస్ట్ ఇయర్ విద్యార్థుల స్వాగత కార్యక్రమాన్ని 'సంయుక్త' పేరుతో బుధవారం నిర్వహించారు. గవర్నరుపేట మాకినేని బసవపున్నయ్య ఆడిటోరియంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఐజీ ఆకే రవికృష్ణ ముఖ్య అతిథిగా హాజరై, విద్యార్థులతో నషా ముక్త్ భారత్ అభియాన్ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగిస్తూ.. దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని, క్రమశిక్షణతో విద్యనభ్యసించి ఉత్తమ పౌరులుగా ఎదగాలని రవికృష్ణ పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాలు, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, అటువంటి దుర్వ్యసనాల బారినపడితే జీవితం అంధకారంగా మారుతుందని హెచ్చరించారు. నార్కోటిక్ డ్రగ్స్, సైకోట్రోపిక్ సబ్ స్టాన్సెస్ (ఎన్డీపీఎస్) చట్టం పట్ల విద్యార్థులు అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కేసుల్లో పట్టుబడిన వారికి 20 ఏళ్ల వరకు జైలుశిక్ష, రూ. 2 లక్షల వరకు జరిమానా విధించబడతాయని చెప్పారు. విద్యార్థులపై ఈ చట్టం కింద కేసు నమోదైతే జీవితం అంధకారంగా మారుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ మాదకద్రవ్యాల వినియోగానికి, సరఫరాకు దూరంగా ఉండాలని సూచించారు. అనంతరం, విజయవాడ డీసీపీ కె.జి.వి. సరిత మాట్లాడుతూ.. జీవితంలో స్థిరపడి తల్లిదండ్రుల ఆకాంక్షలను నెరవేర్చాలని, దేశ ప్రగతికి కృషి చేయాలని అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం కోసం విద్యా సంస్థల నిర్వాహకులు, విద్యార్థులు ముందుకు రావాలని కోరారు. ఈగల్ ఎస్పీ కె. నగేష్ బాబు ప్రసంగిస్తూ.. ఆతిథ్య రంగంలో ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా అపారమైన ఉపాధి అవకాశాలున్నాయని, ఈ రంగాన్ని కెరీర్ గా ఎంచుకున్న యునైటెడ్ కాలేజీ విద్యార్థులకు ఉన్నతమైన భవిష్యత్తు ఉంటుందని అన్నారు. నషా ముక్త్ భారత్ అభియాన్ లక్ష్య సాధనలో విద్యార్థులే కీలకమని నగేష్ బాబు పేర్కొన్నారు. యునైటెడ్ కాలేజ్ ఆఫ్ హెూటల్ మేనేజ్మెంట్ ఫౌండర్ అండ్ డైరెక్టర్ అబ్దుల్ రజాక్ ప్రసంగిస్తూ.. తమ విద్యార్థులందరూ ఐక్యంగా అభివృద్ధి సాధించాలనే సంకల్పంతో, ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశామన్నారు. యునైటెడ్ అనే తమ కళాశాల పేరుకు సంస్కృత అర్థమైన 'సంయుక్త'గా ఈ కార్యక్రమానికి నామకరణం చేశామని వివరించారు. విద్యార్థుల్లోని కళా నైపుణ్యాలను వెలికితీసి, వారిని బహుముఖ ప్రతిభావంతులుగా తీర్చిదిద్దటమే 'సంయుక్త' లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆచార్య నాగార్జున యూనివర్సిటీ గెస్ట్ ఫ్యాకల్టీ అబ్దుల్ రెహమాన్, యునైటెడ్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కరీమా, ప్రిన్సిపాల్ జగదీష్ జంపన, ఈవెంట్ మేనేజర్ ఉష, ఈగల్ ఇన్స్పెక్టర్ ఎం. రవీంద్ర, ఎస్సై ఎం. వీరాంజనేయులు, యునైటెడ్ కళాశాల ఫ్యాకల్టీ బృందం, లెక్చరర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## వణికించిన వాన

-మొదటిపేజీ తరువాయి

వరదనీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచాయి. వేర్వేరు ఘటనల్లో నలుగురు మరణించగా.. ఇద్దరు గల్లంతయ్యారు. నాగార్జునసాగర్, పులిచింతల నుంచి నీటి విడుదలకు తోడు భారీవర్షాలతో వరద చేరడంతో కృష్ణానదికి వరద పెరిగింది. ప్రకాశం బ్యారేజి 70 గేట్లు ఎత్తి నీరు విడుదల చేస్తున్నారు. అక్కడ మొదటి ప్రమాదహెచ్చరిక జారీచేశారు. దిగువప్రాంతాల్లో ప్రజల్ని అప్రమత్తం చేశారు. సుమారు లక్ష ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు అంచనా.

బుధవారం ఉదయం కొంత తెరపి ఇచ్చినా.. సాయంత్రం నుంచి మళ్లీ మొదలైంది. ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు అత్యధికంగా అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరంలో 18.8, ఏలూరు జిల్లా నిడమర్రు మండలంలో 14.3, ఎన్టీఆర్ జిల్లా నందిగామలో 13.3, పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 11.9 సెం.మీ. వర్షపాతం నమోదైంది.

**జలదిగ్బంధంలో గుంటూరు, విజయవాడ**

గుంటూరు పూర్తిగా జలదిగ్బంధంలో చిక్కుకుంది. ఏటీఅగ్రహారం, చుట్టుగుంట, రామిరెడ్డి నగర్, శ్రీరామ్‌నగర్, అమీన్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఇళ్లలోకి నీరు చేరింది. కార్పొరేషన్, రైతుబజార్లు, మిర్చియార్డుల్లోకి నీరు చేరింది. కంకరగుంట ఆర్‌యూబీ, మూడు వంతెనల వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. పీకలవాగు, కొండవీటి వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో నగరంలోకి రాకపోకలు నిలిచిపోయాయి. నాగార్జున విశ్వవిద్యాలయం హాస్టళ్లలోకి నీరు ప్రవేశించడంతో విద్యార్థులు నిచ్చెనలతో బయటకు వచ్చారు. విజయవాడలో డ్రెయిన్లు పొంగడంతో మధురానగర్, విజయదుర్గానగర్ తదితర ప్రాంతాల్లో బుడమేరు కట్టమీద ఉన్న దాదాపు 40 ఇళ్లలో నీరు చేరింది. విజయవాడ పాతబస్తీ, కొత్తపేట, కేబీఎన్ కళాశాల ప్రాంతాల్లో నడుం లోతు నీరు చేరింది. పటమట పీఅండ్‌టీ కాలనీ జలమయమైంది. పెదకూరపాడు, అమరావతి, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మండలాల్లో భారీవర్షాలు కురిశాయి. గుంటూరు–మాచర్ల మార్గంలో అనుపాలెం వద్ద వాగు పొంగింది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో చల్లపల్లి, అవనిగడ్డ, పామర్రు, కంకిపాడు, గూడూరు, తదితర మండలాల్లో నాట్లు వేసిన పొలాలు నీటమునిగాయి.

**జలదిగ్బంధంలో గుంటూరులోని మురుగుపేట**

రాజధాని పనుల నేపథ్యంలో కొండవీటివాగు, పాలవాగుల ప్రవాహానికి అడ్డంకులు ఏర్పడ్డాయి. వరదనీరు వెనక్కి తన్నింది. కృష్ణాయపాలెం, కురగల్లు, ఎర్రబాలెం సమీపంలోని లోతట్టు ప్రాంతాల్లోకి వరదనీరు చేరింది. పెదపరిమి–నీరుకొండ గ్రామాల మధ్య కోటెళ్లవాగు పొంగడంతో పెదపరిమి–తుళ్లూరు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కొండవీటి వాగు ఉధృతికి గుంటూరు–అమరావతి నడుమ రాకపోకలు ఆగిపోయాయి. పెదమద్దూరు వద్ద వాగు ఉధృతికి అమరావతి–విజయవాడ దారిలో రాకపోకలు నిలిచిపోయాయి.

**రోడ్డెక్కిన వరద.. నిలిచిన టోల్ వసూళ్లు**

కోల్‌కతా–చెన్నై జాతీయరహదారిలో కాజ టోల్‌గేట్ వద్ద రోడ్డుపై వర్షపునీరు ప్రవహించడంతో తెల్లవారుజామున వాహనాల రాకపోకలు నిలిచాయి. బుధవారం ఉదయం 11.30నుంచి టోల్ వసూలు నెట్‌వర్క్ నీటిలో మునిగి, వసూళ్లు నిలిచాయి.

**పొలాలు నీట మునిగి.. రైతుకు వేదన**

భారీవర్షాలతో లక్ష ఎకరాల్లో పత్తి వరి, మినుము, కూరగాయ పంటలు నీటమునిగాయి. గుంటూరు జిల్లాలో 28వేల ఎకరాలకు పైగా పంటలపై వరద ప్రవహించింది. గుంటూరు చుట్టుగుంట గోదాములోని 2,500 పొగాకు బేళ్లు తడిసిపోయాయి. కాల్వల కట్టలకు గండ్లు పడితే లక్ష హెక్టార్లలో పంటలు దెబ్బతింటాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

## ఏసీబీ కోర్టు ఆదేశాలు ధిక్కరించలేదు

అమరావతి:



మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి సీజ్ చేసిన నగదు జమ విషయంలో ఏసీబీ కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకే పోలీసులు నడుచుకున్నారని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదించారు. నిందితులకు రిమాండ్ గడువు బుధవారంతో ముగియనున్న నేపథ్యంలో వారిని విజయవాడలోని అనిశా కోర్టులో పోలీసులు హాజరుపరిచారు. రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం నుంచి మిథున్‌రెడ్డి, గుంటూరు జిల్లా జైలు నుంచి బాలాజీ కుమార్ యాదవ్, నవీన్ కృష్ణ, విజయవాడ కారాగారం నుంచి రాజ్ కెసిరెడ్డి, చాణక్య, శ్రీధర్‌రెడ్డి, దిలీప్, గోవిందప్ప బాలాజీ, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, వెంకటేష్ నాయుడు, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిలను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జేడీ తన వాదనలు కొనసాగిస్తూ.. సిట్ అధికారులు ఎక్కడా బ్యాంకు అధికారులతో కుమ్మక్కు కాలేదని, అన్నీ సమయాలతో సహా నమోదు అయ్యాయని చెప్పారు. జమకు సంబంధించి కోర్టు ఆదేశాలను సాయంత్రం ఇచ్చిందని, అప్పటికే బ్యాంకు నుంచి రూ. 11 కోట్లు కరెన్సీ చెస్ట్‌కు వెళ్లిపోయాయని వాదనలు వినిపించారు. కేసు దర్యాప్తు కీలక దశలో ఉన్న సమయంలో నిందితులకు బెయిల్ ఇవ్వొద్దన్నారు. వాదనల అనంతరం రిమాండ్‌ను ఈ నెల 26 వరకు పొడిగిస్తూ న్యాయాధికారి భాస్కరరావు ఆదేశాలిచ్చారు.

**ఆధారాలను ధ్వంసం చేశారు..**

ఏ1 రాజ్ కెసిరెడ్డి తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి తన వాదనలు వినిపిస్తూ.. నగదు జమకు సంబంధించి పోలీసులు బ్యాంకు అధికారులతో కలసి ఆధారాలను ధ్వంసం చేశారన్నారు. తదుపరి వాదనల నిమిత్తం ఈ నెల 18కి న్యాయాధికారి కేసు వాయిదా వేశారు. ఈ కేసులో నిందితులను కోర్టులో హాజరుపర్చిన సందర్భంగా వారిని న్యాయాధికారి సమస్యల గురించి అడిగారు. ఈ సందర్భంగా వారు తమ ఇబ్బందులను ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

**బయటి భోజనాన్ని రెండు పూటలా అనుమతించండి: మిథున్‌రెడ్డి**

జైలులో తనకు రోజుకు ఒక పూట మాత్రమే బయటి నుంచి భోజనాన్ని అనుమతిస్తున్నారని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి చెప్పారు. రోజుకు రెండు సార్లు భోజనం పంపించేలా అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా న్యాయాధికారి జోక్యం చేసుకుంటూ.. పిటిషన్ వేసుకోవాలని సూచించారు.

**వెన్ను నొప్పి చికిత్సకు 15 రోజులు కావాలి: చెవిరెడ్డి భాస్కరరెడ్డి**

తాను వెన్నునొప్పితో బాధపడుతున్నానని.. చికిత్స అవసరమని డాక్టర్లు ఇప్పటికే సూచించారని వివరించారు. దీనికి 15 రోజులు అనుమతించాలని కోరారు.

**సిట్, బ్యాంకు అధికారుల సీడీఆర్‌లు తీయించాలి: రాజ్ కెసిరెడ్డి**

సీజ్ చేసిన రూ.11 కోట్లను వేరుగా ఉంచాలన్న కోర్టు ఆదేశాలను సిట్ అమలు చేయలేదని నిందితుడు రాజ్ కెసిరెడ్డి వివరించారు. బ్యాంకు అధికారులు, పోలీసులు కుమ్మక్కై ఆధారాలను ధ్వంసం చేస్తున్నారని ఆరోపించారు. డబ్బు సీజ్ చేసినప్పుడే తనకు సంబంధం లేదని పిటిషన్ వేశానన్నారు. సిట్, బ్యాంకు అధికారుల సీడీఆర్‌లను తీయిస్తే అన్ని విషయాలు బయటకు వస్తాయన్నారు.

**పోలీసులు మా తల్లిని బెదిరిస్తున్నారు: నిందితుడు దిలీప్**

అర్ధరాత్రి సమయాల్లో తన ఇంటికి పోలీసులు వెళ్లి తల్లిని బెదిరింపులకు గురి చేశారని నిందితుడు దిలీప్ చెప్పాడు. ఇప్పుడున్న ఇంటిని 2019లో తన తండ్రి కట్టించారన్నారు. ఆ ఇంటిని తాను కొన్నట్లు చెప్పాలంటూ పోలీసులు కుటుంబ సభ్యులపై ఒత్తిడి తెస్తున్నారని కోర్టులో చెప్పారు

మరిన్ని వార్తా విశేషాలకై... www.viswamvoice.com

## జగన్ ఆగస్టులో జైలు కెళ్ళడం ఖాయం

**– టీ కే విశ్వేశ్వర రెడ్డి జోస్యం**



**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్ జగన్మోహన్ రెడ్డి మీరు ఈ ఆగస్టు నెలలో జైలుకు వెళ్ళటం పక్క నిర్ణయం జరిగిపోయింది అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ టి.కే విశ్వేశ్వరరెడ్డి జోస్యం చెప్పారు.ఆయన ఒక ప్రకటనలో తెలుపుతూ జగన్ జైలు శిక్ష తప్పదు అని ఈ విషయాన్ని అమిత్ షా మన రాష్ట్రంలోని తెలుగుదేశం,జనసేన,బిజెపి నాయకులకు చెప్పడం జరిగింది. మీరు ఇంకా గొర్రె కషాయవాడిని నమ్మినట్టు మీరు నరేంద్ర మోడీని అమిత్ షాని నమ్మడం వల్ల మీకు జైలు జీవితం తప్ప వేరే అవకాశం లేదు, గతంలో 11 సంవత్సరాలు మీ మీద అనేక కేసులు ఉన్నప్పటికీ కూడా మిమ్మల్ని జైలుకు వెళ్లకుండా నరేంద్ర మోడీ, అమిత్ షా కాపాడటానికి కారణం అప్పుడు చంద్రబాబు నాయుడు వాళ్ళ కుటమి లో లేరు అందువల్ల మీరు తక్షణ మీ విధానాలు మార్చుకొని ఎలక్షన్ కమిషన్ మీద పోరాటం చేస్తున్నటువంటి రాహుల్ గాంధీకి మీరు పూర్తిగా మద్దతు తెలియజేసినట్లయితే మీకు మనుగడ ఉంటుంది లేనిచో మీరు జైలు జీవితం తప్పదు గతంలో మీరు జైలుకెలితే సింపతి వచ్చింది కానీ ఇప్పుడు సారా కేసుల్లో మీరు జైలుకెళ్తే మీ పార్టీ నాయకులు కార్యకర్తలు కూడా మీ ముఖం చూడరు అందుగురించి మీరు ఇకనైనా నరేంద్ర మోడీని అమితషా ని నమ్మడం మానేయండి అని అన్నారు.

## నిజాంపేటలో అత్యాధునిక 800 పడకల ఆసుపత్రి

**ఎస్ఎల్జీ హాస్పిటల్స్, అజెంక్య డీవై పాటిల్ కీలక ఒప్పందం..**

**నిజాంపేట, విశ్వం వాయిస్ న్యూస్:** హైదరాబాద్‌లోని నిజాంపేటలో 800 పడకల అత్యాధునిక మల్టీ-స్పెషాలిటీ ఆసుపత్రిని కలిసి నిర్వహించాలని ఎస్ఎల్జీ హాస్పిటల్స్,అజెంక్య డీవై పాటిల్ హెల్త్‌కేర్ సంస్థలు నిర్ణయించాయి. ఈమేరకు ఈ రెండు సంస్థలు వ్యూహాత్మక నిర్వహణ ఒప్పందంపై సంతకాలు చేశాయి.తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రజలకు తక్కువ ఖర్చుతో మంచి వైద్యం అందించడమే ఈ రెండు సంస్థల లక్ష్యం. ఈ కొత్త ఆసుపత్రిలో అత్యవసర చికిత్స, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి వాటికి మంచి వైద్యం అందుబాటులోకి వస్తుంది. దీనివల్ల ఈ ప్రాంత ప్రజలకు వైద్యం కోసం వేరే చోటుకు వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఆసుపత్రి నిర్మాణాన్ని దశలవారీగా పూర్తి చేస్తారు. ఒక్కో దశ పూర్తయిన తర్వాత కొత్త సేవలను ప్రారంభిస్తారు.ఈ సందర్భంగా ఎస్ఎల్జీ హాస్పిటల్స్ చైర్మన్ దండు శివరామరాజు మాట్లాడుతూ.. అందరికీ మంచి వైద్యం అందించాలనే తన కల ఈ ఆసుపత్రితో నెరవేరుతుందన్నారు. అజెంక్య డీవై పాటిల్ హెల్త్‌కేర్ చైర్మన్ డాక్టర్ అజెంక్య పాటిల్ మాట్లాడుతూ, ఈ ఒప్పందం వల్ల రెండు సంస్థల సేవలు విస్తరించి, హైదరాబాద్ ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని తెలిపారు. ఈ ఒప్పందానికి యూకేలోని ఆప్టిమస్ ఇన్వెస్ట్‌మెంట్స్ అనే సంస్థ సలహాలు ఇచ్చింది. ఈ సంస్థకు చెందిన అభయ్ అహూజా ఈ భాగస్వామ్యం దేశంలోనే ఇతర ఆరోగ్య సంస్థలకు ఒక మంచి ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ఈ ఆసుపత్రి వల్ల హైదరాబాద్ వైద్య కేంద్రంగా మరింత బలోపేతం అవ్వడంతో పాటు ప్రజలకు సరసమైన ధరల్లో, నమ్మకమైన వైద్య సేవలు లభిస్తాయి.

## పేరెడ్డి వారి వివాహ వేడుకలలో పాల్గొన్న బత్తుల వెంకటలక్ష్మి



**సీతానగరం విశ్వంవాయిస్ న్యూస్:** సీతానగరం మండలం బొబ్బిల్లంక గ్రామంలో పేనేడ్డి వారి వివాహ వేడుకకు పేనేడ్డి వెంకటరమణ ప్రత్యేక ఆహ్వానం మేరకు జనసేన పార్టీ నా సేన కోసం నా వంతు రాష్ట్ర కమిటీ కోఆర్డినేటర్ బత్తుల వెంకటలక్ష్మి వివాహ వేడుకలో పాల్గొని నూతన వరుడు చి. సాయి తేజని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జనసేన, తెలుగుదేశం, బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## రామచంద్రపురం సొసైటీ డైరెక్టర్‌గా పాలడుగుల ప్రమీల



**సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్:** సీతానగరం మండలం రామ చంద్రపురం నందు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం లిమిటెడ్ త్రీ మెన్ కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం నిర్వహించారు. చైర్మన్గా మండ వెంకటేశ్వరరావు ,డైరెక్టర్లుగా పాలడుగుల ప్రమీల ప్రమాణ స్వీకారం చేశారు .ఈ కార్యక్రమంలో బిజెపి రాజానగరం అసెంబ్లీ ఇన్చార్జ్ మీరు కొండ వీరన్న చౌదరి, సీనియర్ నాయకులు ఏపీ ఆర్ చౌదరి, జిల్లా ప్రధాన కార్యదర్శి మద్దిపాటి రజిని, మద్దాల కొండలరావు, దాసరి సుబ్బారావు, సినీ విద్య మంజీరా, ఏ. చక్రధర్, ఏ. పెంటయ్య,ఎన్. శ్రీను తదితరులు పాల్గొని శుభాకాంక్షలు తెలియజేశారు వీరితో పాటు కూటమి నాయకులు, రైతులు,పి ఏ సి ఎస్ సీఈవో ఎన్. రాంబాబు మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## రఘుదేవపురం సొసైటీ చైర్ పర్సన్‌గా కవల గంగాధర్ రావు ఎంపిక



సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్: తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంకు ఎన్నికైన నూతన పాలక కార్యవర్గ సభ్యుల ప్రమాణ స్వీకార మహోత్సవం (త్రీ మెన్ కమిటీ) కార్యక్రమం ఘనంగా జరిగింది. చైర్ పర్సన్ గా కవల గంగాధర్ రావు,పర్సన్ పెందుర్తి విజయ భాస్కర్, పర్సన్ వాతాడ సత్తిబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పి ఏ సి ఎస్)ద్వారా అన్నదాతలకు మేలు జరుగుతుందని అన్నారు. సొసైటీ చైర్ పర్సన్ కవల గంగాధర్ రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ హయాంలో పి ఎ సి ఎస్ ల పనితీరు రైతులకు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంటుందని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని వ్యవస్థలకు పునర్జీవం తీసుకొచ్చి పూర్తిస్థాయిలో ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ,రాజానగరం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి బొడ్డు వెంకటరమణ చౌదరి బలోపేతం చేస్తున్నారని అన్నారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ప్రతీ సంవత్సరం బడ్జెట్లో వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రైతులకు అండగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ నిలిచారని అన్నారు. రైతుల సంక్షేమం,వారి ఆర్థిక పరిపుష్టికి రఘుదేవపురం గ్రామ సహకార సంఘం దోహదపడుతుందని అన్నారు. సహకార సంఘాల ద్వారా రైతులకు సకాలంలో రుణాలను అందించేందుకు కృషి చేస్తామని త్రీ మెన్ కమిటీ సభ్యులు తెలిపారు. దేశానికి వెన్నెముక అయిన రైతాంగాన్ని అన్ని విధాలగా ఆదుకునేందుకు కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం(పిఎసిఎస్ )ల ద్వారా చైర్ పర్సన్స్ గా నూతన అవకాశం కల్పించినందుకు ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గెద్దాడ త్రిమూర్తులు,దాసరి రమేష్, ఎలమాటి పూసలు,మల్లి కాశి, సత్యం రమేష్ బాబు,దాసరి కోటియ్య,మావిడాల సుబ్రహ్మణ్యం,సాంబెలపు బాలయోగి,సహకార సంఘం సిబ్బంది సెక్రెటరీ గెడ్డం ప్రసాద్,పసలపూడి మహేష్,తాతపూడి అనిల్ ప్రవీణ్,ములగాడ రామకృష్ణ పలువురు కూటమి పార్టీ నాయకులు,కార్యకర్తలు తదితరులు పాల్గొని నూతన కార్యవర్గానికి అభినందనలు తెలియజేశారు.

## జాతీయజెండాలతో తిరంగా యాత్ర బిజెపి బైక్ ర్యాలీ




**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** కేంద్ర పార్టీ పిలుపు మేరకు బుధవారం ఉదయం తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ఆధ్వర్యంలో తిరంగాయాత్ర బైక్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు, అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి విచ్చేశారు.ముందుగా స్వతంత్ర సమరయోధుల పార్కులో స్వాతంత్ర్య సమరయోధుల విగ్రహాలను శుభ్ర పరిచి వారికి నివాళులు అర్పించి అనంతరం తిరంగా యాత్ర బైక్ ర్యాలీ ప్రారంభించారు.సోము వీర్రాజు, రామకృష్ణారెడ్డి స్వయంగా బైక్ నడుపుతూ ర్యాలీ ని ప్రారంభించారు.ఈ ర్యాలీ కోటిపల్లి బస్ స్టాండ్ స్వతంత్ర సమరయోధుల పార్క్ నుంచి మెయిన్ రోడ్డు మీదుగా దేవిచౌక్,కంబాల చెరువు సెంటర్, సి టి ఆర్ ఏ, నారాయణపురం వాటర్ ట్యాంకర్ రోడ్, నాగమ్మ తల్లి గుడి మీదుగా వైట్ హౌస్ మీద నుంచి రామాలయం జంక్షన్ కి చేరుకుని అక్కడ స్వసంత్ర సమరయోధుల అల్లూరి సీతారామరాజు పూల మాలలు వేసి ర్యాలీలో భారత్ మాతాకీ జై భారత్ మాతాకీ జై నినాదాలతో మారుమోగుతూ ర్యాలీ సాగింది.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఓబిసి అధ్యక్షుడు రొంగల గోపి శ్రీనివాస్, పూర్వ అధ్యక్షులు బొమ్మల దత్తు ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అడబాల రామకృష్ణ,మున్ని కృష్ణ ,నర్సిపల్లి హారిక,ఎనుముల రంగబాబు, యానాపు యేసు,రజిని ,వీర వీరాంజనేయులు ,రవిశంకర్ కందికొండ రమేష్ కాలేపు సాయిరాం ,కిరణ్,మరుకుర్తి కుమార్ యాదవ్ ,తగరం సురేష్ ,లలిత్ కుమార్ జైన్ కురగంటి సతీష్,బూర రామచంద్రరావు ,అతిరం కాకరాల పవన్ కుమార్, మండల అధ్యక్షులు అధికార లక్ష్మి, ఎర్ర నాగదేవి, మట్ట నాగబాబు,ఎన్ సత్య నారాయణ , శివ ,రమేష్ కొల్లాపూర్ శీను, రామారావు, మనోజ్ కుమార్ ,పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

### చిన్న కొండేపూడి గ్రామ దళితవాడలో

# డ్రైనేజీలు లేకపోవడంతో వీధుల్లో ప్రవహిస్తున్న మురికినీరు




సీతానగరం విశ్వం వాయిస్ న్యూస్: సీతానగరం మండలం చిన్న కొండేపూడి గ్రామం అంబేద్కర్ నగర్ దళితవాడ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఎటు చూసినా కనీసం కచ్చా డ్రైనేజీలు లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నా మంటూ అంబేద్కర్ నగర్ యువత పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాసరావుకు వినతిపత్రాన్ని అందించారు. వీధుల్లో మురుగునీరు పారుతోందని దీంతో నిత్యం ప్రజలుదుర్వాసనతో,రోగాలతో ఇబ్బందులు పడుతున్నామని వారు అంటున్నారు. డ్రైనేజీలు లేకపోవడం వలన ఇంటిముందే మురుగునీరు నిల్వ ఉండడంతో దోమలు చేరి ఫైలేరియా వంటి రోగాల బారిన పడి గ్రామంలో అధికంగా ఇబ్బందులు పడక తప్పడం లేదని వారంటున్నారు. మా దళిత వ్వాడలో చిన్నపిల్లలు ఉండే అంగన్వాడి సెంటర్ సమీపంలోనే మురికినీరు ప్రవహించడంతో దుర్గంధం వెదజల్లుతోందని ఆ దారిన వెళ్లాలంటేనే నరకంగా ఉందని దీనికి తోడు పందులు సంచరిస్తూ ఉంటున్నాయని తద్వారా గ్రామస్తులకు తరచూగా సీజనల్ వ్యాధులు వస్తున్నాయని వారు అంటున్నారు. డ్రైనేజీలు లేకపోవడం వలన గతంలో స్థానికులు కొందరు దోమల వలన అనారోగ్యం బారిన పడి మరణించిన సందర్భాలు ఉన్నాయని వారు అంటున్నారు. ఎంత మంది పాలకులు,పంచాయతీ అధికారులు మారినా అంబేద్కర్ నగర దళితవాడలో అభివృద్ధికి ఆమడ దూరంలోనే ఉందని పలువురు వాపోతున్నారు.పారిశుధ్య కార్మికులు ఏనాడూ ఇటువైపు కన్నెత్తి చూసింది లేదని స్థానికుల ఆరోపిస్తున్నారు. ఎన్నో ఏళ్లుగా పన్నులు కడుతున్నాం అయినా మురుగు నీటిలోనే సహజీవనం చేస్తున్నాం. పాలకులు మారుతున్నా డ్రైనేజీ వ్యవస్థ పరిస్థితిలో మార్పు రావడం లేదు. కంపు భరించలేమని చినకొండేపూడిలోని అంబేద్కర్ నగర్లో స్థానికులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఇక్కడ 40 కుటుంబాలు ఉన్నాయనీ అనేక ఏళ్లుగా పిల్లాపాపలతో జీవిస్తున్నామనీ ఇప్పటికీ ఇళు ళ్ళ ముందు డ్రైనేజీలు లేక పోవడంతో మురుగు నీటి నుండి చిన్న చిన్న తెల్లటి పురుగులు నివాసాలకు వస్తున్నాయని మురుగు పోయే మార్గం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోజురోజుకూ దోమలు విపరీతంగా పెరుగుతున్నా పట్టించుకునే వారు లేరని జ్వరాలు వస్తున్నా ఇటువైపు చూసే నాయకులు లేరని ఇక్కడ ఉండలేకపోతున్నా మని ఇకనైనా మా వెతలు తీర్చండి మహాప్రభో అంటూ స్థానికులు తమ ఆవేదనను వెల్లబుచ్చుకుంటున్నారు. కనీసం అంబేద్కర్ నగర్లోని హెల్త్ సబ్ సెంటర్ వద్ద వీధిల్లో చిన్నపాటి వర్షానికే ఉండలేకపోతున్నాము కనుక జిల్లా అధికారులు,మండల అధికారులు తక్షణమే స్పందించి డ్రైనేజీ వ్యవస్థను నిర్మించాలని కోరుతున్నామని వారు అంటున్నారు. ఈ కార్యక్రమంలో పత్తి వెంకటేష్, శానంపూడి సూర్యచంద్రం, తాళ్ళూరి చిట్టిబాబు,ఆకాశపు శివ సుబ్రహ్మణ్యం,యాళ్ళ వెంకటరత్నం,శానంపూడి రాజు,బొల్లాడి జయరాజు,పత్తి నాగేంద్రుడు,తాళ్ళూరి వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

## కొవ్వూరు లో హర్ ఘర్ తిరంగా ర్యాలీ

*భారతీయులుగా పుట్టినందుకు గర్వపడాలి – మునిసిపల్ చైర్పర్సన్ భావన*



**విశ్వం వాయిస్ న్యూస్– కొవ్వూరు** కులం ఏదైనా మతం ఏదైనా మనమంతా భారతీయులమని భారతీయుడిగా పుట్టినందుకు గర్వించాలని కొవ్వూరు మున్సిపల్ చైర్పర్సన్ భావన రత్నకుమారి అన్నారు. భారతదేశ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం కొవ్వూరు పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం నుండి ఆర్డీవో కార్యాలయం వరకు హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు 100 మీటర్ల త్రివర్ణ పతాకాన్ని తీసుకుని వందేమాతరం భారత్ మాతాకు జై అనే నినాదాలతో ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ భావన రత్నకుమారి మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల త్యాగాల ఫలితం మనం అనుభవిస్తున్న భారత దేశ స్వాతంత్రం అని అన్నారు. ప్రపంచంలోనే భారతదేశం అగ్రగామిగా ముందుకు సాగుతుందని భారతీయుడిగా పుట్టినందుకు మనం గర్వించాలన్నారు భారతీయులందరూ దేశం పట్ల భక్తిని గౌరవాన్ని కలిగి ఉన్నారని అన్నారు భావితరాలకు భారతదేశం త్రివర్ణ పతాకం ఆవశ్యకత తెలిపేందుకు హర్ ఘర్ తిరంగా ర్యాలీని నిర్వహించడం జరుగుతుందని స్వాతంత్ర దినోత్సవ వేడుకలలో భాగంగా ఆగస్టు 15 వరకు ప్రతి ఇంటిపైన త్రివర్ణ పతాక జెండా ఎగురు వెయ్యాలని అన్నారు ఈ కార్యక్రమంలో కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ గ్రంధి సందీప్ కుమార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జొన్నకూటి సునీత , 9వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మురళీకృష్ణ బాబు జగజీవన్ రామ్ విశ్రాంత ఉద్యోగ సంఘం అధ్యక్షులు పెనుమాక జయరాజు,ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఏబీఎన్ అండ్ పి ఆర్ ఆర్ కాలేజీ విద్యార్థినీ విద్యార్థులు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు

## ఆర్టీసీ డిపో గ్యారేజ్ నందు కండక్టర్లకు డ్రైవర్లకు ఆర్టీసీ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమం

**విశ్వం వాయిస్ న్యూస్ - కొవ్వూరు** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న స్త్రీ శక్తి ఆర్టిసి ఉచిత బస్సు ప్రయాణం కార్యక్రమంలో యాజమాన్యం ఇచ్చిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని డి పి టి ఓ వై వి ఎస్ ఎన్ మూర్తి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ నుండి ఆంధ్ర రాష్ట్రమంతటా మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తున్న సందర్భంగా బుధవారం కొవ్వూరు పట్టణంలోని ఆర్టీసీ డిపో గ్యారేజ్ నందు కండక్టర్లకు డ్రైవర్లకు ఆర్టీసీ ఉద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ సందర్భంగా టి పి టి ఓ వై వి ఎస్ ఎన్ మూర్తి మాట్లాడుతూ జిల్లా పరిధిలోని ప్రతి బస్ స్టేషన్ను పారిశుద్ధ్య నిర్వహణ ప్రయాణికులకు ఎటువంటి అసౌకర్యాలు కలుపుకుండా తగిన ఏర్పాట్లను చేయడం జరిగిందని ఇప్పటివరకు సుమారుగా 50వేల మంది మహిళలు ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని వినియోగిస్తున్నారని స్త్రీ శక్తి ఉచిత బస్సు ప్రయాణం అమలులో సుమారు 70000 మంది మహిళలు ఆర్టీసీ బస్సులు వినియోగించుకోవడం జరుగుతుందని ఈ నేపథ్యంలో ప్రయాణికులకు ఎటువంటి సౌకర్యాలు కలుగకుండా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు తగిన ఏర్పాట్లను చేయడం జరిగిందన్నారు మహిళలకు ఆంధ్రప్రదేశ్ నివాసిగా గుర్తింపు ఉండేందుకు ఆధార్ కానీ రేషన్ కార్డు కానీ తగిన గుర్తింపు కార్డును తీసుకువచ్చి ఉచిత బస్సు ప్రయాణం టిక్కెట్టును పొందాలన్నారు ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో అవసరతలను గుర్తించి తగిన బస్సులను అందించే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు ఆర్టీసీ యాజమాన్యం ఇచ్చిన మార్గదర్శకాలను ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా పాటించాలన్నారు ఈ కార్యక్రమంలో కొవ్వుర్ ఆర్ టి సి డిపో మేనేజర్ ధనుంజయ్ గ్యారేజ్ ఏ ఎంఎఫ్ సునైనా ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు

## కొవ్వూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రత్యేక కంట్రోల్ రూమ్ - ఆర్డిఓ రాణి సుస్మిత

**విశ్వం వాయిస్ న్యూస్ - కొవ్వూరు**



ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనల మేరకు, జిల్లా కలెక్టర్ ఆదేశాల అనుసరించి విపత్తు పరిస్థితుల పర్యవేక్షణ మరియు ప్రజలకు తక్షణ సాయం అందించేందుకు కొవ్వూరు రెవెన్యూ డివిజన్‌లో ప్రత్యేక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందనీ కొవ్వూరు రెవెన్యూ డివిజనల్ అధికారి రాణి సుస్మిత బుధవారం ఒక ప్రకటనలో తెలియచేసారు.కొవ్వూరు డివిజన్ పరిధిలో కంట్రోల్ రూమ్ ఫోన్ నంబర్: 08813-231488 ద్వారా 24 గంటలపాటు అందుబాటులో ఉంటుందనీ, ఆయా సమయాల్లో సంబంధించిన సిబ్బందికి తగిన సమాచారం ఇవ్వాలని కోరారు.

## ఎడిటర్ వాయిస్


# పొదుపుకు పిసినారితనానికి తేడా!

ధనం మూలం ఇదం జగత్ – ప్రపంచం ధనంతోనే నడుస్తుంది. డబ్బు ఎవరికీ చేదు కాదు. ధనమేరా అన్నిటికీ మూలం. ధనం విలువ తెలుసుకొనుట మానవ ధర్మం. డిజిటల్ యుగంలో ఆర్థిక వనరులే అన్నింటినీ శాసిస్తున్నాయి. నేటి మానవ బంధాలన్నీ వాణిజ్య బంధాలుగా మారాయి. డబ్బు సంపాదించడం ఒక ఎత్తు, సంపాదించిన డబ్బును వినియోగించడం మరో ఎత్తు. ఎంత సంపాదించామన్నదాని కన్న ఎంత ఆదా చేస్తున్నామన్నది ముఖ్యమని మన జీవిత అనుభవాలు స్పష్టం చేస్తున్నాయి. ఆర్థిక క్రమశిక్షణ కొరవడిన కుటుంబాలు బజారున పడడం చూస్తున్నాం. ఆదాయాన్ని క్రమ ప్రణాళికతో ఖర్చు చేయడం వల్ల ఆ వ్యక్తితో పాటు కుటుంబం కూడా సుఖ సంతోషాలతో, ధైర్యంగా జీవనయానం కొనసాగిస్తారు. అనాలోచితంగా, విచ్ఛలవిడిగా ఖర్చు చేసిన వారు ఎంత సంపాదించినా ప్రయోజనం శూన్యమే. నేటి ఆదాయం రేపటికి పునాది కావాలి. ఆర్థిక క్రమశిక్షణ చిన్నతనం నుంచే అలవాటు కావాలి. ఉన్నత విద్యావంతుల్లో కూడా ఆర్థిక నిరక్షరాస్యత కనిపిస్తున్నది. ఆర్థిక అవగాహన లేమితో కుటుంబాలు అశాంతి నెలవులుగా మారుతున్నాయి. నేటి పిల్లలు, యువతలో ఆర్థిక నిరక్షరాస్యత రాజ్యమేలుతున్నది. ఎంత సంపాదించామన్నది ముఖ్యం కాదని, ఆదాయంలో ఎంత పొదుపు చేశామన్నదే ప్రధానమని మరిచిన ఏఐ ప్రపంచంలో మనం ఉన్నాం. నేటి పిల్లల నుంచి కురువృద్ధుల వరకు అందరికీ ఆర్థిక అక్షరాస్యత కల్పించటానికి ప్రతి ఏట 14 ఆగష్టున "జాతీయ ఆర్థిక అవగాహన దినం" లేదా "నేషనల్ ఫైనాన్సియల్ అవేర్నెస్ డే" పాటించడం జరుగుతోంది. మన విద్యా వ్యవస్థలో కూడా ఆర్థిక అక్షరాస్యతను బోధించడం లేదు. చిన్న పిల్లలకు పాకెట్ మనీ ఇచ్చినపుడు వారు 'గల్ల గురిగి'లో వేసి దాచుకోవడం మనకు తెలుసు. అదే అలవాటు క్రమంగా ఆర్థిక క్రమశిక్షణకు పునాదిగా మారుతుంది. చిన్నతనంలోనే విచ్ఛలవిడిగా ఖర్చు చేయడం అలవాటు అయితే రేపటివారి భవిత అంధకారంలోకి జారిపోవడం ఖాయమని తెలుసుకోవాలి. పిల్లాడి స్థాయిలో అలవాటు అయిన ఆర్థిక క్రమశిక్షణ రేపటి కుటుంబ శాంతికి పునాదిగా మారుతుంది. జాతీయ ఆర్థిక అవగాహన దినం వేదికగా వేతనం పొందడం, పొదుపు చేయడం, ఆర్థిక ప్రణాళికలు వేయడం, కనీస ఖర్చులు చేయడం, తప్పని పరిస్థితుల్లో అప్పు చేయడం, ఆస్తులను పెట్టుకోవడం లేదా కాపాడుకోవడం లాంటి అంశాలను అవగాహన కలిగించాలి. మన నెలసరి ఆదాయంలో కొంత కుటుంబ ఖర్చులకు, కొంత పిల్లల చదువులకు, కొంత అత్యవసర సామాజిక ఖర్చులకు వెచ్చించిన పిదప తప్పనిసరిగా కొంత డబ్బును పొదుపు లేదా ఆదా చేయడం అలవాటుగా మారాలి. నేడు పొదుపు చేసిన ధనం రేపటి ఊహించని అత్యవసర సమయాల్లో మనల్ని ఆదుకుంటుంది. పొదుపు చేసిన డబ్బును సరైన పద్ధతిలో పెట్టుబడి పెడుతూ, మన ఆస్తిని పెంచుకోవచ్చు. ఉద్యోగ నిర్వహణలో నైపుణ్యాలు ఉన్నట్లే, మన ఆదాయాన్ని సరైన పద్ధతిలో ఖర్చు చేసే ఆర్థిక నైపుణ్యాలను కూడా నేర్చుకోవాలి. చిరిగిన బట్టలు వేసుకోవడం, తెగిన చెప్పును తిరిగి తిరిగి వాడడం, సనీస అవసరాలకు ఖర్చు చేయకపోవడం, తింటే ఖర్చు అవుతుందని కాలే కడుపుతో పడుకోవడం లాంటివని పిసినారి గుణాలుగా భావిస్తాం. విలాసాలను కూడా కనీస అవసరాలు అనుకుంటూ, గోరుతో పోయే దానిని గొడ్డలి దాకా తెచ్చుకున్నట్లు, తక్కువ ఖర్చుతో జరిగే పనికి అనేక రెట్లు అధికంగా ధనాన్ని నీటి వలె ఖర్చు చేయడం వల్ల భవిష్యత్తు చిక్కుల్లో పడుతుంది, రుణ విష వలయంలోకి నెట్టి వేస్తుంది. డబ్బు ఉన్నపుడు ఎగిరి పడడం, లేనప్పుడు కుంగి పోవడం ధీరత్వం కాదు. అప్పులు చేయడం, ఆర్థిక చిక్కులతో ఆత్మహత్య చేసుకోవడం వీరత్వం కాదు. ప్రాధాన్యాలను మరిచి విచక్షణారహితంగా ఖర్చు చేయవద్దు. కనీస అవసరాలకు, విలాసాలకు మధ్య వ్యత్యాసం తెలుసుకోవాలి. మన పిల్లలకు పాఠశాల స్థాయి నుంచి కంప్యూటర్ లిటరసీ నేర్పిలట్లే, ఆ చిన్నారులకు ఫైనాన్సియల్ లిటరసీ కూడా నేర్పాలి. ఆకర్షణీయ వేతనం అందించిన విద్యకు సరి సమానంగా ఆదాయాన్ని ఖర్చు చేసే ఆర్థిక అక్షరాస్యత కూడా అవసరమని తెలుసుకోవాలి. చాప ఉన్నంత వరకే కాళ్లు చాపుకున్నట్లు, ఆదాయ పరిమితులను గమనించి ఖర్చులను కుదించుకోవాలి. అనారోగ్యాలు, ప్రమాదాలు చెప్పి రావు కాబట్టి రేపటి అత్యవసరాలను నేటి పొదుపు ఆదుకునే విధంగా ప్రణాళికలు వేసుకోవాలి. దీపం ఉన్నప్పుడే ఇళ్లు చక్క బెట్టుకున్నట్లు, డబ్బు ఉన్నపుడే ఆదా చేయడం నేర్చుకోవాలి. మన నెలసరి ఆదాయంలో కొంత మొత్తం పొదుపు చేయడం వల్ల అనేక ప్రయోజనాలు కలుగుతాయని తెలుసుకోవాలి. ఆదా చేసిన వ్యక్తుల్లో ధైర్యం, మనో శాంతి, భయం తొలగడం, ప్రతికూల సమయాలను ఎదుర్కోగలగడమనే ధీమా, కుటుంబ సభ్యుల భద్రత, ఆనంద ఆరోగ్యకర వాతావరణం, పిల్లలకు ఆర్థిక క్రమశిక్షణ అలవడడం, ఆస్తులను పెంచకపోవడం, పిల్లలకు ఉన్నత చదువులను అందించగలగడం లాంటి ప్రయోజనాలు కలుగుతాయి. ప్రేమ పేరుతో గాని లేదా ఫాల్స్ ప్రిస్టేజ్ కోసం అంటూ పిల్లలు లేదా యువత అడిగినంతనే అధిక మొత్తంలో డబ్బును అందించడం వల్ల ఆ చిన్నారులకు లేదా యువతకు విచ్ఛలవిడిగా ఖర్చు చేయడం దురలవాటుగా మారుతుంది. నేడు చేసిన పొదుపు రేపటికి భరోసాను అందిస్తుంది. కుటుంబ అవసరాలు, పిల్లల విద్యకు తగిన ఖర్చులకు వెనకాడకుండా కొంత సొమ్మును



ఎడిటర్ : కె. సునీల్‌కుమార్

# భారత స్వాతంత్ర్య చట్టం 1947



పొట్ట కోటికోసం, సుగంధ ద్రవ్యాల వ్యాపారార్థం 1498లో వాస్కోడగామా కాలికట్ లోని కోజికొడ్ ఓడ రేవులో కాలూనినది మొదలు ఐరోపా వర్తకుల రాకపోకలు భారత ఉప ఖండంలో ప్రారంభమైనాయి. 1757లో జరిగిన ప్లాసీ యుద్ధంలో రాబర్ట్ క్లైవ్ నేతృత్వంలోని బ్రిటీష్ సైన్యం బెంగాల్ నవాబుపై విజయం సాధించ టంతో, భారత దేశంలో ఈస్ట్ ఇండియా కంపెనీ పాలన ప్రారంభమైంది. 1773 రెగ్యులేటింగ్ చట్టం, 1784లో చేసిన ఇండియా చట్టం, 1833 చార్టర్ చట్టం మెదలైన చట్టాలు భారతదేశంలో బ్రిటీష్ అధికారాన్ని సుస్థిరం చేశాయి. 1849 పంజాబ్ ఆక్రమణ తరువాత అనేక చిన్నచిన్న తిరుగుబాట్లు, అనంతరం 1857 సిపాయిల తిరుగుబాటు ఫలితంగా, బ్రిటీష్ వారు ఈస్ట్ ఇండియా కంపెనీ పరిపాలనను రద్దు చేసి విక్టో రియా రాణి పరిపాలనను ప్రవేశ పెట్టారు. భారత పాలనా వ్యవహారాలను చూసుకోవటానికి వైస్రా యిని నియమించారు. ఈ విధంగా భారతదేశం నేరుగా బ్రిటీష్ పాలనలోకి వచ్చింది. 90 ఏళ్ల స్వాతంత్ర్య పోరాట క్రమాల అనంతరం చివరి బ్రిటీష్ గవర్నర్ జనరల్ అయిన విస్కౌట్ లూయీస్ మౌంట్ బాటెన్ 1947 జూన్ 3 న బ్రిటీష్ ఇండియాని లౌకిక భారత దేశం గాను, ఇస్లామిక్ పాకిస్తాన్ గాను విభజిస్తున్నట్లు ప్రకటిం చారు. 1947 ఆగస్టు 14న పాకిస్తాన్, 1947 ఇవ్వబడుతుంది. ఆగస్టు 15 న భారత దేశం స్వతంత్ర దేశాలుగా అవతరించాయి. భారత స్వాతంత్ర్య చట్టం 1947 అన్నది బ్రిటిషు ఇండియాను భారతదేశం, పాకిస్తాన్ అన్న రెండు స్వతంత్ర డొమినియన్లుగా విభజించేందుకు యునైటెడ్ కింగ్ డమ్ పార్లమెంటు చేసిన చట్టం. జూలై 18, 1947న ఈ చట్టం రాజ సమ్మతి పొందింది. సంప్రదింపుల అనంతరం జవహర్ లాల్ నెహ్రూ, వల్లభ్ బాయి పటేల్, ఆచార్య కృపలానీ ప్రాతినిధ్యం వహించిన కాంగ్రెస్ పార్టీ, మహమ్మద్ అలీ జిన్నా, లియాఖత్ అలీ ఖాన్, అబ్దుల్ రబ్ నిష్తార్ ప్రాతినిధ్యంలోని ముస్లిం లీగ్, సిక్కుల ప్రతినిధిగా సర్దార్ బల్దేవ్ సింగ్లతో గవర్నర్ జన రల్ ఆఫ్ ఇండియా లార్డ్ మౌంట్ బాటన్ ఒప్పందానికి వచ్చాక, భారత స్వాతంత్ర్య అనుకూలుడైన బ్రిటిష్ ప్రధాన మంత్రి క్లెమెంట్ అట్లీ ప్రభుత్వం, భారత గవర్నర్ జనరల్ లార్డ్ మౌంట్ బాటన్ కలిసి చట్టాన్ని తయారు చేశారు. అధికార బదిలీ కోసం సంప్రదింపులు చేసేందుకు వచ్చిన క్యాబి నెట్ మిషన్ సమైక్య భారత సమాఖ్య ప్రతిపాదన (మే 16 ప్రతిపాదన)కు కాంగ్రెస్, ముస్లింలీగ్ ల ఆమోదం లభించింది. కానీ కేబినెట్ మిషన్ సభ్యుడు క్రిప్స్ ఎవరికి అనుకూలమైన నిర్వచనం వారికి చెప్తూ ఆమోదం పొందడంతో వారు వెళ్ళగానే కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు జవహర్ లాల్ నెహ్రూ ప్రసింగిస్తూ, దాన్ని పూర్తిగా తిరస్కరిం చాడు. దాంతో ఆగ్రహించిన ముస్లిం లీగ్ నాయ కుడు జిన్నా ప్రత్యక్ష కార్యాచరణకు పిలుపుతో హింసాత్మకమైన మలుపుతో కాంగ్రెస్, బ్రిటిషు ప్రభుత్వాలపై ఒత్తిడి వచ్చింది. ఈ నేపథ్యంలో దేశాన్ని సమాఖ్యగా ఉంచే మే 16 ప్రతిపాదన, పూర్తి బెంగాల్, పూర్తి పంజాబ్ లతో పాకిస్తాన్ విభజించి ఏర్పరిచే జూన్ 16 ప్రతిపాదనకు మధ్యగా మరో ప్రణాళికను ముందు సివిల్ సర్వెంట్ వి.కె.మీనన్ తయారు చేశారు. దీని ప్రకారం బ్రిటిషు ఇండియా... భారత దేశం, పాకిస్తాన్లుగా విభజన అవుతుంది. అలాగే బెంగాల్, పంజాబ్ ప్రావిన్సులు కూడా విభజితమై, ముస్లింలు ఎక్కు వగా ఉన్న ప్రాంతాలు పాకిస్తాను, హిందువుల సంఖ్యాధిక్యత ఉన్న ప్రాంతాలు భారతదేశానికి లభిస్తాయి. ఇది మౌంట్ బాటన్ ప్రణాళికగా పేరొందింది. బ్రిటిష్ ప్రధాన మంత్రి క్లెమెంట్ అట్లీ 1947 ఫిబ్రవరి 20న చేసిన ప్రకటన ప్రకారం బ్రిటిషు ప్రభుత్వం బ్రిటిషు ఇండియాకు పూర్తి స్వంత ప్రభు త్వాన్ని కనీసం 1948 జూన్ నాటికి మంజూరు చేస్తుంది. తుది (అధికార) బదిలీ తేదీ నిర్ణయించిన తర్వాత సంస్థానాల భవితవ్యం నిర్ణయమవు తుంది. ప్రధానంగా లార్డ్ మౌంట్ బాటన్ ప్రణాళికగా పేరొందిన బ్రిటిషు ప్రభుత్వం 1947 జూన్ 3న ప్రతిపాదించిన ప్రణాళికలో గల అంశాలు భారత విభజనకు సూత్రాన్ని బ్రిటిషు ప్రభుత్వం అంగీకరించింది. వారసులుగా వచ్చే ప్రభుత్వాలకు డొమినియన్ స్థాయి ఇవ్వ బడుతుంది. బ్రిటిషు కామన్వెల్త్ నుంచి ఎప్పుడైనా తప్పుకునేందుకు షర తులులేని హక్కు ఉంటుంది. అలా భారత స్వాతంత్ర్య చట్టం 1947 అన్నది జూన్ 3 ప్రణాళికకు అమలు వంటిది. 1947 ఆగస్టు 15న బ్రిటిష్ ఇండియాను భారత దేశం, పాకిస్తాన్ అనే రెండు కొత్త దేశాలుగా విభ జించడంబీ బెంగాల్, పంజాబ్ ప్రావిన్సుల విభ జించి, రెండు కొత్త దేశాలకు పంపకం చెయ్యడంబీ రెండు కొత్త దేశాలలో గవర్నర్ జనరల్ కార్యాల యాన్ని బ్రిటన్ రాచరికపు ప్రతినిధిగా ఏర్పాటు చేయడంబీ రెండు కొత్త దేశాల రాజ్యాంగ సభలకు పూర్తి శాసనాధికారాన్ని ఇవ్వడంబీ 1947 ఆగస్టు 15 న సంస్థానాలపై బ్రిటిష్ అధికారాన్ని ముగిం చడం. స్వతంత్రంగా ఉండడానికి గాని, ఏదో ఒక దేశంలో చేరడానికి గాని వాటికి ఉన్న హక్కును గుర్తించడంబీ బ్రిటిషు చక్రవర్తి 'భారత చక్రవర్తి' అనే పేరును వాడడాన్ని రద్దు చేయడం (కింగ్ జార్జ్ %ఎ×% రాజు 1948 జూన్ 22 న రాజ ప్రకటన ద్వారా దీన్ని అమలు చేశాడు). సాయుధ దళాల విభజనతో సహా ఉమ్మడి ఆస్తిని రెండు కొత్త దేశాల మధ్య పంపకానికి ఈ చట్టం ఏర్పాటు చేసింది. ఈ చట్టం ప్రకారం భారతదేశం, పాకిస్తాన్. రెండు కొత్త డొమినియన్లు భారత సామ్రాజ్యం నుండి. ఉద్భవిస్తాయి. 1947 ఆగస్టు 15 ను విభజన తేదీగా నిర్ణయించారు. కొత్త రాజ్యాంగాన్ని రూపొందించే లోపు, కొత్త రాజ్యాలను, దాని ప్రావిన్సులనూ భారత ప్రభుత్వ చట్టం 1935కు లోబడి కొత్త డొమినియన్ల ఏర్పాటు ఫలితంగా...హిస్ మెజెస్టీ ప్రభుత్వం కొత్త డొమినియన్లపై అన్ని బాధ్య తలను కోల్పోయింది. భారతీయ రాష్ట్రాలపై హిజ్ మెజెస్టీ ప్రభుత్వం అధికారం ముగిసింది. ఈ చట్టం ఆమోదించే టప్పుడు అమలులో ఉన్న భారతీయ రాష్ట్రాలు, గిరిజన ప్రాంతాలతో ఉన్న అన్ని ఒప్పం దాలూ, ఒడంబడికలూ ముగిశాయి. బ్రిటిష్ క్రౌన్ బిరుదుల నుండి 'భారత చక్రవర్తి' అనే బిరుదు తొలగించబడింది. సెక్రెటరీ ఆఫ్ స్టేట్ ఫర్ ఇండియా కార్యాలయం రద్దు అయింది. 1947 జూన్ 4 న, మౌంట్ బాటెన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. తద్వారా దేశంలోని 563 కు పైగా ఉన్న భారతీయ సంస్థానాలకు, బ్రిటన్కు మధ్య ఉన్న ఒప్పందం సంబంధాలు ముగిసి పోతాయని, 1947 ఆగస్టు 15న బ్రిటిష్ అధికారం ముగుస్తుందని, క్రొత్త డొమినియన్లలో ఏదో ఒకదానిలో చేరడానికి, లేదా స్వతంత్రంగా ఉండడానికి వారికి స్వేచ్ఛ ఉంటుందని వివరిం చారు. చివరి వైస్రాయ్ లార్డ్ మౌంట్ బాటన్ భారత గవర్నర్ జనరల్గా కొనసాగాలని భారత నాయకులు కోరారు. జవహర్లాల్ నెహ్రూ భారత ప్రధాని, సర్దార్ వల్లభాయ్ పటేల్ హోంమంత్రి అయ్యారు. ఆగస్టు 15 నాటికి 560కి పైగా రాచ రిక రాష్ట్రాలు భారత దేశానికి చేరాయి. తర్వాత జమ్మూ కశ్మీర్ 1947 అక్టోబరు 26 న, హైదరా బాద్ రాజ్యం భారత ప్రభుత్వ 1948 సెప్టెంబరు 13 న సైనిక చర్య జోక్యం ద్వారా సెప్టెంబర్ 17న భారతదేశంలో విలీనం అయింది.

# సామాజిక సంస్కర్త గోపరాజు లవణం



జి. లవణం లేదా లవణంగా సుపరిచితులు అయిన గోపరాజు రామచంద్ర లవణం (10 అక్టోబర్ 1930 – 14 ఆగష్టు 2015)... గోరా గా ప్రసిద్ధి చెందిన గోపరాజు రామచంద్ర రావుకు లవణం పెద్ద కుమారుడు. ఉప్పు సత్యాగ్రహం సాగుతున్న కాలంలో పుట్టిన ఆయనకు లవణం అని పేరు పెట్టారు. తొమ్మిది మంది సంతానం కాగా, గోరా తన కుమారులకు వారు పుట్టినప్పటి ప్రపంచ, దేశ పరిస్థితులకు అద్దం పడుతూ విలక్షణమైన పేర్లు పెట్టాడు. ఉప్పు సత్యాగ్రహం సాగుతున్న కాలంలో పుట్టిన కుమారునికి లవణం అని, భారతీయులు ఛట్ట సభల్లో నిలిచి గెలిచిన కాలంలో పుట్టిన కొడుక్కు విజయం: అని, రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో పుట్టిన కుమారులకు సమరం, నియంత అని, తొమ్మిదవ సంతానానికి నవ్ అని పేర్లు పెట్టారు. గాంధీ ఇర్విన్ ఒడంబడిక సందర్భంలో పుట్టిన అమ్మాయికి మైత్రి అని, మరో కుమార్తె పేరు మనోరమ అని పెట్టారు. లవణం తండ్రి బాటలో నడిచాడు. లవణం భారతీయ సామాజిక సంస్కర్త. గాంధేయవాది, హేతువాది. ఆయన భారతీయ సమాజంలోని అంటరానితనాన్ని తొలగించడానికి పని చేశాడు. ఆయన నాస్తికుడు. ఆయన సతీమణి హేమలత లవణంతో కలిసి సంస్కార్ సంస్థను స్థాపించారు. నాస్తికమార్గం పత్రికల సంపాదకుడుగా పని చేసాడు. లవణం చిన్నతనం లోనే స్వాతంత్ర్యోద్య మంలో పాల్గొన్నాడు. 1973లో విజయవాడ హేతువాద సంఘ అధ్యక్షుడిగా నియమితుడు అయినాడు. అస్పృశ్యతా నిర్మూలన కుల నిర్మూలన కోసం కృషిచేశాడు. నవయుగ కవి చక్రవర్తి, పద్మ విభూషణ్ గుర్రం జాషువా యొక్క కుమార్తె హేమలతను మహాత్మా గాంధీ ఆశ్రమంలో వివాహం చేసుకున్నాడు. గాంధేయ విలువలకు కట్టుబడి సామాజిక అభ్యున్నతికి అంకితమై పని చేశాడు. మహాత్మాగాంధీ వ్యక్తిత్వం, వినోబా భావేల ప్రభావంతో, నిరాడంబరంగా ఎలా జీవించాలో వారి నుంచే నేర్చుకున్నాడు. సామాజిక జాగృతికి అనేక విధాల కృషి చేస్తున్న లవణం హేతువాదం, నాస్తిక వాదంపై అనేక గ్రంథాలు రచించాడు. సంఘం, ది ఎథిస్ట్, నాస్తిక మార్గం పత్రికలు లవణం సంపాదకీయంలో వెలువడ్డాయి. భారత నాస్తిక కేంద్రం డైరెక్టర్ గా వ్యవహరించాడు. సమాజంలో వేళ్లూనుకున్న మూఢ విశ్వాసాలు, మత మౌఢ్యానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నడిపాడు. హేమలత, లవణం దంపతులు గొప్ప సంఘ సంస్కర్తలు. సంస్కార్ అనే స్వచ్ఛంద సంస్థను స్థాపించి, నిజామాబాద్ జిల్లాలో జోగిని వ్యవస్థను రూపుమాపేందుకు కంకణం కట్టుకున్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలంలో ఉంటూ జిల్లాలో ఎన్నో గ్రామాలను దత్తత తీసుకుని, అనేక సంఘసేవా, గ్రామాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. నిజామాబాద్ జిల్లాలో ఉన్న 'జోగినీ' దురాచార వ్యవస్థను, ప్రజల్లో ఉన్న మూఢ నమ్మకాలను తొలగించి, ప్రజలను చైతన్య పరచి, దురాచారాలను పూర్తిగా నిర్మూలించ గలిగారు. "ప్లాన్ ఇంటర్నేషనల్" వారి ఆర్థిక సాయంతో అనేక గ్రామాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తూ మార్ని రామకృష్ణారావు సలహా మేరకు అక్బర్ నగర్ గ్రామంలో గ్రామస్థుల సహాయంతో ప్రకృతి ఆశ్రమాన్ని 1997 లో ప్రారంభించడం జరిగింది. అయితే 2006 లో సంస్థతో చేసుకున్న 9 సంవత్సరాల అగ్రిమెంట్ పూర్తి అయిపోవడం వల్ల వచ్చే రోగులు ఇచ్చే ఆదాయంతో ఆశ్రమం నిర్వహించడం కష్టం అయింది. పల్లెటూరు అవడం, మరియు 5,10 కి మించి రోగులు రాకపోవడం వల్ల ఆశ్రమ నిర్వహణ కష్టమయింది. ఆ సమయంలో లవణం దంపతులు, మార్ని రామకృష్ణారావును కలసి మంతెన సత్యనారాయణ రాజుకు ఆ ప్రకృతి ఆశ్రమం ఉచితంగా 33 సంవత్సరాల లీజు అగ్రిమెంటుతో అప్పగించడం జరిగింది. అలా సంస్కార్ ప్రకృతి ఆశ్రమం అతి తక్కువ ఫీజులతో భారత దేశంలో మరెక్కడాలేనంత తక్కువ ధరలలో వైద్యసేవలందింస్తోంది. నాస్తికత్వం – అభివృద్ధి– చరిత్ర 1978, కోవూర్ జీవితం 1980 తదితర రచనలు చేశాడు. నేను నాస్తికుడిని, దేవుని నమ్మను. పూజించను. ఇతరులు ఎంతోమంది నమ్ముతారు. పూజిస్తారు. ఒకరి భావాలు మరొకరికి నచ్చవు. కొందరు నన్ను వ్యతిరేకిస్తారు. ఇంకొందరు ముఖం మీదనే తిడతారు. అయినా నేను వారి పట్ల ద్వేష భావం పెంచుకోను. పోట్లాటకు, వాదనలకు దిగను నేను స్వతహాగా హాస్య ప్రియుడిని, ఎప్పుడూ సరదాగా ఉండాలనుకునే మనస్తత్వం నాది అని తరుచూ చెపుతుండే వాడు. 1991లో అంతర్జాతీయ నాస్తికత్వాన్ని 1980 నుండి 1990 వరకు ప్రోత్సహించి నందుకు లాస్ ఏంజిల్స్ లోని నాస్తికుల యునైటెడ్ నుండి నాస్తికుడు అవార్డు, 2009లో డీనోటిఫైడ్ తెగల సభ్యులకు పునరావాసం మరియు ఉపాధి అవకాశాలను అందించి నందుకు జమ్నాలాల్ బజాజ్ అవార్డు, 2011లో ప్రపంచ శాంతికి మరియు మానవత్వానికి సేవ చేసినందుకు వైష్ణవ సెంటర్ ఫర్ ఎన్లైన్మెంట్తో అనుబంధంగా ఉన్న ఇంటర్నేషనల్ సర్వీస్ సొసైటీ నుండి లైఫ్ఎమ్ అచీవ్ మెంట్ అవార్డు, 2015లో మానవ హక్కులు మరియు సామాజిక సంస్కరణలను ప్రోత్సహించడానికి ఆయన చేసిన కృషికి హైదరాబాద్ లోని ప్రోబ్ రిసోర్స్ సెంటర్ ఫర్ జర్నలిస్ట్ నుండి అంతర్జాతీయ హ్యూమనిస్ట్ అవార్డు తదితరాలు ఆయనకు లభించాయి. కొంత కాలం ఊపిరి తిత్తుల వ్యాధితో బాధపడుతూ, 2015, ఆగష్టు 14న విజయవాడలోని ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.



## భీమవరం లో హర్ ఘర్ తిరంగా యాత్ర

### జాతీయ జెండాలతో కేంద్ర మంత్రి బైక్ ర్యాలీ




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** బుధవారం భీమవరం లో పశ్చిమగోదావరి జిల్లా బీజేపీ అధ్యక్షులు అయినంపూడి శ్రీదేవి ఆధ్వర్యంలో హర్ ఘర్ తిరంగా యాత్ర ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ, హర్ ఘర్ తిరంగా యాత్ర జోనల్ ఇంచార్జి నల్లా పవన్ కుమార్, తిరంగా యాత్ర జిల్లా ఇంచార్జీ లు ఆకుల లీలా కృష్ణ, పెరిచెర్ల సుభాష్ లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రతి ఇంటి మీద జాతీయ జెండా ఎగరవేయాలని నినాదాలు చేశారు. అనంతరం జాతీయ జెండాలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారీగా బీజేపీ నేతలు పాల్గొన్నారు.

## జిల్లా మార్పుపై కార్మిక మంత్రికి వినతి పత్రం



**రామచంద్రాపురం నియోజకవర్గం విశ్వం వాయిస్ న్యూస్ :-** రామచంద్రపురం నియోజవర్గంలోని కే. గంగవరం రామచంద్రపురం రూరల్ మరియు మున్సిపాలిటీలను కాకినాడ జిల్లాలో విలీనం చేయాలంటూ రాష్ట్ర కార్మిక శాఖా మంత్రి వాసంశెట్టి సుభాష్ కు మాగాపు అమ్మిరాజు ఆధ్వర్యంలో న్యాయవాదుల బృందం బుధవారం మంత్రి క్యాంపు కార్యాలయంలో వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా న్యాయవాది మాగాపు అమ్మిరాజు మాట్లాడుతూ జిల్లాల పునర్విభజనకు జరుగుతున్న కసరత్తులో భాగంగా భౌగోళికంగా అమలాపురానికి రామచంద్రపురం నియోజకవర్గం ప్రజలు ప్రయాణానికి దూరంగా ఉందని, ఇక్కడ ప్రజల కోరిక మేరకు కాకినాడ జిల్లాలో విలీనం చేసేందుకు సహకరించాలని కోరారు.త్వరలోనే జేఏసీ ఏర్పాటుచేసి ఆయా మండలాలు ఆయా పంచాయతీల తీర్మానాలు కూడా తీసుకుంటామని, ఆయా ప్రజా ప్రతినిధులతో కలిసి ఒక నిర్ణయం తీసుకొని,కలిసి పోరాటం ఉద్ధృతం చేస్తామని అమ్మి రాజు అన్నారు.ఈ విషయపై మంత్రి సుభాష్ స్పందిస్తూ ముఖ్య మంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్తానని మంత్రి సుభాష్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది దోమ్మలపాటి సత్యనారాయణ,గాలి%శీ%కి చిట్టిబాబు, తెలుగుదేశం నాయకులు రవ్వ భూషణం,ఆళ్ల బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

## అమలాపురం లో డ్రగ్స్ కి వ్యతిరేకంగా ర్యాలీ




**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏరియా హాస్పిటల్ అమలాపురంలో డి-అడిక్షన్ సెంటర్ ఆధ్వర్యంలో నశా ముక్త భారత్ అభియాన్ (ఎన్ ఎమ్ బి ఎ ) కార్యక్రమం కింద డ్రగ్స్ వ్యతిరేక భారీ ర్యాలీ బుధవారం నిర్వహించారు. జిల్లా అదనపు డీఎంహెచ్ఓ భారత్ లక్ష్మి ర్యాలీకి ప్రారంభ సంకేతం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జనరల్ మెడిసిన్ విభాగానికి చెందిన డాక్టర్ కె. రవితేజ, డి-అడిక్షన్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయిరాం, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ శ్రీను బాబు, ఏరియా హాస్పిటల్ డైరెక్టర్ వలవల శివరావు పాల్గొన్నారు. ర్యాలీలో ఈగల్ సెల్ పోలీస్ విభాగం, జన కళ్యాణ్ ఎన్జీవో, న్యూ లైఫ్ డి-అడిక్షన్ సిబ్బంది, వియాన్ ఎన్జీవో సిబ్బంది, మిరియం డిగ్రీ కాలేజ్, పరంజ్యోతి ఐటీఐ కాలేజ్, నర్సింగ్ కాలేజ్ విద్యార్థులు, డి-అడిక్షన్ సెంటర్ సిబ్బంది, ఏరియా హాస్పిటల్ పారామెడికల్ సిబ్బంది పాల్గొని డ్రగ్స్ వ్యతిరేక ప్రతిజ్ఞ మరియు నినాదాలు చేశారు.

# జిల్లా కేంద్రానికి వెళ్లే దూర భారం తగ్గించండి

**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-** అంబేద్కర్ విగ్రహం వద్ద పీ.డీ.ఎస్.యూ,పీ.వై.ఎల్ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన ధర్నా నిరహించారు.అందులో భాగంగా రామచంద్రపురం నియోజకవర్గ ప్రజలకు రవాణా మరియు పరిపాలనా సౌకర్యాలు సులభంగా అందుబాటులో ఉండే విధంగా కాకినాడ జిల్లాలో విలీనం చేయాలని ప్రధాన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమాన్ని ఉదేశించి పీ.డీ.ఎస్.యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి. సిద్ధూ,పీ.వై.ఎల్ నాయకులు వి.భీమా శంకరం మాట్లాడుతూ, రామచంద్రపురం నియోజకవర్గం అమలాపురం జిల్లా కేంద్రం నుండి సుమారు 60 కిలోమీటర్ల దూరంలో ఉందని,గోదావరి నది వరదలు,తుఫానులు వంటి ప్రకృతి విపత్తుల సమయంలో రవాణా సౌకర్యాలు దెబ్బతినడం వల్ల జిల్లా కేంద్రానికి చేరుకోవడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.కాకినాడ జిల్లా ప్రధాన కేంద్రం కేవలం 25 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో పరిపాలనా సేవలు వేగంగా, సమయానికి అందే అవకాశం ఉందని అన్నారు.కాకినాడలో ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి, అనేక ప్రైవేట్ ఆసుపత్రులు, విశ్వవిద్యాలయం మరియు ప్రధాన విద్యా సంస్థలు ఉన్నాయని వివరించారు. గతంలో 2004%-%2009 పునర్విభజనలో రామచంద్రపురం నియోజకవర్గాన్ని కాకినాడ జిల్లాలో చేర్చే ప్రతిపాదన ఉన్నప్పటికీ అమలు కాలేదని,2022%-




%23 జిల్లాల విభజన సమయంలో నాటి ప్రభుత్వం రామచంద్రపురాన్ని కోనసీమ జిల్లాలో చేర్చడం వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.ఈ సమస్య చాలా కాలంగా కొనసాగుతుండడంతో తక్షణమే పరిష్కారం కావాలని నేతలు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏ.ఐ.కె.ఎం.ఎస్ నాయకులు అంబటి కృష్ణ, చింతా రాజారెడ్డి, పీ.డీ.ఎస్.యూ నాయకులు కె. నవీన్, లెక్చరర్స్ జె.ఎన్.కె.బాబు, పి.దేవి ప్రసాద్, విద్యార్థులు ఎం.జశ్వంత్, పి.సత్య బాలాజీ,డి. బాలాజీ చంద్ర కుమార్, ఎస్.సోమ శేఖర్,వి.పూర్ణ తేజా తదితరులు పాల్గొన్నారు.

## దేశవ్యాప్తంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపు

## కాంగ్రెస్ పార్టీ వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన

**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు కొండేటి చిట్టిబాబు ఆధ్వర్యంలో రాష్ట్ర కిసాన్ సెల్ కాంగ్రెస్ పార్టీ చైర్మన్ కామన ప్రభాకర్ రావు పిలుపుమేరకు బుధవారం ఉదయం 10 గంటలకు కాంగ్రెస్ పార్టీ సిపిఐ, సిపిఎం, వామపక్షాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం జరిగినది కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరికి నిరసనగా నిరసన కార్యక్రమం చేసి కలెక్టర్ ఆఫీసులో ఈవో కి నాయకులు మెమోరాండం అందజేసినారు. ఈ సందర్భంగా చిట్టిబాబు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత వ్యవసాయ మార్కెట్ల చట్టాన్ని విదేశీ స్వదేశీ కంపెనీల ఎగుమతి దిగుమతి వ్యాపార ప్రయోజనాలకు అనుగుణంగా మార్పులు చేసిందని, ఈ విధానం ప్రకారం పంటలకు మద్దతు ధర విధానం ఉండదని, ప్రభుత్వ ఏజెన్సీలు కొనుగోలు చేయవు రైతులు నేరుగా ఎఫ్ పి ఓ గ్రూపులుగా గాని అగ్రిమెంట్ చేసుకుని కంపెనీ రూల్స్ ప్రకారం పంటలు పండించి ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వ ఈ ఏడాది బడ్జెట్లో ధరల స్థిరికరణ నిధి ఎత్తివేసిందని, ఎరువులు పరికరాలు పై సబ్సిడీలు కోట విధించిందని, 10 సంవత్సరాలు దాటిన ట్రాక్టర్ల పై నిషేధం విధించింది అని ఎఫ్ సి ఐ తదితర గొడవలను ఆదానికి అప్పగించిందని, ప్రభుత్వ ఏజెన్సీలు కొనడం లేదని అధికారంలోకి వచ్చిన తరువాత ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్ చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నారని మనం ఎగుమతి చేసే వస్తువులపై 25% సుంకం వేస్ట్ వేస్తానని ట్రంప్ బెదిరిస్తుంటే మన ప్రధాని మోదీ మౌనంగా ఉండటం చాలా ప్రమాదం మనం ఈ ఏడాది ఎగుమతి చేయగలిగిన మిర్చి పొగాకు మామిడికాయ పప్పు ధాన్యాలు శనగలు పంటలు ధరలు పడిపోయాయని వ్యాపారులందరూ ఏకమై ధరలు తగ్గించి వేశారని తాజాగా మనం ఎగుమతి చేసే రొయ్యలు సైతం ధరల పడిపోయాయని మన దేశ అవసరాలకు సరిపడా వరి గోధుమ మొక్కజొన్న పంటలు దిగుమతి చేసుకోవలసి వస్తుందని మనం మిగులు ఉత్పత్తి కలిగిన పాడి, పాల, ఉత్పత్తులు కోళ్లు,కోడి,




మాంసం దిగమతి చేసుకోవాల్సి వస్తుందని. ఆ దేశాలలో ఇస్తున్న భారీ సబ్సిడీల తో వచ్చివి దిగుమతి అవుతున్నాయని,మన రైతాంగం దివాళ తీయడం తప్ప మార్గం లేదని అన్నారు. వ్యవసాయ కూలీల రుణాలు రద్దు చేయాలని, పది సంవత్సరాలు దాటిన ట్రాక్టర్ పై నిషేధం తొలగించాలని, కార్పొరేషన్ కంపెనీలకు పంటలు పండే రైతుల భూములను ఇవ్వరాదని, ప్రీ పెయిడ్ స్మార్ట్ మీటర్ల ఉపసంహరణ చేయాలని చిట్టిబాబు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేకేసి అధికార ప్రతినిధి పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, నియోజకవర్గం కోఆర్డినేటర్ అయితా బత్తుల సుభాషిని, ఏఐసిసి మెంబర్ యార్లగడ్డ రవీంద్ర, జిల్లా కిసాన్ సెల్ కోఆర్డినేటర్ దేశనీడి భాస్కరరావు, జిల్లా మాజీ కిసాన్ సెల్ అధ్యక్షులు గెడ్డం సురేష్, బాబు, రాజోలు కోఆర్డినేటర్ సరళ్ళ ప్రసన్నకుమార్, అమలాపురం రూరల్ మండలం కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఏలేశ్వరపు రాధాకృష్ణ, మామిడి కుదురు మండల ప్రెసిడెంట్, అప్పన శ్రీరామకృష్ణ, బి ఎ జె డబ్యూ రెడ్డి బాబు, వస్తా బాబు, బత్తుల సురేష్ బాబు, మొల్లేటి వెంకటేశ్వరరావు, బొంతు రాజేంద్రప్రసాద్, వాండ్రాసి దొరబాబు, ఎన్. వె%శీ%టేశ్వరరావు, మధు రాజు, చింతా బాబురావు, మీసాల బాబి, అయితాబత్తుల కుమార్ సింగ్, కేకేసి జిల్లా అధ్యక్షులు నీతిపూడి బాల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు

## ఘనంగా ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భవ దినోత్సవం వేడుకలు

**రామచంద్రపురం విశ్వం వాయిస్ న్యూస్ :-** అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు డా.బి.ఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా అధ్యక్షులు వెంకట్ ఆధ్వర్యంలో విద్యార్థులు రావులపాలెం ఏఐటీయుసి ఆఫీస్ నుండి రామచంద్రపురం డాక్టర్ చెలికాని రామారావు భవనం వరకు బైక్ ర్యాలీ చేశారు. అనంతరం మాజీ ఏఐఎస్ఎఫ్ నాయకులు రామచంద్రపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉండవల్లి గోపాలరావు ఏఐఎస్ఎఫ్ పతాక ఆవిష్కరణ చేసి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్రం మా జన్మ హక్కు ఈ దేశాన్ని పాలిస్తున్నటువంటి బ్రిటిష్ తెల్ల దొరలను తరిమి కొట్టడం కోసం ఆవిర్భవించిన సంఘం ఏఐఎస్ఎఫ్ అని కొనియాడారు.ఆగస్టు 12%-% 1936 ఉత్తర్ ప్రదేశ్ రాజధాని లక్నో నగరంలో బెనారస్ విశ్వవిద్యాలయంలో ఆవిర్భవించి విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అవిశ్రాంతంగా పోరాటం నిర్వహించి నేటికి 90 సంవత్సరాలు కావస్తుందని అన్నారు. విద్యార్థులు చదువుతూ పోరాడు చదువుకై పోరాడు అనే నినాదంతో అఖిల భారత విద్యార్థి సమాఖ్య తో కలిసి నడవాలి అని,ఉద్యోగాలు కోసం చదవడం కాకుండా సమాజాన్ని మంచి దారిలో పెట్టడానికి మనం ముందుగా మంచి వ్యక్తిత్వం ఉన్న వ్యక్తులుగా ఎదగాలని అపుడు ఎటువంటి పదవుల్లో, ప్రభుత్వ అధికారులుగా ఉన్నా కూడా అవినీతి లేని సమాజం రూపొందించగలమని ఆవిధంగా పని చేయాలని కోరారు..ఏఐటీయూసీ నాయకులు రాము మాట్లాడుతూ చరిత్ర తెలుసుకోవడం ద్వారా మంచి భవిష్యత్తును నిర్మించగలమని 90 ఏళ్ల పోరాటాలు ఎందరో విద్యార్థి నాయకులను ఉన్నతమైన స్థానంలో నిలబెట్టింది అని నేడు లాయర్స్ గా,డాక్టర్స్ గా, ప్రభుత్వ



అధికారులుగా, ప్రజా ప్రతినిధులు గా ఉన్నారని అన్నారు.జిల్లా అధ్యక్షులు వెంకట్ మాట్లాడుతూ జిల్లాలో విద్యార్థి సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేస్తున్నామని విద్యార్థి హక్కుల సాధన లక్ష్యంగా శాస్త్రీయ విద్యా విధానం లక్ష్యంగా ముందుకు వెళ్తామని అన్నారు. విద్యార్థి సంఘాలను అణిచివేయాలనే ఆలోచనతో తీసుకువచ్చిన జిఓ లను రద్దు చేయాలని, ప్రభుత్వ వసతి గృహాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని,పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ లు విడుదల చేయాలని,జీవో 77 రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు,అలాగే విద్యారంగ సమస్యలు పరిష్కారం కోసం ఏఐఎస్ఎఫ్ సమరశీల పోరాటాలు రాబోయే కాలంలో నిర్వహించేందుకు సిద్ధం కావాలని విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రవికుమార్, జిల్లా కార్యవర్గ సభ్యులు సందీప్,సతీస్,నూకన్న ప్రసాద్,కుమార్,విజయ్, సుహాస్,వినయ్,శ్యామ్, చిరు,ఉదయ్ తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

### రెండు రోజుల శిక్షణా తరగతుల కార్యక్రమాన్ని ప్రారంభించిన అదరపు డిఎంహెచ్వో భరత్ లక్ష్మి




**అమలాపురం జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ ఆగస్టు 13:** రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు జాతీ య ఎయిడ్స్ నియంత్రణ కార్యక్రమ%శీ%లో భాగంగా స్థానిక ఏరియా ఆసుపత్రి నందు ఏ.ఆర్.టి పని చేస్తున్న కౌన్సెలర్స్ కు హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులను గుర్తించుట రక్త పరీక్షల నిర్వహణ అనే అంశ%శీ% పై రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు అదనపు డి ఎం అండ్ హెచ్ ఓ భరత లక్ష్మి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హెచ్.ఐ.వి పరీక్షల శాతం పెంచాలని, ప్రతీ హెచ్.ఐ.వి/ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుని నుండి నలు గురి బాగస్వాములను గుర్తించి, వారికి హెచ్.ఐ.వి పరీక్షలు నిర్వహించి, వారి నుండి వేరొకరికి హెచ్.ఐ.వి వ్యాధి శోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు రు, ఈ కార్యక్రమ%శీ% లో డా. ఐ. ప్రభాకర రావు, జిల్లా లెప్రసి ఎయిడ్స్ మరియు టీబీ అధికారి ఆదిలింగం గంటల, క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్, ఏ.హరినాధ కుమార్, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్, శ్రీ. జాన్ ప్రోగ్రామ్ కొ-ఆర్డినేటర్, వి.హెచ్.ఎస్ బాలాజీ పి. సిబ్బంది పాల్గొన్నారు.

## బాబు షూరిటీ - మోసం గ్యారెంటీ పొడగట్లపల్లి



**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** రావులపాలెం మండలం పొడగట్లపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ గంధం దేవిఅన్నవరం ఆధ్వర్యం లో బాబు షూరిటీ-మోసం గ్యారంటీ కార్యక్రమంలో కుడుపూడి శ్రీనివాసరావు మాట్లాడుతూ గత ప్రభుత్వం లో ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అందించబడ్డాయి. ప్రతి ఇంటిలో ఆనందం, భద్రత ఉండేది. కానీ ఈరోజు కూటమి పాలనలో ప్రజలు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఎలాంటి సంక్షేమం లేకుండా, , కరెంట్ బిల్లులుమోత,నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రైతులు అప్పులపాలై, మధ్యతరగతి ప్రజలు కష్టాల్లో మునిగిపోతున్నారు. ఈ ప్రభుత్వం ప్రజలకు రక్షణ ఇవ్వకపోగా, సమస్యలను రెట్టింపు చేస్తోంది. ఇప్పటికైనా ప్రజలు ఎవరి పాలన మంచిదో ఎవరి పాలన ముంచే పాలనో గుర్తించాలి" అన్నారు. బొక్క కరుణాకరన్ మాట్లాడుతూ "జగనన్న ఇచ్చిన సంక్షేమ పథకాల వల్ల ప్రతీ పేదవాడి పిల్లలు చదువుకున్నారు. సొంత ఇంటి కల కూడా నిజమైంది. కానీ కూటమి వచ్చాక అన్నీ ఆగిపోయాయి. పింఛన్లు తీసుకునేవాళ్లు తగ్గించబడ్డారు, బియ్యం పంపిణీ ఆలస్యం అవుతోంది, ఉద్యోగాల కలలు ఛిద్రమవుతున్నాయి" అని అన్నారు.ఈ కార్యక్రమంలో గంధం అన్నవరం జడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు మండల ఇంచార్జ్ బొక్క కరుణాకరన్ బొక్క వెంకటలక్ష్మి, నాయకులు, కార్యకర్తలు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు పార్టీ కార్యకర్తలుగా ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేసారు.

## చిలువూరి సతీష్ రాజును పరామర్శించిన ఎమ్మెల్యే బండారు



**విశ్వం వాయిస్ న్యూస్ రావులపాలెం** ఆలమూరు రైతు సంబరాల్లో భాగంగా ఎడ్లు బెదరడంతో ఎడ్ల బండి పైనుంచి కింద పడి గాయాల పాలైన జిల్లా తెలుగు యువత అధ్యక్షులు చిలువూరి సతీష్ రాజును ఎమ్మె ల్యే బండారు సత్యానం దరావు,ఆకుల రామకృష్ణ రావుల పాలెం బలరామిరెడ్డి ఆసుపత్రిలో పరామర్శించారు. సతీష్ రాజుకు మెరుగైన వైద్యం అందించాలని ఆయన డాక్టర్లకు సూచించారు. సతీష్ రాజుకు కాలు ఫ్రాక్చర్ కావడంతో రెండు మూడు, రోజుల్లో శస్త్ర చికిత్స చేయాలని డాక్టర్లు తెలియజేయడంతో ఆ ఏర్పాట్లు చూడాలని ఎమ్మెల్యే బండారు సూచించారు.

## అమలాపురంలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం



**అమలాపురం టౌన్ విశ్వం వాయిస్ న్యూస్** అన్నదాత సుఖీభవ కార్యక్రమం అమలాపురం నియోజకవర్గం లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో సుమారు 100 ట్రాక్టర్లతో పేరూరు వై జంక్షన్ నుండి భట్నవిల్లి జంక్షన్ వరకు రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. వందలాది మంది రైతులు కూటమి నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం భట్నవిల్లి సెంటర్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఏమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, కూటమి నాయకులు మాట్లాడుతూ సూపర్ సిక్స్ లో ఇచ్చిన హామీ మేరకు అన్నదాతలకు ప్రకటించిన 20 వేలులో మొదటి విడతగా 7000 రూపాయలు వారి ఖాతాల్లో జమ చేసిన చంద్రబాబునాయుడు కి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు,ఆముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు,నాయుకులు అధ్యక్షులు. పాలమూరి రమణ కూటమి నాయకులు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



# భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు

.....జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి....

**కాకినాడ కలెక్టరేట్:విశ్వం వాయిస్ న్యూస్** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రానున్న మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ అధికారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రానున్న మూడు రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసిందన్నారు. ఈ నేపథ్యంలో జిల్లా అధికారులు, మండల తహశీల్దారులకు టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అప్రమత్తం చేసామని ఆయన తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా క్షేత్రస్థాయిలో అధికారులంతా అందుబాటులో ఉండి రైతులను అప్రమత్తం చేసి వారికి తగు సూచనలు సలహాలు అందజేయాలని ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ఎప్పటికప్పుడు తగు సూచనలు చెయ్యాలని, అవసరమైన సహాయక చర్యలకు అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు. చాలా ఏళ్ళ క్రితం నిర్మించి శిథిలవస్థకు సిద్ధంగా ఉన్న భవనాలకు ప్రజలు దూరంగా ఉండాలని ఆయన తెలిపారు. భారీ వర్షాల దృష్ట్యా కాకినాడ కలెక్టరేట్ లో 24 గంటలు అందుబాటులో ఉండే విధంగా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ తెలిపారు. జిల్లాలో వర్షాల వలన ఎటువంటి ఇబ్బంది ఏర్పడినా రోడ్లు తెగినా, చెట్లు కూలినా, ట్రాఫిక్ ఇబ్బంది కలిగినా టోల్ ఫ్రీ నెంబర్, కంట్రోల్ రూమ్ లో ఉన్న సిబ్బంది ఫోన్ చేసి వెంటనే సమాచారం తెలియజేయాలన్నారు. అదేవిధంగా రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలోనూ, తహసీల్దార్ కార్యాలయాల్లోనూ కూడా కంట్రోల్ రూమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందని అత్యవసర పరిస్థితులు ఏర్పడినప్పుడు సమీపంలో ఉన్న రెవెన్యూ డివిజన్, తహసీల్దార్, తాసిల్దార్ కార్యాలయానికి సమాచారం తెలియజేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు.

కంట్రోల్ రూమ్ నెంబర్ల వివరాలు:
కాకినాడ కలెక్టరేట్‌లోని కంట్రోల్ రూమ్ సిబ్బంది, ఫోన్ నెంబర్ల వివరాలు

1) 13 వ తేదీ బుధవారం
రాత్రి 8.00 నుండి ఉదయం 8.00 వరకు కె.సతీష్ నాయుడు-
9515950989.

2)14వ తేదీ గురువారం
ఉదయం 8.00 నుండి మధ్యాహ్నం 2.00 వరకు ఎండీ అహమద్ ఉన్నిసా- 9391957377,
మధ్యాహ్నం 2.00 నుండి రాత్రి 8.00 వరకు ఎన్. శ్యామల- 9989468610,
రాత్రి 8.00 నుండి మరుసటి రోజు ఉదయం 8.00 వరకు.

3) 15వ తేదీ శుక్రవారం
ఉదయం 8.00 నుండి మధ్యాహ్నం 2:00 వరకు కె. సురేష్ కుమార్ -8247655141.
మధ్యాహ్నం 2.00 నుండి రాత్రి 8:00 వరకు ఎల్‌వి రఘు తేజ-
9553393102, రాత్రి 8.00 నుండి ఉదయం 8.00 వరకు ఆర్. ఆనందబాబు- 6304032530.

4)16వ తేదీ శనివారం
ఉదయం 8.00 నుండి మధ్యాహ్నం 2.00 వరకు జి.ఎస్.ఎస్. శ్రీధర్-
9491343550,
మధ్యాహ్నం 2.00 నుండి రాత్రి 8.00 వరకు సుధా మాధురి-
9502017997, రాత్రి 8.00 నుండి మరుసటి రోజు ఉదయం 8.00 వరకు ఎం.రామశ్రీలక్ష్మి-
9676361332, కొత్తపల్లి అనిల్-
9492345684.పైన పేర్కొన్న సిబ్బంది తుఫానుకు సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/అభ్యంతరాలను టెలిఫోన్ (ల్యాండ్ లైన్ నెం.0884 2356801)/ మెయిల్ egosupdtd@nic.in% లేదా %kdasupdtcoordn@nic.in% ద్వారా స్వీకరించాలని మరియు తగిన విధంగా ఉన్నతాధికారులు/డివిజనల్/తహశీల్దార్ కార్యాలయానికి తెలియజేయాలని ఆదేశించారు.

## టెన్త్ క్లాస్ స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ నేహాంజనికి గవర్నర్ ఆహ్వానం...



**కాకినాడ కలెక్టరేట్: విశ్వం వాయిస్ న్యూస్** ఈ ఏడాది జరిగిన పదో తరగతి పరీక్షల్లో అన్ని సబ్జెక్టుల్లో 100కి 100 మార్కులు సాధించి 600 మార్కులు సాధించిన స్టేట్ ఫస్ట్ ర్యాంకర్ యాళ్ల నేహాంజనికి గవర్నర్ కార్యాలయం నుంచి ఆహ్వానం అందింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ కార్యాలయం నుండి ఎట్ హోమ్ కార్యక్రమానికి ప్రత్యేక ఆహ్వాన పత్రం అందుకున్న యాళ్ళ నేహాంజని విశేష గౌరవం పొందింది. రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ ఆతిథ్యంతో ఆగస్టు15న సాయంత్రం 5 గంటలకు విజయవాడ రాజ్ భవన్‌లో జరగనున్న ఈ ప్రత్యేక కార్యక్రమానికి స్టూడెంట్ టాపర్స్ విభాగంలో నేహంజనిని ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారుల ఆధ్వర్యంలో ఆమెకు సన్మానం నిర్వహించగా నేహంజని తన విద్యలో సాధించిన విజయాన్ని గుర్తిస్తూ ప్రశంసలు అందించారు.

# రైతులు అండగా కూటమి ప్రభుత్వం..

**అన్నదాత సుఖీభవ పథకంలో లబ్ధి పొందిన రైతులు 300 ట్రాక్టర్లతో భారీ ర్యాలీ..**

**హర్షం వ్యక్తం చేసిన కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం...**





**కాకినాడ రూరల్ (కరప):విశ్వం వాయిస్ న్యూస్** అన్నదాత సుఖీభవ లో రైతుకు 20వేలు చొప్పున కూటమి ప్రభుత్వం ఇవ్వటం జరిగిందని అందులో భాగంగా మొదటి విడతగా 7000 రూపాయలు అందించిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో తూరంగి అయ్యప్ప స్వామి గుడి దగ్గర నుండి కరప మండలం వేళంగి గ్రామం వరకు రైతులు దాదాపు 300 ట్రాక్టర్లతో భారీ విజయోత్సవ ర్యాలీ చేశారు. రాష్ట్రంలో అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నగదు జమ కావడంతో లబ్ధి పొందిన రైతులు “అన్నదాత సుఖీభవ” విజయోత్సవ ర్యాలీ చేశారు. ఈ ర్యాలీలో నడకుదురు గ్రామం నుంచి రేలంగి గ్రామం వరకు ఉన్న రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే పంతం నానాజీకి హారతులు పూలమాలలతో ఘనంగా సత్కరించి రైతులు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు అనంతరం వేలంగి గ్రామంలో నిర్వహించిన సభ కార్యక్రమంలో ఓటమి నాయకులు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రినారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఇద్దరు ఏకతాటిపై రాష్ట్రాన్ని ముందుకునడిపించి ఒక వైపు అభివృద్ధి మరోవైపు సంక్షేమంతో ముందుకు తీసుకెళుతున్న తీరు హర్షణీయమని కూటమి నాయకులు కొనియాడారు ఈ కార్యక్రమంలో శెట్టిబలిజ కార్పొరేషన్ చైర్మన్ కుడుపూడి సత్తిబాబు,టీడీపీ మాజీ మంత్రి, ఏమ్మెల్సీ, సీనియర్ నాయకులుచిక్కాలరామచంద్రరావు, కాకినాడ రూరల్ ఎంపీపీ నందిపాటి అనంతలక్ష్మి త్రిమూర్తులు,కాకినాడ రూరల్ టీడీపీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి బాబి, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, టిడిపి సీనియర్ నాయకులునులుకుర్తి వెంకటేశ్వరరావు, మరియు కరప మండల కూటమి నాయకులు,కాకినాడ రూరల్ కూటమి నాయకులు, రైతులు, వీర మహిళలు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

## ఎంపీ తంగెళ్లతో బీసీ నాయకులు భేటీ



**కాకినాడ,సిటీ : విశ్వం వాయిస్ న్యూస్** గత వైసీపీ ప్రభుత్వానికి భిన్నంగా రాష్ట్రంలో బీసీ, మత్స్యకారుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుందని తెలుగు జనతా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు, బీసీ నాయకులు పెద్దింశెట్టి వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన కాకినాడ జిల్లాకు చెందిన బీసీ, మత్స్యకార సంఘాల నాయకులతో కలిసి కాకినాడ క్యాంప్ కార్యాలయంలో ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంఘాల నాయకులు బీసీల సంక్షేమంపై ఎంపీ ఉదయ్తో చర్చించారు. అలాగే మత్స్యకారుల సంక్షేమానికి డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎంపీ ఉదయ్లు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని కొనియాడారు. మత్స్యకారులకు సబ్సిడీపై బోట్లు అందించడంతో పాటు, కోతకు గురవుతున్న ఉప్పాడ తీర ప్రాంతాన్ని రక్షించేందుకు శాశ్వత పరిష్కారంగా రక్షణ గోడ నిర్మించేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా 323 కోట్లు నిధులు, ఉప్పాడలో చేనేత కార్మికుల సంక్షేమానికి 15 కోట్లు, మంజూరు కానుండడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. గత పాలకులకు భిన్నంగా బీసీ, మత్స్యకారుల సంక్షేమానికి చర్యలు తీసుకుంటున్న కూటమి ప్రభుత్వానికి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్కు కృతజ్ఞతలు తెలుపుకుంటున్నామని బీసీ సంఘాల నాయకులు తెలిపారు.

## డాక్టరేట్ అవార్డు కు ఎంపికైన"యన్నం సురేష్"



**భట్టిప్రోలు విశ్వం వాయిస్ న్యూస్ న్యూస్:-** భట్టిప్రోలు మండలం పెసర్లంక గ్రామానికి చెందిన దళిత ఉద్యమకారుడు యన్నం సురేష్ ఈనెల 14వ తేదీన పలు అవార్డులను అందుకోనున్నారు. హైదరాబాద్ కళాభారతి లో నీతి ఆయోగ్ గవర్నమెంట్ ఆఫ్ ఇండియా వారిచే నిర్ధారించబడిన,మనం ఫౌండేషన్ వారు 79వ స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకు ని కల్చరల్ ప్రోగ్రామ్స్ జి అవార్డు కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో యన్నం సురేష్ వివిధ రంగాలలో చేసిన సేవలను గుర్తించి ఈ సంస్థ వారు ఆయనకు “భారత సేవారత్న”నేషనల్ అవార్డు 2025, మరియు గౌరవ “డాక్టరేట్”అవార్డు 2025 అందించనున్నారు. యన్నం సురేష్ గత రెండు దశాబ్దాలుగా ఎస్ సి,ఎస్ టీ,బిసి,మైనార్టీల సమస్యలపై పోరాటాలు చేస్తూ మరియు వై.పి. రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా వివిధ సేవా కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్థాయి నుండి మహాసభ వరకు ఉన్న పలు పదవులను నిర్వహించి పలువురి మన్నన లను చూర గొ న్నారు.వై పి రావు చారిటబుల్ ట్రస్ట్ పెసర్లంక గ్రామంలో స్థాపించి నేషనల్ పదవులను అలంకరించి అన్నిట పలు అవార్డుల ను పొందియున్నారు.అలాగే వృత్తి పరంగా మండల స్థాయి రిపోర్టర్ నుండి రాష్ట్ర ఇన్చార్జిగా సేవలందించి పత్రికల యాజమాన్యం మరియు తోటి,ఉద్యోగులు, ఉన్నతాధికారుల మన్నన లను పొంది ఉన్నారు. యన్నం సురేష్ చేసినటువంటి అనేక సేవా కార్యక్రమాలను గుర్తించి భారత సేవారత్న నేషనల్ అవార్డు 2025 మరియు గౌరవ డాక్టరేట్ 2025 అవార్డులకు ఎంపికైనారు. యన్నం సురేష్ అవార్డులకు ఎంపికైన నేపథ్యంలో ఆయన మిత్ర బృందం, బంధువులు,పలువురు ఆయనను అభినందించారు.

## కొనసీమలో క్రైస్తవ సమాజ అభివృద్ధికి కృషి అవసరం



**అమలాపురం విశ్వం వాయిస్ న్యూస్** క్రిస్టియన్ మైనారిటీ సెల్ కోనసీమ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ విప్పర్తి రాజ్‌కుమార్, బుధవారం కొత్తపేటలోని తెలుగుదేశం పార్టీ కోనసీమ జిల్లా అధ్యక్షురాలు , ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక చైర్మన్ రెడ్డి అనంతలక్ష్మిని నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. డాక్టర్ విప్పర్తి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, క్రైస్తవ సమాజం అభివృద్ధి చెందడానికి ప్రభుత్వ సహకారం అత్యంత అవసరం. మైనారిటీల హక్కులు, రక్షణ, మరియు సంక్షేమ పథకాలు సమర్ధవంతంగా అమలులోకి రావాలి అని పేర్కొన్నారు. ఈసందర్భంగా జిల్లా వ్యాప్తంగా క్రైస్తవ సమాజం ఎదుర్కొంటున్న పలు ముఖ్య సమస్యలపై డాక్టర్ రాజకుమార్ అనంతలక్ష్మికి తెలిపారు . ఈ సమస్యలను పార్టీ స్థాయిలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, సాధ్యమైనంత త్వరగా పరిష్కారానికి కృషి చేస్తానని రెడ్డి అనంతలక్ష్మి హామీ ఇచ్చారు.

## పేదోళ్ల సొంతింటి కల ను సాకారం చేయాలి కలెక్టర్ గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లు కు ఆదేశాలు



**అమలాపురం , జిల్లా ప్రతినిధి విశ్వం వాయిస్ న్యూస్ ఆగస్టు 13** పేదోళ్ల ఇంటికి భరోసాగా గృహ నిర్మాణ సంస్థ నిలిచి సొంత ఇంటి కలను సాకారం చేయాలని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ గృహ నిర్మాణ సంస్థ ఇంజ నీర్లను ఆదేశించారు. బుధవారం స్థానిక కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అధ్యక్షతన, గృహ నిర్మాణ సంస్థ ఇంజనీర్లతో సమావేశం నిర్వహించి గృహ నిర్మాణాల పురోగతు లపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న గృహాలను పూర్తి చేయాలని ఆదేశించారు జిల్లాలో మొత్తం 41,366 గృహాలు మంజూరు కాగా వీటిలో 19,796 గృహాల నిర్మాణాలు పూర్తి కాబ డ్డాయన్నారు. వీటిలో మిగిలిన గృహాలలో ఈ నెలాఖరు నాటికి 1,150 గృహ నిర్మాణాలను పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశిం చారు. భీమ్ స్థాయిలో ఉన్న 12,571 గృహాల నిర్మా ణాల ను డిసెంబర్ నెలాఖరు నాటికి పూర్తి చేయాల న్నారు. రాష్ట్రానికి నూతనంగా 3 లక్షల గృహాలు మంజూరు కాగా వీటిలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు 9,155 గృహాలను కేటాయించారన్నారు అందు లో ఇప్పటి వరకు 7241 గృహాల నిర్మాణాలు ప్రారం భించబడి గృహ నిర్మాణాల పురోగతిలో కోనసీమ జిల్లా రెండో స్థానం లో నిలిచిం దన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందరికీ ఇండ్లు పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాలలో 3, పట్టణ ప్రాం తాలలో రెండు సెంట్లు భూమిని కేటాయించడం జరుగు తుంద న్నారు. పి ఎం ఏ వై 2.0 కింద బిపిఎల్ కుటుంబాలు ఈ అవకాశాన్నీ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వ పూర్వపు లబ్ధి పొంది ఉండకుండా ఉన్న వారు ఈ యొక్క అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని సొంత ఇంటి స్వప్నాన్ని సాకారం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గృహ నిర్మాణ సంస్థ పిడి నరసిం హారావు ఈఈ లు, డి ఈ లు ఏఈలు తదిత రులు పాల్గొన్నారు

## రాయవరంను రాజమహేంద్రిలో చేర్చాలని అత్యవసర సమావేశం




**రాయవరం, విశ్వంవాయిస్ న్యూస్:** రాయవరం మండలాన్ని రాజమహేంద్రవరం జిల్లా కేంద్రంగా గల తూర్పుగోదావరి జిల్లా లో విలీనం చేయాలని కోరుతూ బుధవారం రాయవరం మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీడీవో కీర్తి స్పందన ఆధ్వర్యంలో ఎంపీపీ నౌడు వెంకటరమణ అధ్యక్షతన ఏర్పాటుచేసిన అత్యవసర సర్వ సభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. రాయవరం మండలంలోని అన్ని గ్రామ పంచాయితీల పరిధిలో ప్రజలు మంగళవారం గ్రామ సభల ద్వారా అంబేద్కర్ కోనసీమ జిల్లాలో కొనసాగుతున్న రాయవరం మండలాన్ని, రాజమహేంద్రవరం కేంద్రంగా తూర్పు గోదావరి జిల్లాలో విలీనం చేయడం వలన గ్రామ ప్రజలకు, నియోజక వర్గ ప్రజలకు, వివిధ ఉద్యోగులకు, అధికారులకు వారి జిల్లా కేంద్ర కార్యాలయము లకు రాక పోకలు సాగించుట లో వ్యయం,ప్రయాసలు తగ్గుటమే కాకుండా, సాంస్కృతికంగా ఆధ్యాత్మికంగా రాజమహేంద్రవరం తో ప్రజల అనుబంధం కలిగి ఉండుట ప్రజల విద్య, వైద్య, వాణిజ్య, వ్యాపార,రవాణా వంటి తదితర రంగాలకు సంబంధించిన అవసరాలకు రాజమహేంద్రవరం తో అనుబంధం కలిగి వున్నారని, మండపేట నియోజక వర్గాన్ని, అందులో అంతర్భాగమైన రాయవరం గ్రామాలను తూర్పుగోదావరి జిల్లాలో విలీనం చేయాలని కోరుతూ చేసిన తీర్మానాన్ని సమావేశంలో ప్రవేశపెట్టారు. దీనికిగానూ అధికార, ప్రతిపక్ష ప్రజా ప్రతినిధుల నుండి ఏకగ్రీవంగా ఆమోదం తెలపారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు ఆదేశాల మేరకు తీర్మానం చేసినట్లు ఎంపీపీ వెంకటరమణ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండపేట ఏఎంసీ చైర్మన్ శ్రీనివాస్,తహసిల్దార్ ఐపీ శెట్టి , మండల గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## భవిత కేంద్రం దివ్యాంగులు స్కూలుకు ప్రింటర్ బహుకరించిన ఇంజరపు దుర్గ బాబు మేరీ దంపతులు

**దివ్యాంగుల మధ్య పెళ్లిరోజు జరుపుకుని వారికి అన్నదానం నిర్వహించారు**



**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం మల్లిసాల గ్రామానికి చెందిన టిడిపి ఎస్సీ నాయకులు, గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు ఇంజరపు దుర్గ బాబు మేరీ దంపతులు ప్రతి సంవత్సరం వివాహ వార్షికోత్సవం సందర్భంగా పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు, సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. గత సంవత్సరం తాళ్లూరు జి య్యాన్న ఆలయానికి 25 వేల రూపాయల ఇన్వెర్టర్ బహుకరించారు. తర్వాత సౌండ్ సిస్టం బహుకరించారు. ఈ సంవత్సరం పెళ్లి రోజు సందర్భంగా జగ్గంపేట భవిత కేంద్రంలోని దివ్యాంగుల స్కూల్ కు 13000 రూపాయల ప్రింటర్ బహుకరించారు. అనంతరం దివ్యాంగుల కు భోజనాలు ఏర్పాటు చేసి వారితో పాటు భోజనాలు చేశారు. ఈ సందర్భంగా దుర్గ బాబు మాట్లాడుతూ ముందుగా మా ఇష్టదైవం తాళ్లూరు వెంకటేశ్వర స్వామి దర్శించుకున్నామని ప్రతి పెళ్లి రోజుకు మా దంపతులం ఆర్భాటాలకు పోకుండా ఏదో సేవా కార్యక్రమం చేయాలని సంకల్పంతో ఇటువంటి కార్యక్రమాలు చేస్తున్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భవిత స్కూల్ సిబ్బంది అప్పాల పెద్దకాపు, చినబాబు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విశ్వంవాయిస్
తెలుగు దినపత్రిక VISWAMVOICE TELUGU DAILY

తూర్పు గోదావరి జిల్లా ఎడిషన్

గురువారం 14 ఆగస్టు 2025
www.viswamvoice.com





# శ్రీసారంగధేశ్వరస్వామి ఆలయ పరిరక్షణకు కృషి చేస్తూ భక్తులకు మంచి సేవలు అందించాలి

- ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ పిలుపు
- సారంగధర మెట్టపై కళ్యాణ మండపం నిర్మాణం చేపడతాం
- కళ్యాణ మండపం కోసం ఎమ్మెల్యే ఆదిరెడ్డి రూ2.50 లక్షలు,ఆలయ చైర్మన్ సాయి రూ.9 లక్షలు విరాళాలు ప్రకటన





**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** మనం చేసే పనులు, కార్యక్రమాలు చరిత్రలో నిలిచిపోయేలా ఉండాలని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ (వాసు) పిలుపునిచ్చారు. రాజమండ్రి 47వ డివిజన్ లో స్థానిక సారంగధర మెట్టపై ఉన్న శ్రీసారంగధేశ్వరస్వామి ఆలయానికి నూతనంగా నియమించినబడిన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం బుధవారం జరిగింది. చైర్మన్ గా కెవీడీఎస్సీవి చౌదరి, డైరెక్టర్లుగా కొలచన వెంకట సూర్య నారాయణ, అజ్జరపు శ్యామలాదేవి, సూరంపూడి అప్పాజీ, పొన్నమాటి నాగమణి, దేగల మరియ్య, రేలంగి నాగేశ్వరరావు, కుమారి శాంతకుమారి, నూకల అచ్యుతరామయ్య, ప్రమాణ స్వీకారం చేశారు. వీరితో ఆలయ ఈఓ ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ స్థానిక ప్రజలు వారి శుభకార్యాలు చేసుకునేందుకు వీలుగా ఒక కల్యాణ మండపాన్ని నిర్మించనున్నామని తెలిపారు. అందుకోసం తాము తమ భవాని చారిటబుల్ ట్రస్ట్ నుంచి రూ. 2.50 లక్షలు ఇవ్వనున్నట్టు తెలిపారు. అలాగే సారంగదేశ్వరస్వామి ఆలయానికి నూతనంగా చైర్మన్ గా నియమితులైన సాయి కుటుంబం రూ. 9 లక్షలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కాగా కూటమి అధికారంలోకి రావడాన్ని కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. రాజమండ్రి టీడీపీకి బలమైన నియోజకవర్గమన్నారు గతంలో ఎన్నడూ రాని మెజార్టీ వచ్చిందన్నారు. కూటమి విజయం కోసం కృషి చేసిన అందరికి న్యాయం చేయడం జరుగుతుందన్నారు. గతంలో మాదిరిగా కాకుండా ఎండోమెంట్ కమిటీలను ముందుగానే వేయడం జరుగుతొందన్నారు. ఆలయ పరిరక్షణకు కృషి చేస్తూ భక్తులకు మంచి సేవలు అందించాలని ఆలయ నూతన కమిటీ సభ్యులకు సూచించారు. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నగరంలో గంజాయి, బ్లేడ్ లను బ్యాచ్ లను నియంత్రించినట్టు తెలిపారు. దేవాదాయ స్థలాల్లో ఉన్న వారికి ప్రభుత్వం త్వరలోనే తీపి కబురు చెప్పనుందన్నారు. నగరంలో అన్ని సమస్యలు తీరుస్తామని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ అన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు, జనసేన పార్టీ నగర అధ్యక్షులు వై శ్రీను మాట్లాడుతూ వైకాపా రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిందని మండిపడ్డారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా రాజమహేంద్రవరంలోనే ముందుగా దేవాలయాలకు కమిటీలు చేయడం జరుగుతోందని, ఆలయాల పవిత్రతను కాపాడాల ఆయా కమిటీలకు పిలుపునిచ్చారు. నగర టీడీపీ అధ్యక్షులు మజ్జి రాంబాబు అధ్యక్షతన, 47వ డివిజన్ టీడీపీ ఇంచార్జ్ బేసరి చిన్ని పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు దొండపాటి సత్యంబాబు, వర్రే శ్రీనివాసరావు, యిన్నమూరి దీపు, నల్లం శ్రీను, ఉప్పులూరి జానకి రామయ్య, మరుకుర్తి రవి యాదవ్, శెట్టి జగదీష్, జామి సత్యనారాయణ, నిమ్మలపూడి గోవింద్, మొకమాటి సత్యనారాయణ, దాస్యం ప్రసాద్, తురకల నిర్మల, పిల్లి శ్యామ్, కందికొండ అనంత్, కానేటి కృపామణి, సలాది ఆనంద్, బొర్రా చిన్ని, కవులూరి వెంకట రావు, చింతపల్లి నాని, మళ్ల వెంకట రాజు, గుదే రఘు నరేష్, దుత్తరపు గంగాధర్, చాపల చిన్న రాజు, కానేటి ప్రభు దాస్, మదినా సాహెబ్, అధిక సంఖ్యలో మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీగురురాఘవేంద్రస్వామి వారిని దర్శించుకున్న డాక్టర్ గూడూరి శ్రీనివాస్ రాధికా దంపతులు



**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** శ్రీగురు రాఘవేంద్ర స్వామి వారి ఆరాధన ఉత్సవాలు భక్తి ప్రవృత్తుల మధ్య శోభాయమానంగా జరుగుతున్నాయి. బుధవారం స్థానిక గోదావరి గట్టు రోడ్డులో ఉన్న శ్రీ గురు రాఘవేంద్ర స్వామి వారిని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంటరీ నియోజకవర్గం ఇంచార్జ్, ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ గూడూరి శ్రీనివాస్ ఆయన సతీమణి రాధిక గూడూరి దర్శించుకున్నారు. పురోహిత పండితులు వేదాశీర్వచనాలతో స్వామివారి మంత్రపుష్ప తీర్థప్రసాదాలు స్వీకరించారు.

## ప్రజల ఆరోగ్యం సంరక్షణ కూటమి ప్రభుత్వం లక్ష్యం మంత్రి సత్య కుమార్




**విశ్వం వాయిస్ న్యూస్ కొవ్వూరు** తూర్పుగోదావరి జిల్లా బిజెపి అధ్యక్షులు పిక్కి నాగేంద్ర ను మర్యాదపూర్వకంగా ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ కొవ్వూరు పట్టణంలో పిక్కి నాగేంద్ర ఇంటికి వచ్చి నాగేంద్రని మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కొవ్వూరు నియోజకవర్గం లో ప్రభుత్వ హాస్పటల్ లో మౌలిక సదుపాయాలు కల్పించాలని కొవ్వూరు పట్టణ ప్రభుత్వ ఆసుపత్రిలను 100 పడకల ఆసుపత్రులుగా చేస్తామని ఖాళీగా ఉన్న ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేస్తామని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం అనర్హులకు సదరం సర్టిఫికెట్లు ఇచ్చారని వాటన్నిటినీ వెరిఫికేషన్ చేస్తున్నామని సదరం సర్టిఫికెట్ లో కొన్ని వ్యాధులను చేర్చుతున్నామని ప్రజల ఆరోగ్యం సంరక్షణ కూటమి ప్రభుత్వము లక్ష్యంగా పనిచేస్తుందని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కొవ్వూరు శాసనసభ్యులు ముప్పిడి వెంకటేశ్వరరావు అనపర్తి ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, దిసభ్య కమిటీ సభ్యులు కంఠ మణి రామకృష్ణ, అర్బన్ కో-ఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ,మాజీ మున్సిపల్ చైర్మన్ సురపనేని చిన్ని, కొవ్వూరు ఆర్డీవో రాణి సుస్మిత, డిఎంహెచ్వో జె సంధ్య ఎమ్మార్వో దుర్గాప్రసాద్, బిజెపి నాయకులు ముత్యాలరావు, మురళీకృష్ణ, పెరుగు పోతురాజు, జిల్లా వైద్యాధికారులు కూటమి నాయకులు పాల్గొన్నారు

# దంత వ్యాధులను ప్రాధమిక దశలోనే గుర్తించి మంచి వైద్యం అందించవచ్చు

**దంత సమస్యలపై అవగాహన కల్పించిన డాక్టర్ కుక్రేజ**

**బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ పంచమ వార్షికోత్సవం..**



**రాజమహేంద్రవరం,విశ్వంవాయిస్ న్యూస్:** బేసిక్ మెడికల్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ 5వ వార్షికోత్సవం,రాజమండ్రి నగర శాఖ సర్వసభ్య సమావేశం స్థానిక మెయిన్‌రోడ్‌లో ఉన్న హొటల్ జగదీశ్వరిలో బుధవారం జరిగింది. రాష్ట్ర సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు వి.వి కృష్ణారావు అధ్యక్షతన కేక్ కట్ చేసి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. దీనికి ముందు అసోసియేషన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం నీలూస్ డెంటల్ ఆసుపత్రి అధినేత, రూట్ కెనాల్ స్పెషలిస్ట్ డాక్టర్ నీలం కుక్రేజ బిఎంపి సభ్యులకు దంత సమస్యలపై అవగాహన కల్పించారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఆధునాతన వైద్య చికిత్సలు వివరించారు. ప్రతీ ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. దంత వ్యాధులను ప్రాధమిక దశలోనే గుర్తించి మంచి వైద్యం అందించడానికి సహకరించాలని కోరారు. మానవ శరీరంలో ముఖ్యమైనవి దంతాలు అని ఎటువంటి సమస్య వచ్చినా అశ్రద్ధ చేయకుండా వెంటనే దంత వైద్యులను సంప్రదించాలని సూచించారు. చక్కని పలు వరుస ముఖానికి అందమే కాకుండా ఆరోగ్యం కూడా అని ఉద్బోధించారు. నీలూస్ డెంటల్ ఆసుపత్రిలో పళ్లని తెల్లగా చేయడం, రూట్ కెనాల్ ట్రీట్‌మెంట్, లేజర్ ట్రీట్‌మెంట్, డెంటల్ ఇంప్లాంట్స్, ఆర్థో డెంటల్ చికిత్సలు అందరికి అందుబాటులో ఉన్నాయన్నారు. డాక్టర్ కృష్ణారావు మాట్లాడుతూ ప్రాధమిక వైద్యులకు వెంటనే మళ్లీ వెయ్యి గంటల శిక్షణ ప్రారంభించాలని, శిక్షణ పూర్తయిన తరువాత సర్టిఫికెట్ అందచేయాలని, చాలా మంది గ్రామాల్లో, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రజలకు ప్రాధమిక చికిత్స అన్ని వేళల్లో అందిస్తున్నారని, వారికి ఇళ్లు కేటాయించాలని, పెన్షన్లు కూడా ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వ నిబంధనల మేరకు మాత్రమే బిఎంపిలు ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్నారని, వారి సేవలను ప్రభుత్వం వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేసారు. ప్రాధమిక వైద్యులు ప్రజలకు మంచి సేవలు అందించి సంఘానికి మంచి పేరు తేవాలని ఆకాంక్షించారు. అత్యంత నిబద్ధత, క్రమశిక్షణ కలిగిన సభ్యులతో అతి తక్కువ సమయంలో ఎక్కువ మంది సభ్యులు కలిగిన సంఘంగా ముందుకు వెళుతోందన్నారు. సమావేశంలో రాష్ట్ర సంఘ ప్రధాన కార్యదర్శి శిరికి శ్రీనివాస్, కోశాధికారి ఎవివిఎస్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.బెన్నిబాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.రామలక్ష్మణరావు, రాష్ట్ర గౌరవ సలహాదారు ఆర్.శ్యామ్‌కుమార్, వర్కింగ్ సెక్రటరీ వైఎస్ఎన్ మూర్తి, రాష్ట్ర సహాయ కార్యదర్శి బర్రే నరసింహమూర్తి, తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు ఎస్.మురళి, కార్యదర్శి ఎం.శ్రీనివాస్, కోశాధికారి హెచ్.హరిబాబు, నగర శాఖ అధ్యక్షుడు దేరా రాజు, కార్యదర్శి కె.గుప్తా కోశాధికారి డాక్టర్ బాబు, ఆలమూరు అధ్యక్షుడు మెహర్ ప్రసాద్, కోనసీమ అధ్యక్షుడు ముండూరి వెంకట రత్నం, ఆలమూరు కార్యదర్శి కెవి స్వామి, కోశాధికారి డి.నాగేశ్వరరావు, మండపేట కోశాధికారి జె.శ్రీనివాస్, తుని అధ్యక్షుడు ఆర్.శ్రీను, కాకినాడ జిల్లా అధ్యక్షుడు ఎవి రాఘవ తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య కళ్యాణమండపం నందు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి నందు లక్ష పసుపు కొమ్ముల వ్రత మహోత్సవం



**విశ్వం వాయిస్ న్యూస్ - కొవ్వూరు** గౌరీ దేవిని పసుపు కొమ్ములతో పూజించిన స్త్రీలకు సంతాన యోగము కలిగి నిండు సౌభాగ్యములు, సిరిసంపదలు కలుగుతాయని శాస్త్రాలు ఘోషిస్తున్నాయని వేద పండితులు చల్ల శ్రీకాంత్ అన్నారు బుధవారం కొవ్వూరు పట్టణంలోని ఆర్యవైశ్య కళ్యాణమండపం నందు వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి నందు లక్ష పసుపు కొమ్ముల వ్రత మహోత్సవాన్ని మహిళలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు వేద పండితులు చల్లా శ్రీకాంత్ పర్యవేక్షణలో జరిగిన పసుపు కొమ్ముల నోము కార్యక్రమంలో 108 మంది మహిళలు గౌరీదేవి అమ్మవారిని పసుపు కొమ్ములతో పూజించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ గ్రంధి సందీప్ కుమార్ ఎంఈఓ రామకిషోర్ ఆర్యవైశ్య సంఘ పెద్దలు ముద్దుల సత్యనారాయణ మద్దుల సోమరాజు తదితర ఆర్యవైశ్యంగా నాయకులు ఆర్యవైశ్య మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు

## కోరుకొండ సొసైటీ త్రిసభ్యకమిటీ అధ్యక్షులుగా బత్తుల.

**త్రిసభ్య కమిటీకి పలువురు అభినందనలు.**



**కోరుకొండ విశ్వం వాయిస్ న్యూస్:** కోరుకొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం త్రిసభ్యకమిటీ అధ్యక్షులు బత్తుల గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. బుధవారం కోరుకొండ ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం త్రిసభ్యకమిటీ అధ్యక్షులుగా బత్తుల గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. సభ్యులుగా దేవన దుర్గాప్రసాద్, సుంకర శ్రీనివాస్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా త్రిసభ్యకమిటీ సభ్యులకు జనసేన, తెదేపా, భాజపా నాయకులు కార్యకర్తలు, రైతులు పెద్ద ఎత్తున విచ్చేసి అభినందనలు తెలియజేస్తూ, పూలమాలలు వేసి సాల్వాల్తో ఘనంగా సత్కరించారు. అనంతరం త్రిసభ్య కమిటీ అధ్యక్షులు గోపాలకృష్ణ మాట్లాడుతూ రాజానగరం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ వెంకటలక్ష్మి దంపతులు, రాజమహేంద్రవరం రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, భాజపా ఇన్చార్జ్ నీరుకొండ వీరన్న చౌదరి, పలువురు ఎన్డీఏ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు. అందరి సహాయ సహకారాలతో సొసైటీని మరింత ప్రగతి పథంలో నడిపించి, ఎన్డీఏ ప్రభుత్వానికి మంచిపేరు తీసుకొద్దామన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ నాయకులు అడ్డాల శ్రీను, దూది కాంతారావు, కర్రి లక్ష్మిసరోజ గణేష్, డాక్టర్ అడపా శ్రీనివాస్, గండి రమేష్, దిడ్డి మాధవరావు, పీతా శ్రీనుబాబు, పెదపాటి భీమరాజు, అన్నం చెల్లారావు, సొసైటీ సీఈవో ఆకుల వెంకటరమణ, మాజీ సీఈవో సుధాకర్ వర్మ, ఎన్ వీరన్న దొర, సూర్యచంద్రం, రవికుమార్, రైతులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తాను

- బాలేపల్లి వెల్లడి..
- కాంగ్రెస్ నగర అధ్యక్షుడిగా బాలేపల్లి మురళీధర్
- అభినందించిన బోడ వెంకట్, పార్టీ నాయకులు




**రాజమహేంద్రవరం, విశ్వంవాయిస్ న్యూస్:** రాజమహేంద్రవరం నగర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా ఆ పార్టీ సీనియర్ నాయకుడు, పిసిసి సభ్యుడు బాలేపల్లి మురళీధర్ మళ్లీ నియమితులయ్యారు. ఈ మేరకు పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డి పంపిన నియమాక పత్రాన్ని పిసిసి సభ్యుడు బోడ వెంకట్ చేతులమీదుగా అందచేసారు. ఈ సందర్భంగా ది రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం జరిగిన మీడియా సమావేశంలో బోడ వెంకట్ మాట్లాడుతూ స్థానికంగా ఉన్న ఇబ్బందుల దృష్ట్యా పార్టీ కార్యకలాపాలకు బాలేపల్లి దూరమయ్యారని తెలిపారు. మళ్లీ ఆయనను అధ్యక్షుడిగా నియమించడం సంతోషంగా ఉందని, ఆయన సేవలు అవసరమని పార్టీ గుర్తించిందని తెలిపారు. సిడబ్ల్యుసి సభ్యుడు గిడుగు రుద్రరాజు, పిసిసి ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్ రాజా ఈ నియామకానికి కృషిచేసారని కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో కార్పొరేషన్ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మంచి ప్రాంతంలో త్వరలో సిటీ కాంగ్రెస్ పార్టీకి కార్యాలయాన్ని ప్రారంభిస్తామని వివరించారు. అందర్నీ కలుపుకుని ఐకమత్యంతో బాలేపల్లి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ ఎన్నికల బరిలోకి దిగుతుందన్నారు. బాలేపల్లి మాట్లాడుతూ చాలా సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలందిస్తూ వస్తున్నానని, తనను ప్రోత్సహించి మళ్లీ నగర అధ్యక్షుడిగా నియమించిన పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిళారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. 2027లో గోదావరి పుష్కరాలు జరుగుతాయని ఈలోగా కార్పొరేషన్ ఎన్నికలు నిర్వహించి ప్రజా ప్రతినిధులతో పాలక మండలి ఏర్పాటు కావాల్సి ఉందన్నారు. అన్ని డివిజన్లలకు ఇన్‌చార్జ్‌లను నియమంచి ప్రజల సమస్యల పరిష్కారం దిశగా పోరాటం చేయడానికి సిద్ధమవుతున్నామని వెల్లడిరచారు. తనపై నమ్మకం ఉంచి నగర అధ్యక్ష పదవి అప్పగించిన కాంగ్రెస్ పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అయితేనే ప్రజాస్వామ్యం మనుగడ సాగిస్తుందన్న విషయాన్ని ప్రజలందరూ గ్రహించాలని కోరారు. స్వతంత్ర ప్రతిపత్తి కలిగిన ఇసిపై కూడా అపవాదులు వచ్చాయని అవి తప్పని నిరూపించుకోవాల్సి ఉందన్నారు. డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగం ప్రకారం ప్రజలు స్వేచ్ఛాయుత జీవితం సాగించాలంటే కాంగ్రెస్ పార్టీని మళ్లీ అధికారంలోకి తీసుకుని రావాలని విజ్ఞప్తి చేసారు. అనంతరం ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గట్టి నవతారకేష్ ఆధ్వర్యంలో బాలేపల్లికి చిరు సత్కారం చేసారు. అనంతరం పిసిసి సభ్యుడు చింతాడ వెంకటేశ్వరరావు, నగర మహిళాధ్యక్షురాలు చామర్తి లీలావతి, పార్టీ నాయకులు ఇజ్జరౌతు సత్యనారాయణ, యాళ్ల మాచరయ్య, జి.సత్తిబాబు, బండారు వెంకన్న, రామానాయుడు, మొర్త అబ్బులు, రమేష్‌బాబు, రాజు, శెట్టి ప్రతాప్, మైధిలీ తదితరులు ఆయనను అభినందించారు.

## భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


**వనపర్తి :** రానున్న 3 రోజులు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తాయని, వాతావరణ శాఖ సూచించిందని, భారీ వర్షాల దృష్ట్యా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అత్యవసరమైతే తప్ప ఇళ్లలో నుండి బయటికి రాకూడదని, ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ఐపీఎస్., సూచించారు.

# నారాయణ స్కూల్లో అగ్నిప్రమాదం

- తృటిలో తప్పిన పెను ప్రమాదం,భద్రత ప్రమాణాలు గాలికి.. నిర్లక్ష్యం బాటలో యాజమాన్యం, ఫైర్, మున్సిపల్ కార్పొరేషన్ శాఖలు
- మీడియా కవరేజ్ చేస్తున్న ప్రతినిధులపై యాజమాన్యం బూతుల పురాణం.. ప్రజా ప్రతినిధుల అండతో నిబంధనలను కాలరాస్తున్న భవన యజమాని
- తనిఖీలు జరిపి నిబంధనలు పాటించేలాగా కఠిన చర్యలు తీసుకోవాలి





**రాజమహేంద్రవరం, విశ్వం వాయిస్ న్యూస్:** చిన్నారులు, విద్యార్థిని, విద్యార్థుల తల్లిదండ్రుల కడుపుకోతకు తీరని వేదన కలిగించే ప్రమాదం త్రుటిలో తప్పిన దుర్ఘటన నారాయణ విద్యా సంస్థల్లో బుధవారం ప్రమాదం చోటు చేసుకుంది.నారాయణ విద్యాసంస్థల పేరు చెప్పగానే ప్రమాదాలకు, ఆత్మహత్యలకు, బలవంతపు మరణాలకు, తీవ్రమైన ఒత్తిడి, వేధింపులకు రాష్ట్రంలోనే పేరుగాంచాయి. రాష్ట్రంలో ఆ విద్యాసంస్థ లో ఏదోక చోట ఏదోక దుర్ఘటన జరుగుతున్నప్పటికీ ప్రభుత్వం నుంచి గాని ,యాజమాన్యం నుంచి గాని ముందస్తు చర్యలు తీసుకున్న దాఖలాలు ఎక్కడ కూడా కనిపించవు. తాజాగా బుధవారం ప్రమాదకరమైన దుర్ఘటన రాజమండ్రిలోని మోడల్ కాలనీ శివారు చల్లా వీరభద్రరావు భవనంలో నిర్వహిస్తున్న నారాయణ విద్యాసంస్థ ప్రాంగణంలో ఉదయం ఏడున్నర గంటల సమయంలో అగ్ని ప్రమాదం జరిగింది. అయితే ఆ సమయంలో చిన్నారులు,విద్యార్థిని, విద్యార్థులు స్కూలుకు వచ్చే సమయం కాకపోవడంతో పెద్ద ప్రమాదం తృటిలో తప్పడంతో తల్లుల కడుపు కోతకు గురి కాకుండా ఆ దేవుడే కాపాడినట్లయింది. ఇక విషయానికొస్తే, మోడల్ కాలనీ శివారు ప్రాంతంలో చల్లా వీరభద్ర రావు అపార్ట్మెంట్లో సెల్లారు, గ్రౌండ్ ఫ్లోర్ తోపాటు నాలుగు అంతస్తుల భవనంలో నారాయణ విద్యా సంస్థను భద్రతా ప్రమాణాలకు పాటించకుండా నిర్వహిస్తున్నారు. భవన నిర్మాణ నిబంధనలకు విరుద్ధంగా సెల్లార్ ను యువర్ హోమ్ ఫర్నిచర్ షో రూమ్ కు గోడౌన్ గా అద్దె కివ్వడం జరిగింది. గోడౌన్ అంతా సింథటిక్, ఫోము ప్లాస్టిక్ ,ధర్మకోల్ లతో కూడిన ఫర్నిచర్ వస్తువులు ఉన్నాయి. అపార్ట్మెంట్ కు చెందిన త్రీఫేస్ కరెంటు వైర్లు, ట్రాన్స్ఫార్మర్ల ను సెల్లార్ పక్కన ఆనుకొని కార్పొరేషన్ రోడ్డు స్థలాన్ని ఆక్రమించి భవనం యజమాని ఏర్పాటు చేయడం జరిగింది. బుధవారం ఉదయం సుమారు 7 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్ జరగడంతో గొడన్ ల్లో ఫర్నిచర్ అగ్నికి ఆహుతి కావడం తో దట్టమైన పోగలు వ్యాపించాయి. దాంతో పరిసర ప్రాంతాల ప్రజలు, స్థానికులు ఆ అగ్నిమాపక విపత్తు దళానికి సమాచారం అందించారు. దాంతో రాజమండ్రి , కొవ్వూరు నుంచి ఫైర్ వాహనాలు , సిబ్బంది వచ్చి మంటలను అదుపులో తీసుకొచ్చారు. ప్రమాద నివారణ పనులు జరుగుతున్న సమయంలోనే స్కూలుకు విద్యార్థిని, విద్యార్థులు వస్తుండడంతో వారికి సెలవు ప్రకటించి ఇంటికి పంపించడం జరిగింది. ఇదిలా ఉండగా, అగ్ని ప్రమాదం వార్తా సమాచారం తెలుసుకున్న మీడియా కవరేజ్ కి వెళ్ళగా వారిపై యాజమాన్యం చెందిన ఏజిఎం అనే ఒక వ్యక్తి దుర్భాషలాడుతూ దుర్భాషలాడుతూ చిందులు వేశాడు. ప్రమాద దృశ్యాలను ఫోటోలు తీయకుండా గేట్లకు తాళాలు వేసి అడ్డుకున్నాడు, సమాచారం చెప్పవలసిన అవసరం లేదని , ఇది మంత్రులదని, ప్రజాప్రతినిధులు మా వెనక ఉన్నారని, ఏ ప్రమాదం జరిగిందని, ఎవరు చనిపోలేదుగా అని మీడియా వర్గాలతో హేళనగా, దురుసుగా మాట్లాడడంతో వాగ్వాదం జరిగింది. నిర్మాణంలో ఉండగానే భవనంలో విద్యాసంస్థను నిర్వహించడానికి మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా విద్యాశాఖ ,ఫైర్ శాఖ అధికారులు ఎలా అనుమతులు ఇచ్చారని, ఏదైనా ప్రమాదం ముంచుకొచ్చి తల్లులు కడుపు కోత మిగిలితే ఎవరిది బాధ్యతని ఎస్ ఎఫ్ ఐ , సిఐటియు, డి వై ఎఫ్ఐ విద్యార్థి సంఘాల నాయకులు ఎన్ రాజు ,వై భాస్కర్, జ్యోతి, రాంబాబులు ప్రశ్నించారు. విద్యాసంస్థల నిర్వహణకు ముందే ప్రభుత్వ శాఖలు విధిగా తనిఖీలు చేపట్టి విద్యాసంస్థలకు అనుమతులు ఇవ్వవలసి ఉందన్నారు. అయితే ప్రజాప్రతినిధుల, మంత్రుల అండ చూసుకొని అధికారులు నిబంధనలను, భద్రత ప్రమాణాలను తనికీలను పక్కన పెడుతున్నారని, విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా రని విమర్శించారు. ఈ విద్యా సంస్థలో ప్రమాదం జరగలేదు కాబట్టి సరిపోయిందని, ఏదైనా జరిగితే తల్లిదండ్రుల కడుపు కోతకు బాధ్యత ఎవరిదని వారు ప్రశ్నించారు. నగరంలోని అన్ని విద్యాసంస్థలను రాజకీయాలకు అతీతంగా ,నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న విద్యాసంస్థలపై తనిఖీలు జరిపి నిబంధనలు పాటించేలాగా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.లేనియెడల తమ విద్యార్థి సంఘాలతో కలిసి సంయుక్త పోరాటం చేస్తామని వారు హెచ్చరించారు.



## గణేశ నవదుర్గా మండలి నూతన కార్యవర్గం ప్రమాణస్వీకారం

**కోరుట్ల :** పట్టణంలోని త్రిశక్తి మాత దేవాలయంలో గణేశ నవదుర్గా మండలి కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేశారు. ఎన్నికైన నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి దగ్గుల నర్సయ్య బుధవారం ప్రమాణస్వీకారం చేయించారు. గణేశ నవదుర్గా మండలి అధ్యక్షులు కటుకం గణేష్ మాట్లాడుతూ అందరి సంపూర్ణ సహకారంతో సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని చెప్పారు. గౌరవ అధ్యక్షులు కట్ట నారాయణ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన సభ్యులు ఆలయ అభివృద్ధికి అంకిత భావంగా కృషి చేస్తూ, ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గణేశ నవదుర్గా మండలి అధ్యక్షులు కటుకం గణేష్, ఉపాధ్యక్షులు ఎలిగేటి సుమన్, ప్రధాన కార్యదర్శి వడ్లకొండ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి మామిడిపల్లి రమేష్, కోశాధికారిగా అడువాల ప్రభాకర్, ఎన్నికల అధికారి దగ్గుల నర్సయ్య, సహాయ ఎన్నికల అధికారులు సంకు అశోక్, కటుకం గంగారాం, భోగ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## కోరుట్ల కోట బురుజులను రక్షించాలని ఎంపి.అరవింద్ ను కోరిన వామపక్ష ప్రజాసంఘాల నాయకులు



**కోరుట్ల :** చారిత్రక నేపథ్యం వున్న కోరుట్ల కోట బురుజులు కోనేరు వాటి స్థలాలు అన్యాక్రాంతం అవుతూ కబ్జాదారుల కబంధహస్తల్లో బందీ అవుతున్నాయని వాటిని రక్షించాలని కోరుతూ నిజామాబాద్ ఎంపి ధర్మపురి అరవింద్ ను తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పేట భాస్కర్, సిపిఐ, సిపిఎం, న్యూడెమోక్రసీ, అంబేద్కర్ సంఘాల జిల్లా నాయకులు చెన్న విశ్వనాథం, చింత భూమేశ్వర్, తిరుపతి నాయక్, భూపెల్లి నగేష్ లు కలిసి విజ్ఞప్తి చేశారు. బుధవారం నిజామాబాద్ లోని ఎంపి నివాసంలో ఎంపీ ధర్మపురి అర వింద్ ను కలిసిన నాయకులు కోరుట్ల కోట బురుజులు వాటి పుర్వాపరాలు స్థలాల రక్షణకై అనేక రకాలుగా తాము పోరాటాలు చేస్తున్నప్పటికీ లక్ష్యం నేరవేరడం లేదని వివరించారు. కొందరు స్థానిక నాయకులు రియల్టర్లతో కుమ్మక్కై దసరా ఉత్సవాలలో అనవాయితిగా వస్తున్న దుర్గాదేవి మహిషాసుర వద స్థలంతో పాటు కోట బురుజులను, కోనేరును అనుకొని వున్న స్థలాలను పాత జివోల స్థానంలో కొత్త జివోలు తీసుకవచ్చి భూములను అమ్మేసి భవిష్యత్తులో బురుజులు భూస్థాపితం చేయాలనే కుట్ర చేస్తున్నారని వాటిని తమరే కాపాడాలని స్థానిక పార్లమెంట్ సభ్యులుగా, కోరుట్ల మనవడిగా పట్టణ ప్రజలకు న్యాయం చేయాలని కొత్త జివోలను రద్దు చేసి బురుజుల స్థలాల్లో నూతన మార్కెట్, అహ్లాదకరమైన పార్కును ఏర్పాటు చేయాలని ఎంపి అరవింద్ ను కోరారు. ఈ విషయంలో ఎంపీ సానుకూ లంగా స్పందించారని పురవస్తు శాఖతో పాటు సంబందిత అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు కోట

## వర్షాకాలం దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలి

**మున్సిపల్ కమిషనర్ రవీందర్**



**కోరుట్ల :** వర్షాకాలం దృష్ట్యాఇటీవల కురుస్తున్న భారీ వర్షాలు నైపద్యంలో ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ రవీందర్ అన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన 100 రోజుల ప్రణాళికలో భాగంగా బుధవారం మున్సిపల్ కమిషనర్ రవీందర్ వర్షాకాలం దృష్ట్యా పట్టణం లోని పలు వార్డులలోని శిథిలావస్థలో ఉన్న భవనాలను గుర్తించి అందులో ఉన్న వారిని వెంటనే ఖాళీ చేయించారు.. అలాగే రిపేరు చేసుకొనవలసినదిగా లేదా కూల్చి వేసుకో వాలని కోరారు.ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టము జరగకుండా అప్రమత్తంగా ఉండాలని కోరారు.ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రవీందర్ మాట్లాడుతూ కోరుట్ల మున్సిపాలిటీ లో శిథిలావస్థలో ఉన్న భవనాలను వెంటనే ఖాళీ చేయించి సురక్షిత ప్రాంతానికి తరలించడం జరిగిందని తెలిపారు, రిపేరు చేసుకొనవలసినదిగా లేదా కూల్చి వేసుకోవాలని నోటిసులు జారీ చేసినట్టు తెలిపారు. కోరుట్ల మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, కంట్రోల్ రూమ్ ఫోన్ నెంబర్ 9100039255 అత్యవసర సమయంలో సహాయం కొరకు ఈ నెంబర్ కి కాల్ చేయాలని కోరారు. ఎందుకు పట్టణ ప్రజలు సహకరించాలని కమిషనర్ కోరారు.

# గంజాయి కాల్చివేత

## పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ



**సిద్దిపేట :** పోలీస్ కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్ లలో 2019, 2022, 2023, 2024 మరియు 2025 సంవత్సరాలలో నమోదైన 30 కేసులలో గంజాయి పట్టుకోవడం జరిగింది. పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ. ఆధ్వర్యంలో గంజాయి డిస్ట్రయ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. కమిటీ చైర్మన్ కమిషనర్ కమిటీ మెంబర్లు ఏఆర్ అడిషనల్ డీసీపీ సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసిపి యం. రవీందర్ రెడ్డి, ఆధ్వర్యంలో సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో 30 కేసులలో ఉన్న గంజాయిని అందాజా 21.017 కిలో గ్రామ్స్ గంజాయిని చిన్నకోడూరు మండలం మాచాపూర్ గ్రామ శివారులో ఉన్న ధర్మ అండ్ కంపెనీ బయో మెడికల్ వేస్టేజ్ ప్రాసెసింగ్ యూనిట్లోఇన్సులేటర్ లో డిస్ట్రయ్ కాల్చి వేయడం, జరిగింది.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ. గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలపై జిల్లాలో ప్రత్యేక టీమ్స్ తో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మరియు ప్రత్యేక డాగ్స్ తో బ్లాక్ స్పాట్స్ వద్ద తనిఖీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. యువత మత్తు పదార్థాలకు బానిస కావద్దని సూచించారు డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడితే కుటుంబాలు మరియు జీవితాలు నాశనం అవుతాయని తల్లిదండ్రులు కూడా పిల్లలు ఎక్కడికి వెళు తున్నారు ఏం చేస్తున్నారో ఒక కన్నేసి పెట్టాలని సూచించారు. ఆన్లైన్లో ఇంటికి ఏవైనా పార్సల్స్ వస్తే తల్లిదండ్రులు వాటిపై నిఘా ఉంచాలని తెలిపారు. గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల రహిత జిల్లాగా చేయడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఏఆర్ అడిషనల్ డిసిపి సుభాష్ చంద్రబోస్, సిద్దిపేట ఏసిపి రవీందర్ రెడ్డి, సిసిఆర్బి ఇన్స్పెక్టర్ రామకృష్ణ, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ వాసుదేవరావు, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్, సిద్దిపేట రూరల్ సీఐ శ్రీను, హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్, ఎస్బి ఇన్స్పెక్టర్ మొగిలి, రిజర్వ్ ఇన్స్పెక్టర్లు పూర్ణచందర్, రాజేష్, టూ టౌన్ ఎస్ఐ ఆసిఫ్, చిన్నకోడూరు ఎస్ఐ సైఫ్ అలీ, బెజ్జంకి ఎస్ఐ సౌజన్య, మరియు పోలీస్ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలి

**కరీంనగర్ :** డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు.నషా ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమం ఐదవ వార్షికోత్సవం సందర్భంగా ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి హాజరయ్యారు. ఇక్కడ ఎన్సిసి కేడేట్స్, విద్యార్థులతో కలిసి మాధక ద్రవ్యాలు నియంత్రణకు ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డ్రగ్స్ రహిత సమాజమే లక్ష్యంగా ముందుకు సాగాలని అన్నారు.




## టీటీడీ వి ఐ పి టికెట్ల మోసం బట్టబయలు

**నిందితుడుని అరెస్ట్ చేసిన జగ్గంపేట పోలీసులు**




**జగ్గంపేట :విశ్వం వాయిస్ న్యూస్** తిరుమల తిరుపతి దేవస్థానం (టీ టీ డి )విఐపి దర్శన టికెట్లు ఇప్పిస్తానని నమ్మబలికి ప్రజలను మోసం చేస్తున్న ఒక వ్యక్తిని జగ్గంపేట పోలీసులు అరెస్ట్ చేశారు.పోలీసుల వివరాల ప్రకారం, జూలై 10న జగ్గంపేట ఎమ్మెల్యే, టీటీడీ పాలక మండలి సభ్యులు జ్యోతుల నెహ్రూ వ్యక్తిగత సహాయకుడు (%ూా%) డి. శివ ప్రసాద్‌కు, వంశీ పేరుతో ఒక వ్యక్తి ఫోన్ చేసి, "నేను ఎమ్మెల్యే ఆఫీస్ నుంచి మాట్లాడుతున్నాను. విఐపి దర్శనం, సేవా టికెట్లు ఇప్పిస్తాను. ఇందుకోసం ?50,000 ఖర్చు అవుతుంది" అని చెప్పాడు. అలాగే ఆధార్ కార్డు వివరాలు పంపాలని కోరాడు.అతని మాటల్లో అనుమానం గమనించిన పీఏ వెంటనే ఎమ్మెల్యేకు సమాచారం అందించగా, జగ్గంపేట పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 228/2025 కింద %ఖ/ా 318(2), 319(2), 318(4) దీూ, 66-ఐ ఒు% యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశారు.ఈ కేసును కాకినాడ జిల్లా ఎస్పీ జి. బిందు మాధవ్, ఐపీఎస్ పర్యవేక్షణలో ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేసి, కిర్లంపూడి ఎస్సై జి. సతీష్, జగ్గంపేట సిఐ రైటర్ కృపారావు, పోలీస్ కానిస్టేబుల్ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టారు.సాంకేతిక ఆధారాలను సేకరించి, నిందితుడు కోనసీమ జిల్లా గుడిమూలం గ్రామానికి చెందిన జి. రాజకుమార్ అలియాస్ ఆర్‌కే అలియాస్ విజయ్ కుమార్ అలియాస్ వంశీ (37) అని గుర్తించారు. ప్రస్తుతానికి గోవాలో నివసిస్తున్న అతడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.2020%-%2024 మధ్య సూర్యాపేట, తణుకు, కృష్ణలంక, పాలకొల్లు, నర్సాపురం, ఎల్‌బీ నగర్ తదితర ప్రాంతాల్లో ఈ నిందితుడిపై పలు మోస కేసులు నమోదై ఉన్నాయి. సోషల్ మీడియా, గూగుల్ సెర్చ్ ద్వారా వ్యాపారులు, వ్యక్తుల వివరాలు సేకరించి, తాను ప్రముఖుల పీఏనని పరిచయం చేసుకొని, విఐపి టికెట్లు ఇప్పిస్తానని నమ్మబలికి డబ్బులు వసూలు చేయడం ఇతని తరహా.ఇటీవల గోకవరం ప్రాంతంలోని ఒక బంగారు దుకాణ యజమాని దగ్గర కూడా ఇదే పద్ధతిలో మోసం చేయడానికి ప్రయత్నించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుడిని కోర్టులో హాజరుపరిచినట్లు అలానే నిందితుడికి 14 రోజులు రిమాండ్ (26/08/2025 )విధిస్తూ పెద్దాపురం సబ్ జైల్ కి తరలించడం జరిగిందని జగ్గంపేట సిఐ వై.ఆర్.కే. శ్రీనివాస్ వెల్లడించారు.

## బెస్త లకు అన్యాయం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

**బెస్త కార్పోరేషన్ చైర్మన్ పదివికి కూటమి ప్రభుత్వంలో బెస్త నాయకులే లేరా..?**

**బెస్త కుల జె. ఏ. సి నాయకులు యాట్ల నాగేశ్వరరావు**



**రామచంద్రపురం నియోజకవర్గం, ద్రాక్షారామ:** రాష్ట్రములో దాదాపు 15 లక్షలు జనాభా కలిగిన బెస్త లు 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టిడిపి కి మద్దతుగా పనిచేసి, మెజారిటీ తో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడానికి బెస్త ల పాత్ర కీలకమైనద ని అయినప్పటికీ వారికి రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేసిందని, ప్రభుత్వ తీరుపై ఉభయ గోదావరి జిల్లాల బెస్త కుల జె. ఏ. సి నాయకులు యాట్ల నాగేశ్వరరావు ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ కార్పొరేషన్ల చైర్మన్ ల నియామకంలో భాగంగా బెస్తలు కాని వారికి బెస్త కార్పొరేషన్ చైర్మన్ ఇవ్వడం బెస్త లైన మమ్మల్ని అవమానించడేమనని, బెస్త కులం కాని వ్యక్తికి పదవిని కట్టబెట్టడం సిగ్గుచేటు అన్నారు. ఇప్పుడు బెస్త కార్పొరేషన్ చైర్మన్ గా పదవిని ఇచ్చిన వ్యక్తి బెస్త నే కాదని ఆరోపిస్తూ, అతన్ని వెంటనే ఆ పదవి నుండి తొలగించాలని డిమాండ్ చేశారు. రాయలసీమలో మా బెస్త లకు నామినేటెడ్ పదవి ఇవ్వకపోతే కోస్తాలో ఇవ్వాలని, అంతే గానీ బెస్త కులం కాని వారికి ఇవ్వడం అనేది రాష్ట్రం లో ఉన్న బెస్త కుల జాతిని అవమానించడమేనని, బెస్త కార్పొరేషన్ చైర్మన్ పదివికి కూటమి ప్రభుత్వంలో బెస్త నాయకులే లేరా.? అని యాట్ల ప్రశ్నించారు.

## 6బహుజనుల ఆరాధ్య దైవం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

**జిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత**

**జగిత్యాల :** బహుజనుల ఆరాధ్య దైవం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అనిజిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత-సురేష్ కొనియాడారు.బుధవారం పట్టణంలోని గొల్లపల్లి బైపాస్ చౌరస్తా లో శ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహా ఆవిష్కరణ సందర్భంగా మాజీ మంత్రి, మాజీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ రాజేశం గౌడ్, మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రశేఖర్ గౌడ్, గౌడ సంఘం నాయకులతోజిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ లతో కలిసి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాల వేసినివాళులర్పించారు.ఈ సంధర్భంగాజిల్లా తొలి జడ్పీ చైర్ పర్సన్ దావ వసంత సురేష్ మాట్లాడుతూతెలంగాణ బహుజన ఆత్మగౌరవానికి, ధీరత్వానికి సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ప్రతీకగా నిలిచారన్నారు.సబ్బండ వర్గాలకు రాజకీయ, సామాజిక సమానత్వం కోసం పాపన్న చేసిన కృషి చరిత్రలో సువర్ణాక్షరాలతో ఎప్పటికీ నిలిచి ఉంటుందని, కుల,మతాల వివక్ష లేకుండా అన్ని వర్గాలకు రాజ్యాధికారంలో భాగస్వామ్యం దక్కాలనే సమ సమాజ ప్రజాస్వామిక స్ఫూర్తితో ఆనాటి కాలంలోనే పాపన్న గౌడ్ పోరాడడం ఎంతో గొప్ప విషయం అని అన్నారు.17వ శతాబ్దంలోనే బహుజన రాజుగా చరిత్ర పుటల్లో నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మనందరికీ ఆదర్శం అన్నారు.375 సంవత్సరాల క్రితమే కుల,మత జాతి విభేదాలు లేకుండా సమ సమాజ స్థాపన కోసం గొప్ప పోరాటం చేసిన గొప్ప పోరాట యోధుడు పాపన్న అని కొనియాడారు.విశ్వకీర్తిని పొందిన పాపన్న గొప్పతనాన్ని స్మరించుకునేందుకు ప్రతి ఏటా వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించిందని ఈ సందర్భంగా ఆమే గుర్తు చేశారు.

# ఏజెంట్లే లేకుండా ఎన్నికలా?

-మొదటిపేజీ తరువాయి

చెప్పారు. 'మీ పరిపాలన మీద మీకు విశ్వాసం ఉంటే.. మీరు ప్రజలకు మంచి చేశారని నమ్మితే, వారు మీకు ఓటు వేస్తారనుకుంటే.. వెంటనే మంగళవారం జరిగిన పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల ఉప ఎన్నికలు రద్దు చేయండి. కేంద్ర బలగాల పర్యవేక్షణలో ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు నిర్వహించండి' అని సవాల్ విసిరారు.

మీకు ఆ నమ్మకం లేదు కాబట్టే.. మీరు ప్రజలను మోసం చేశారు కాబట్టే.. ప్రజలు మీకు ఓటు వేయరు కాబట్టే, విచ్చలవిడిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని దెప్పిపొడిచారు. 'ప్రతి బూత్‌కు సంబంధించిన వెబ్ కాస్టింగ్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఇచ్చే ధైర్యం ఉందా? పోలింగ్ బూత్ ఆవరణల్లో సీసీ ఫుటేజ్ బయట పెడతారా? ఆ ధైర్యం ఉందా?' అని సీఎం చంద్రబాబుకు మరో సవాల్ విసిరారు.

వెబ్ కాస్టింగ్, సీసీ ఫుటేజీ ఇస్తే ఎవరెవరు బయటి నుంచి వచ్చి, పోలింగ్ బూత్‌లు ఆక్రమించి దొంగ ఓట్లు వేశారనేది మరింతగా బట్టబయలవుతుందన్నారు. బుధవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాల వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు తుమ్మల హేమంత్‌రెడ్డి, ఇరగంరెడ్డి సుబ్బారెడ్డి, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్‌లను తనతో కూర్చోబెట్టుకుని వైఎస్ జగన్ మీడియాతో మాట్లాడారు.

ఉప ఎన్నిక పోలింగ్‌లో పోలీసులు, టీడీపీ నాయకులు జట్టుగా ఏర్పడి వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను పోలింగ్ బూత్‌లలోకి వెళ్లకుండా అడ్డుకోవడం, ఏజెంట్లపై దౌర్జన్యం చేయడం.. ఓటు వేయడానికి వెళ్తున్న ఓటర్లను అడ్డుకోవడం.. ఇతర ప్రాంతాల నుంచి రప్పించిన టీడీపీ నాయకులతో దొంగ ఓట్లు వేయించుకోవడం, కలెక్టర్ సమక్షంలోనే దొంగ ఓట్లు వేయడం నుంచి వైఎస్సార్‌సీపీ నాయకులపై పోలీసుల ఏకపక్ష దాడులు.. టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, నాయకుల దౌర్జన్యాలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలను చూపుతూ సాక్ష్యాధారాలతో ప్రభుత్వాన్ని కడిగిపారేశారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిన తీరును తూర్పారబట్టారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నిక నిర్వహించడంలో రాష్ట్ర ఎన్నికల కమిషన్ పూర్తిగా విఫలమైన తీరును సాక్ష్యాధారాలతో ఎండగట్టారు. ఈ సందర్భంగా వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

**రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా?**

రాష్ట్రంలో ప్రజాస్వామ్యం కనిపించడం లేదు. అందుకు నిన్న (మంగళవారం) జరిగిన ఎన్నికలు (పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఉప ఎన్నికలు) ప్రత్యక్ష ఉదాహరణ. రాష్ట్ర చరిత్రలో తొలిసారిగా పోలింగ్ బూత్‌లలో ప్రతిపక్ష పార్టీకి సంబంధించిన ఏజెంట్లు లేకుండా ఎన్నికలు నిర్వహించారు. పులివెందుల జెడ్పీటీసీ ఉప ఎన్నికలో 15 పోలింగ్ బూత్‌లు ఉండగా, వాటిలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లను అస్సలు ఉండనివ్వలేదు. ఏ ఒక్క ఏజెంట్‌ను బూత్ దగ్గరకు పోనివ్వకుండా ఆపేసి రిగ్గింగ్ చేశారు. పోలీసుల ప్రోద్బలంతో బూత్‌లలోకి ఏజెంట్లను పోనివ్వలేదు. ఇంత దారుణం ఏ ప్రజాస్వామ్య దేశంలో ఎక్కడా ఉండదేమో.. ఒక్క మన రాష్ట్రంలో తప్ప!.

**పోలింగ్ ఏజెంట్ల కీలక బాధ్యతలు**

అసలు ఎన్నికల్లో బూత్ ఏజెంట్ హక్కులు, బాధ్యతలు ఏమిటంటే.. దొంగ ఓటర్లను గుర్తించడం. ఓటర్ల జాబితాను తనిఖీ చేయడం. ఎక్కడైనా అక్రమాలు గుర్తిస్తే, వెంటనే పోలింగ్ అధికారికి చెప్పడం. అలాగే అవే వివరాలు పార్టీకీ తెలియజేయడం. ఈ బాధ్యతలన్నీ ఏజెంట్లకు ఉంటాయి కాబట్టే.. వారికీ హక్కులు కల్పించబడ్డాయి. ఒక పోలింగ్ ఏజెంట్ బూత్‌లోకి వెళ్లగానే పోలింగ్ మొదలవడానికి ముందే ఫామ్%–%12 (వారి అపాయింట్‌మెంట్ కోసం పార్టీ ఇచ్చేది)ను అక్కడి ప్రిసైడింగ్ ఆఫీసర్‌కు ఇస్తారు. ఆ తర్వాత బూత్‌లో కూర్చుంటాడు. కానీ నిన్న (మంగళవారం) మా పార్టీ ఏజెంట్ల నుంచి ఆ ఫామ్‌లను టీడీపీ వారు, పోలీసులు లాక్కుని చింపేశారు. ఆ స్థాయిలో ప్రజాస్వామ్యం దిగజారి పోవడం చరిత్రలో చూసి ఉండం. ఓటరు బూత్‌లోకి రాగానే తన పేరు చెబుతాడు. అక్కడ పోలింగ్ ఆఫీసర్ సంతకం తీసుకుని బ్యాలెట్ ఇస్తాడు. రిజిస్టర్ నింపేది పోలింగ్ ఆఫీసర్ అయితే, దాన్ని నిర్ధారించేది పోలింగ్ ఏజెంట్. పోలింగ్ ముగిసిన తర్వాత ఫాం%–%32ను నింపి ఆ బూత్‌లో ఎన్ని ఓట్లు పోల్ అయ్యాయనేది రికార్డు చేస్తారు. బూత్‌లో ఉండే అధికారి ఆ రికార్డును ఏజెంట్‌కు ఇవ్వాల్సి ఉంటుంది. అంతే కాకుండా ప్రిసైడింగ్ ఆఫీసరు.. ఏజెంట్ నుంచి ఒక రిసీట్ కూడా తీసుకుంటాడు. ఆ రికార్డుతో ఈ రిసీట్‌ను కూడా జత చేయాలి.

మరోవైపు ఆ రికార్డును ధృవీకరించడమే కాకుండా, బ్యాలెట్ బాక్స్‌కు సీల్ వేసే వరకు ఏజెంట్ అక్కడే ఉంటాడు. చివరకు ఆ సీల్‌పై కూడా పోలింగ్ ఏజెంట్ సంతకం చేస్తాడు. ఈ ఉప ఎన్నికల్లో ఇవన్నీ జరిగాయా? ఈ రోజు ఎంత దారుణంగా వారు ఎన్నికలు నిర్వహించారంటే, ప్రజాస్వామ్యాన్ని ఎంతగా ఖూనీ చేశారంటే.. ఒక్కమాటలో చెప్పాలంటే అచ్చం చంబల్‌లోయ బందిపోట్ల మాదిరిగా వ్యవహరించారు. పోలీసులే దగ్గరుండి అన్నింటినీ ప్రోత్సహించారు.

**చంద్రబాబుకు ఇదే నా సవాల్**

మీ పరిపాలన మీద మీకు విశ్వాసం ఉంటే, మీరు ప్రజలకు మంచి చేశారని నమ్మితే, వారు మీకు ఓటు వేస్తారనుకుంటే, వెంటనే నిన్నటి ఎన్నికలు రద్దు చేయండి. కేంద్ర బలగాలు దింపి, వారి ఆధ్వర్యంలో ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నికలు నిర్వహించండి. మీకు ఆ నమ్మకం లేదు కాబట్టే, మీరు ప్రజులను మోసం చేశారు కాబట్టే, ప్రజలు మీకు ఓటు వేయరు కాబట్టే, విచ్చలవిడిగా ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారు. ప్రతి బూత్‌కు సంబంధించిన వెబ్‌కాస్టింగ్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఇచ్చే ధైర్యం ఉందా? పోలింగ్ బూత్ ఆవరణల్లో సీసీ ఫుటేజ్ బయట పెడతారా? ఆ ధైర్యం ఉందా? మీకు ఆ ధైర్యం లేదు. అయినా ఎవరెవరు బయటి నుంచి వచ్చి, పోలింగ్ బూత్‌లు ఆక్రమించి దొంగ ఓట్లు వేశారనేది చూపుతాం. ఇలా అడ్డగోలు రాజకీయాలు చేసే నాయకుణ్ని లీడర్ అనరు. మాబ్‌స్టర్ లేదా ఫ్రాడ్‌స్టర్ అంటారు. ఎంత దారుణంగా నిన్నటి ఎన్నికలు జరిగాయంటే.. ఎక్కడైనా ఏ ఊరి ఓటర్లు ఆ ఊరిలోనే ఓట్లు వేస్తారు. ఎప్పుడైనా, ఎక్కడైనా అదే జరుగుతుంది. ఓటర్లు వారి సొంత ఊళ్లలోనే ఓటేయడం సహజం. కానీ, ఇక్కడ చంద్రబాబు ఏకంగా ఒక ఊరి నుంచి మరో ఊరికి పోలింగ్ బూత్‌లు మార్చేశారు. ఎర్రబల్లి నుంచి నల్లపురెడ్డిపల్లికి, నల్లగొండవారిపల్లి నుంచి నల్లపురెడ్డిపల్లికి, మళ్లీ నల్లపురెడ్డిపల్లి వారు ఎర్రబల్లికి.. నల్లపురెడ్డిపల్లి నుంచి నల్లగొండవారిపల్లికి వెళ్లి ఓటు వేయాలంట. 4 కిలోమీటర్లు నడిచి వెళ్లేలా పోలింగ్ సెంటర్లు మార్చారు. దాదాపు 10,600 ఓట్లకు గాను, 4 వేల ఓట్లకు సంబంధించిన పరిస్థితి ఇది. స్కెచ్ అక్కడే మొదలైంది. ఇంకా వారి ఆలోచన ఏమిటంటే, ఓటర్లు 4 కిలోమీటర్లు నడిచి పోతుంటే బెదిరించాలి. దాడి చేసి అడ్డగించాలి. ఓటేయకుండా చూడాలి. నిన్న అదే జరిగింది.

**ఏకంగా గ్రామాలే పంచుకున్నారు**

ఈ ఎన్నికలు స్వేచ్ఛగా జరిగాయని ఎవరైనా అంటారా? టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు ఎన్నికలు జరుగుతున్న గ్రామాల్లో అరాచకం సృష్టించేందుకు ఈ గ్రామాలను పంచుకున్నారు. మంత్రి సవిత ఎర్రబల్లెలో తిష్ట వేస్తే.. ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి జమ్మలమడుగు నుంచి భారీగా తన అనుచరులతో నల్లపురెడ్డిపల్లెలో మకాం వేశాడు. మరో టీడీపీ ఎమ్మెల్యే పుత్తా చైతన్య ఇ.కొత్తపల్లిలో వందల మంది కార్యకర్తలతో మకాం వేస్తే.. బీటెక్ రవి అనే టీడీపీ నాయకుడు పులివెందుల రూరల్ ఓటరు కాకపోయినా కనంపల్లిలో తిష్ట వేసి దౌర్జన్యం చేశాడు. పోలింగ్ బూత్‌లకు వైఎస్సార్‌సీపీ ఏజెంట్లు వెళితే, వారిపై దాడి చేసి, ఫామ్‌లు లాక్కుని చింపేశారు. ఓటర్ల స్లిప్‌లు కూడా లాక్కుని వారిని వెనక్కి పంపి, వారే ఓటు వేసుకున్నారు. ఎవరైనా వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుడైనా, లేక తటస్థుడైనా బూత్ వైపు వస్తే టీడీపీ వారు బెదిరించి ఓటరు స్లిప్ లాక్కుని దౌర్జన్యంగా బయటకు పంపించారు.

**ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పండి**

డీఐజీ కోయ ప్రవీణ్ పర్యవేక్షణలో ఇన్ని అక్రమాలతో జరిగింది ఎన్నికలేనా? అసలు ఎందుకు ఈ ఎన్నికలు జరపడం?

ఉదయం 4 గంటల నుంచే పోలింగ్ బూత్‌ల ఆక్రమణ నిజం కాదా?

పులివెందుల టౌన్‌లో ఉన్న ఎంపీ అవినాష్‌రెడ్డి అక్రమ అరెస్ట్ నిజం కాదా? నిజానికి అక్కడ ఎన్నిక లేదు. అయినా తెల్లవారుజామున అరెస్టు చేశారు.

మొట్నూతలపల్లెకు 2 కిలోమీటర్ల దూరంలోనే వాహనాలు ఆపి, ఓటర్లను అడ్డగించడం నిజం కాదా?

ఎర్రపల్లెలో మహిళలను ఓటు వేయనివ్వక పోవడం నిజం కాదా?

కనంపల్లి సర్పంచ్ రామాంజనేయులు ఇంటికి వెళ్లి, మంచంపై రైఫిల్ పెట్టి బెదిరించడం వాస్తవం కాదా?

ఎర్రపల్లెలో రిగ్గింగ్‌కు వెళ్తున్న టీడీపీ కార్యకర్తలకు పోలీసులు స్వాగతం పలకలేదా?

కనంపల్లెలో రిగ్గింగ్ జరిగిందని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేయడం, బిటెక్ రవి తమ్ముడు భరత్ బెదిరింపులు నిజం కాదా?

తమను ఓటు వేయనీయాలంటూ ఓటర్లు కనంపల్లెలో పోలీసుల కాళ్లు పట్టుకుని వేడుకోలేదా?

పులివెందులలో వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ అభ్యర్థి హేమంత్‌రెడ్డిని బయటకు రానివ్వకపోవడం నిజం కాదా?

ఒంటిమిట్టలోనూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఓటర్లు వాపోలేదా?

ఆర్.తుమ్మలపల్లిలో టీడీపీ వాళ్ల స్లిప్‌లు ఇస్తూ, దొంగ ఓట్లు వేయించలేదా?

ఎన్నిక పులివెందుల రూరల్‌లో జరుగుతుంటే, పులివెందులలో ఉన్న ఎమ్మెల్యే ఆఫీస్‌కు డీఐజీ కోయ ప్రవీణ్ వెళ్లి ఎందుకు హడావుడి చేశారు?

'కాల్చి పారేస్తా నా కొడకా' అంటూ డీఎస్పీ మురళి బెదిరించడం వాస్తవం కాదా?


మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ఒంటిమిట్ట మండలం చిన్న కొత్తపల్లి పోలింగ్ సెంటర్‌లో దౌర్జన్యం చేయలేదా? మా పార్టీ ఏజెంట్‌పై దారుణంగా దాడి జరగలేదా?

చంద్రబాబూ.. నీవు నిజంగా మంచి చేశావనుకుంటే ఎందుకీ అక్రమాలు?

# 20 ఏళ్లకే దేశానికి అధ్యక్షుడు..! కట్‌చేస్తే..

నిండా 25 ఏళ్లు లేవు కానీ ఓ దేశానికి అధ్యక్షుడిగా పాలిస్తున్నాడు . అది కూడా స్వయం ప్రకటిత దేశం. ఆ దేశానికి స్వంతంగా జెండా, కేబినేట్, స్వంత కరెన్సీ కూడా ఉంది. ఇదంతా ఎక్కడ..? అంత చిన్న వయసులోనే అధ్యకుడైన ఆ టీనేజర్ ఎవరు అంటే..?.. స్వయం ప్రకటిత దేశానికి అధ్యుడిగా ఉన్న ఆ వ్యక్తి డేనియల్ జాక్సన్. బ్రిటన్‌కి చెందినవాడు, ఆస్ట్రేలియా మూలాలు ఉన్న వ్యక్తి. ఆ దేశం పేరు ఫ్రీ రిపబ్లిక్ ఆఫ్ వెర్డిస్ అత్యంత ఆసక్తికర విషయం ఏంటంటే 18 ఏళ్ల వయసులోనే సొంతంగా ఓ దేశాన్ని క్రియేట్ చేసి తానే అధ్యక్షుడిగా ఉండాలని కలలు కనేవాడట. అలా క్రొయేషియా, సెర్బియా దేశాల మధ్య ఉన్న వివాదాస్పద భూమిని తన రాజ్యంగా ఎంచుకుని స్వయం ప్రకటిత దేశంగా మార్చాడు. వృత్తి రీత్యా డిజిటల్ డిజైనర్, గేమింగ్ ప్లాట్‌ఫామ్ రోబ్లాక్స్‌లో వర్చువల్ ప్రపంచాన్ని సృష్టించి వేతనం పొందేవాడు. అలాంటి ఈ వ్యక్తి ఈ వెర్రీ ఆలోచనతో మే 30, 2019న ఆ రెండు దేశాల మధ్య ఉండే వెర్రిస్ అనే ఈ వివాదాస్పద భూమిని స్వతంత్ర రిపబ్లిక్ దేశంగా ప్రకటించాడు. డానుబే నది ఒడ్డున దాదాపు 125 ఏకరాల్లో ఈ దేశం ఉంది. ఈ దేశానికి స్వంత జెండా, కేబినేట్, స్వంత కరెన్సీతో సహా సుమారు 400 మంది రిజిస్టర్ పౌరులు కూడా ఉండటం విశేషం. ఈ చిన్న దేశాన్ని స్థానికంగా 'పాకెట్ త్రీ' అని కూడా పిలుస్తారు.






ఊహకందని విధంగా నిర్బంధం, బహిష్కరణ..

హాయిగా అధ్యక్షుడి సాగిపోతున్న డేనియల్‌కి అక్టోబర్ 2023లో క్రొయేషియా దేశం నుంచి ఊహించని షాక్ తగిలింది. ఆ చిన్న దేశంలోని ఉంటున్న కొందరు స్థిరనివాసులను, ఆ దేశ అధ్యక్షుడిగా చెప్పుకునే డేనియల్‌ని క్రోయేషియా పోలీసులు అదుపులోకి తీసుకుని అరెస్టు చేశారు. ఆ తర్వాత అతడిని దేశం నుంచి బహిష్కరించారు. ఇంత జరిగినా డేనియల్ తన చిన్న దేశాన్ని రిమోట్‌గా నడుపుతూనే ఉన్నాడు. క్రొయేషియా తనను జాతీయ భద్రతకు ముప్పు అని చెప్పి.. బహిష్కరించారని చెబుతున్నాడు డేనియల్. అంతేగాదు తాను ఏదోలా క్రోయేషియా దేశంతో శాంతియుతంగా ఒప్పందం చేసుకుని..ఈ చిన్న దేశాన్ని అధికారికంగా ప్రకటించేలా చేస్తానని నమ్మకంగా చెబుతున్నాడు. ఆ చర్చలు సఫలమై తన దేశం అధికారికంగా ప్రకటించబడిన వెంటనే తాను అధికారం నుంచి తప్పుకుంటానని కూడా అంటున్నాడు. తానొక సాధారణ పౌరుడిగానే ఉంటానని చెబుతున్నాడు. అదీగాక ఇది తాను సృష్టించిన దేశమే కాబట్టి దీన్ని చూసి గర్విస్తుంటానని, తనకు అదే చాలని గొప్పగా చెబుతున్నాడు డేనియల్.

ఈ చిన్న దేశంలో పౌరసత్వం కోసం..

ఇక డేనియల్ సృష్టించిన ఈ దేశానికి పౌరుడిగా మారాలంటే..వైద్యం లేదా పోలీసింగ్ అనుభవం వంటి నైపుణ్యాలు ఉంటే చాలట. దెబ్బకు సులభంగా ఆ దేశ పౌరసత్వం లభించేస్తుందట. అలాగే తమ దేశానికి చేరుకోవడానికి ఏకైక మార్గం క్రొయేషియా నగరం ఒసిజెక్ నుంచి పడవ మార్గం ద్వారా చేరుకోవాలట.

## ఇకపై ఒక్కరోజులోనే వీసా జారీ



న్యూఢిల్లీ

వీసా జారీ చేయడానికి ప్రస్తుతం కొన్ని వారాల సమయం పడుతోంది. ఇకపై అన్ని పత్రాలు సమర్పిస్తే ఒక్క రోజులోనే వీసాను పొందేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనల్లో వెసులుబాటు తీసుకొచ్చింది. అక్రమ వలసదారులు, గడువుతీరినా దేశంలోనే ఉండే విదేశీయులపై పర్యవేక్షణను మరింత బలోపేతం చేసేందుకు డిస్ట్రిక్ట్ పోలీస్ మాడ్యూల్ (డీపీఎం), ఫారినర్స్ ఐడెంటిఫికేషన్ పోర్టల్ (ఎఫ్ఐపీ) అనే రెండు కొత్త పోర్టల్స్‌ను ప్రారంభించింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ బుధవారం ఢిల్లీలోని నార్త్ బ్లాక్‌లో విదేశీ విభాగ ఉన్నతాధికారులతో సమీక్షించారు. ఈ సమావేశంలో వీసా విధానాల సరళతరం, ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టుల ఆధునీకరణ వంటి అంశాలపై చర్చించారు. 2024లో జారీ చేసిన మొత్తం వీసాలలో ఈ–వీసాల వాటా 65.15 శాతం. వీసా విధానాల సులభతరం వల్ల వీసా జారీ సగటు సమయం కొన్ని వారాల నుంచి ఒక రోజులోపు తగ్గినట్టు కేంద్రమంత్రికి అ్యధికారులు తెలిపారు. అధికారుల పనితీరును అభినందించిన బండి సంజయ్.. వీసా, ఇమ్మిగ్రేషన్ విషయంలో ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకోవాలని సూచించారు. కేంద్రం తీసుకున్న నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్ర స్థాయిలో సాధారణ ప్రజలకు చేరవేయాలని ఆదేశించారు. ఇమ్మిగ్రేషన్ చెక్‌పోస్టు (ఐసీపీ)ల ఆధునీకరణలో భాగంగా ఆటోమేటెడ్ ట్రావెల్ డాక్యుమెంట్ స్కానింగ్, బయోమెట్రిక్ నమోదు సదుపాయాలను కల్పించినట్టు అధికారులు పేర్కొన్నారు. ఢిల్లీ, ముంబై, చెన్నై, కోల్‌కతా, బెంగళూరు, హైదరాబాద్, కొచ్చి, అహ్మదాబాద్‌లలో ఫాస్ట్%–%ట్రాక్ ఇమ్మిగ్రేషన్ ట్రస్టెడ్ ట్రావెలర్ ప్రోగ్రాం (ఎఫ్‌టీఐ%–%టీటీపీ) అమలు చేస్తున్నట్టు అధికారులు చెప్పారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్

దుమ్ముగూడెం

చత్తీసగఢ్ రాష్ట్రం మోహ్లా–మన్పూర్–అంబర్గ్ చౌక్ జిల్లా మదన్‌వాడ పోలీసస్టేషన్ పరిధిలోని అటవీప్రాంతంలో బుధవారం పోలీసులు, మావోయిస్టుల మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు మావోయిస్టు అగ్రనేతలు మృతిచెందారు. వీరిని విజయ్‌రెడ్డి, లోకేష్ సలామిలుగా గుర్తించారు. వీరివురిపై రూ.35లక్షల రివార్డు ఉంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన విజయ్‌రెడ్డి స్పెషల్ జోనల్ కమిటీ సభ్యుడు కాగా, సలామి.. డివిజన్ కమిటీ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం మేరకు బందాపహాడ్ కొండను నలువైపులా పోలీసు బలగాలు చుట్టుముట్టాయి. జోరు వర్షం పడుతుండగానే ఇరు వర్గాల మధ్య కాల్పులు జరిగాయి. ఈ విషయాన్ని మోహ్లా–మన్పూర్–అంబర్గ్ చౌక్ ఎస్పీ వైపీ సింగ్ ధ్రువీకరించారు.

## వారి నుంచి నాకు ముప్పు ఉండొచ్చు

ఇంటర్నెట్ డెస్క్

వి.డి.సావర్కర్‌ను ఉద్దేశిస్తూ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై పరువునష్టం కేసు నమోదైన విషయం తెలిసిందే. అయితే.. సావర్కర్, గాడ్సే భావజాలాన్ని అనుసరిస్తున్న వారి నుంచి తనకు ముప్పు పొంచి ఉండొచ్చని రాహుల్ పుణె కోర్టుకు తెలిపారు. ఈ నేపథ్యంలో తనకు అవసరమైన భద్రత అందించడం కేంద్రం బాధ్యత అని పేర్కొన్నారు. 2023లో లండన్ పర్యటన సమయంలో సావర్కర్‌ను ఉద్దేశిస్తూ రాహుల్ గాంధీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఈ క్రమంలో సావర్కర్ మునిమనవడు సాత్యకి సావర్కర్ ఆయనపై పరువునష్టం దావా దాఖలు చేశారు. ఈ కేసుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నట్లు పోలీసులు గతంలో తేల్చారు. దీనిపై పుణెలోని ప్రజాప్రతినిధుల కోర్టులో విచారణ ఇంకా ప్రారంభం కావాల్సి ఉంది. ఈ క్రమంలోనే రాహుల్ గాంధీ తరఫు న్యాయవాది కోర్టుకు తాజాగా ఓ అప్లికేషన్ సమర్పించారు. "తనకు నాథూరాం గాడ్సే, సావర్కర్ కుటుంబాలతో సంబంధం ఉందని సాత్యకి గతంలో వెల్లడించారు. ఈ నేపథ్యంలో ఆయన గత చరిత్రను దృష్టిలో పెట్టుకుని, ప్రస్తుత రాజకీయ వాతావరణాన్ని పరిగణనలోకి తీసుకుంటే.. సావర్కర్, గాడ్సే భావజాలానికి మద్దతు ఇచ్చే వ్యక్తుల నుంచి రాహుల్ గాంధీకి ముప్పు పొంచి ఉండే అవకాశాలను కొట్టిపారేయలేం. ఇటువంటి పరిస్థితుల్లో ఆయనకు రక్షణ కల్పించడం రాజ్యాంగబద్ధమైన బాధ్యత" అని అందులో పేర్కొన్నారు. విచారణను ఆలస్యం చేయాలనే ఉద్దేశంతోనే రాహుల్ గాంధీ ఈ అప్లికేషన్‌ను దాఖలు చేశారని సాత్యకి సావర్కర్ ఆరోపించారు. అందులో పేర్కొన్న వాస్తవాలకు, ప్రస్తుత కేసుతో ఎటువంటి సంబంధం లేదని మీడియాతో అన్నారు. ఇదిలా ఉండగా.. ఈ కేసులో రాహుల్ గాంధీకి కోర్టు ఇప్పటికే బెయిల్ మంజూరు చేసింది.

## 20 నుంచి ఐసెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్



ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఐసెట్ కౌన్సెలింగ్ ప్రణాళికను తెలంగాణ ఉన్నత విద్యామండలి ప్రకటించింది. ఈనెల 20 నుంచి మొదటి విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుండగా, సెప్టెంబరు 2న జాబితా ప్రకటిస్తారు. అలాగే రెండో విడత కౌన్సెలింగ్ సెప్టెంబరు 8న ప్రారంభం కానుంది. అదేనెల 15న స్పాట్ అడ్మిషన్ నిర్వహిస్తామని ఉన్నత విద్యామండలి అధ్యక్షుడు ఆచార్య బాలకిష్టారెడ్డి తెలిపారు.

**20 నుంచి గ్రూప్-2 ధ్రువపత్రాల పరిశీలన**

గ్రూప్–2 రెండో విడత ధ్రువపత్రాల పరిశీలన తేదీలను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ బుధవారం విడుదల చేసింది. ఈనెల 20 నుంచి 23 వరకు తెలుగు విశ్వవిద్యాలయంలో పరిశీలన ఉంటుందని టీజీపీఎస్సీ కార్యదర్శి ప్రియాంక ఆలా తెలిపారు. ధ్రువపత్రాల పరిశీలనకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారిక వెబ్‌సైట్లో పెట్టామన్నారు. అలాగే, అభ్యర్థులు వెబ్ ఆప్షన్లను ఈనెల 18 నుంచి 25 వరకు అధికారిక వెబ్‌సైట్ ద్వారా ఇవ్వాలని ఆమె బుధవారం ఒక ప్రకటనలో కోరారు.

# రోజుకొక్కటి తీసుకుంటే డాక్టర్‌తో పనే ఉండదిక!



అత్యధికంగా ప్రోటీన్లు అందించే అవకాడో పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. బటర్ ఫ్రూట్‌గా పిలిచే ఇందులో ఔషధగుణాలు మెండుగా ఉన్నాయి. పోషకాలు పుష్కలంగా ఉండే ఈ అవకాడో మహిళల ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. ఆరోగ్యానికి పండ్లు ఎంతో మేలు చేస్తాయి. అందుకే వైద్యులు నిత్యం వీటిని తీసుకోవాలని సూచిస్తుంటారు. అత్యధికంగా ప్రోటీన్లు అందించే అవకాడో పండు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది.. బట్టర్ ఫ్రూట్‌గా పిలిచే ఇందులో ఔషధగుణాలు మెండుగా ఉన్నాయి. పోషకాలు పుష్కలంగా ఉండే ఈ అవకాడో మహిళల ఆరోగ్యానికి అనేక విధాలుగా మేలు చేస్తుంది. అవకాడోలు హార్మోన్ల సమతుల్యతను కాపాడుకోవడానికి చాలా అవసరం. ఇది పీరియడ్స్‌ను క్రమబద్ధీకరించడంలో సహాయపడుతుంది. చర్మానికి మేలు చేస్తుందిజ అవకాడోలో విటమిన్ ఇ, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి చర్మాన్ని మృదువుగా, ప్రకాశవంతంగా, ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఒంట్లో హార్మోన్ల సమతుల్యతను కాపాడుతుంది. అవకాడోలో ఆరోగ్యకరమైన కొవ్వులు (మోనోఅన్‌శాచురేటెడ్ కొవ్వులు) అధికంగా ఉంటాయి. ఇవి మహిళల హార్మోన్ల అసమతుల్యతను క్రమబద్ధం చేయడంలో ఉపయోగపడతాయి. గర్భధారణకూ మంచిదే. అవకాడోలో ఫోలిక్ యాసిడ్ అధికంగా ఉండటం వల్ల గర్భధారణకు ముందు, గర్భధారణ సమయంలో చాలా ఉపయోగకరంగా ఉంటుంది. ఇది పిండం అభివృద్ధికి సహాయపడుతుంది. గుండెకు కూడా మేలు చేస్తుంది. ఇది కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయపడుతుంది. గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. ఎముకలను బలంగా ఉంచుతుంది. అవకాడోలో ఎముకల బలానికి అవసరమైన విటమిన్ కె, కాల్షియం, భాస్వరం ఉంటాయి. ఫైబర్ అధికంగా ఉండటం వల్ల ఇది జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. మలబద్ధకం నుంచి ఉపశమనం కలిగిస్తుంది.

# నెల పాటు టీ తాగడం మానేస్తే.. నమ్మలేని ఎన్నో అద్భుతాలు..!



దయం నిద్ర లేచింది మొదలు చాలా మంది తమ రోజును 'టీ'తోనే ప్రారంభిస్తారు. ఘుమఘుమలాడే టీ చుక్కలు గొంతులు తడిపితే రోజంతా హుషారు పుంతలు తొక్కుతుంది. ఇక కొందరైతే పడుకునే ముందు కూడా 'టీ' తాగుతారు. మన తెలుగు వారికి టీతో చాలా ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. ముఖ్యంగా ఉదయం నిద్ర లేచింది మొదలు చాలా మంది తమ రోజును 'టీ'తోనే ప్రారంభిస్తారు. ఘుమఘుమలాడే టీ చుక్కలు గొంతులు తడిపితే రోజంతా హుషారు పుంతలు తొక్కుతుంది. ఇక కొందరైతే పడుకునే ముందు కూడా 'టీ' తాగుతారు. అయితే టీ ఇలా వేళాపాలా లేకుండా తాగడం పట్ల ఆరోగ్యానికి ఎన్నోరకాలు హానికరమని నిపుణులు అంటున్నారు. అదే 30 రోజులపాటు టీ తాగకపోతే మన శరీరంలో జరిగే మార్పులు అన్నీ ఇన్నీ కావు. ముఖ్యంగా బరువు తగ్గడంలో సహాయపడుతుంది. అవును.. ఓ నెల పాటు టీ తాగకపోతే బరువు వేగంగా తగ్గవచ్చట. ఇందులో కేలరీలు, చక్కెర అధికంగా ఉంటాయి. ఇవి బరువు పెరగడానికి దారి తీస్తాయి. అటువంటి పరిస్థితిలో టీ తాగకపోవడం వల్ల కేలరీల తీసుకోవడం తగ్గుతుంది. ఇది బరువు తగ్గడానికి సహాయపడుతుంది. పాలతో చేసిన టీ తాగకపోవడం వల్ల జీర్ణక్రియ మెరుగుపడుతుంది. మిల్క్ టీలో ఉండే కెఫిన్, టానిన్లు జీర్ణ ప్రక్రియను నెమ్మదించేలా చేస్తాయి. ఇది అసిడిటీ సమస్యలను కలిగిస్తుంది. అదే టీ తాగడం మానేస్తే, జీర్ణక్రియ మెరుగుపడి అసిడిటీ సమస్య తొలగిపోతుంది. టీలో ఉండే కెఫిన్ నిద్రకు అంతరాయం కలిగిస్తుంది. టీ తీసుకోవడం తగ్గించడం వల్ల బాగా నిద్రపడుతుంది. అది రోజంతా మిమ్మల్ని ఉత్సాహంగా ఉంచుతుంది. టీలోని చక్కెర చర్మాన్ని దెబ్బతీస్తుంది. ఇది మొటిమలకు కూడా కారణమవుతుంది. టీ తీసుకోవడం తగ్గిస్తే చర్మం ఆరోగ్యంగా, ప్రకాశవంతంగా మారుతుంది. టీ తీసుకున్న వెంటనే ఒంట్లో శక్తి స్థాయిలను పెంచుతుంది. కానీ తరువాత మీరు అలసిపోయినట్లు అనిపిస్తుంది. కాబట్టి మీరు టీ తాగడం మానేస్తే ఒంట్లో శక్తి స్థాయిలు రోజంతా స్థిరంగా ఉంటాయి. గుండె ఆరోగ్యాన్ని కూడా మెరుగుపడుతుంది. టీ గుండె జబ్బుల ప్రమాదాన్ని పెంచుతుంది. కాబట్టి, ఓ నెల పాటు టీ తాగకపోతే గుండె ఆరోగ్యం మెరుగుపడుతుంది.

# వీరికి కొబ్బరి నీళ్లు విషంతో సమానం..



కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి ఎంతో మంచిది. అందుకే వీటిని అన్ని వయసుల వారు తాగుతుంటారు. అయితే కొబ్బరి నీళ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వ్యాయామం చేసిన తర్వాత తక్షణ శక్తి కోసం వీటిని తాగొచ్చు. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. కొబ్బరి నీరు ప్రకృతి అందించిన అమృతం. కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి ఎంతో మంచిది. అందుకే వీటిని అన్ని వయసుల వారు తాగుతుంటారు. అయితే కొబ్బరి నీళ్లలో కేలరీలు తక్కువగా ఉంటాయి. ఎలక్ట్రోలైట్లు పుష్కలంగా ఉంటాయి. కాబట్టి వ్యాయామం చేసిన తర్వాత తక్షణ శక్తి కోసం వీటిని తాగొచ్చు. ఇది శరీరాన్ని హైడ్రేటెడ్‌గా ఉంచుతుంది. అంతే కాదు చర్మ కాంతిని పెంచడం నుంచి జీర్ణక్రియ వరకు, ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలు అందిస్తుంది. కానీ అమృతం లక్షణాలతో కూడిన ఈ పానీయం కొందరికి మాత్రం విషంతో సమానం. అంటే ఈ సహజ పానీయం కొంతమంది ఆరోగ్యాన్ని మరింత దిగజార్చి ప్రాణాంతకంగా మారుతుంది. కొబ్బరి నీళ్లలో సహజ చక్కెర ఉంటుంది. కాబట్టి డయాబెటిస్ ఉన్నవారు జాగ్రత్తగా ఉండాలి. ఒక చిన్న గ్లాసు (అంటే 200 మి.లీ)లో దాదాపు 6 నుంచి 7 గ్రాముల చక్కెర ఉంటుంది. ఇది పండ్ల రసాల కంటే తక్కువ. కానీ ఇది రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. అందుకే డయాబెటిస్ లేదా ఇన్సులిన్ నిరోధకత ఉన్నవారు తక్కువ పరిమాణంలో మాత్రమే కొబ్బరి నీళ్లు తాగాలి. లేదంటే రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతుంది. ముఖ్యంగా కొన్ని కొబ్బరి నీళ్లలో చక్కెర కలిపి తాగారో.. పరిస్థితిని మరింత దిగజార్చుతుంది. కాబట్టి డయాబెటిస్ ఉంటే కొబ్బరి నీళ్ళు తాగే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

**అలెర్జీలు:** అలెర్జీలు ఉంటే మరింత జాగ్రత్తగా ఉండాలి. కొబ్బరి నీళ్లకు అలెర్జీలు చాలా అరుదుగా ఉన్నప్పటికీ, తగినంత జాగ్రత్తగా ఉండాలి. కొంతమందికి కొబ్బరి నీళ్ళు తాగిన వెంటనే చర్మంపై దురద, వాపు, ఎరుపు రంగులోకి మారడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొన్ని సందర్భాల్లో ఇది శ్వాస తీసుకోవడంలో కూడా సమస్యలను కలిగిస్తుంది. పిల్లలకు కొబ్బరి నీళ్ల అలెర్జీలు వచ్చే అవకాశం మరింత ఎక్కువగా ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. కొబ్బరి నీళ్ళు తాగిన తర్వాత మీకు ఏవైనా అసాధారణ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్య సహాయం తీసుకోవాలి.

**మూత్రపిండాల సమస్యలు:** మూత్రపిండాల సమస్యలు ఉన్నవారికి కొబ్బరి నీరు మంచిది కాదు. కొబ్బరి నీళ్లలో పొటాషియం ఉంటుంది. ఇది ఆరోగ్యవంతులకు మంచిదే అయినప్పటికీ, మూత్రపిండాల సమస్యలు ఉన్నవారికి ఇది ప్రమాదకరం. దెబ్బతిన్న మూత్రపిండాలు అదనపు పొటాషియంను ఫిల్టర్ చేయడానికి అధికంగా కష్టపడతాయి. ఇది రక్తంలో పేరుకుపోతుంది. ఇది హైపర్‌కలేమియాకు కూడా దారితీస్తుంది. కండరాలు, గుండెను ప్రభావితం చేసే పరిస్థితి కూడా తలెత్తుతుంది. బలహీనత, వికారం తీవ్రమైన సందర్భాల్లో క్రమరహిత హృదయ స్పందన లక్షణాలు కనిపిస్తాయి. కాబట్టి మూత్రపిండాల సమస్యలు ఉన్నవారు కొబ్బరి నీళ్లు తాగే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది.

**జలుబు, ఫ్లూ ఉన్నవారికి తగదు:** జలుబు, ఫ్లూ ఉన్నప్పుడు కొబ్బరి నీళ్లు తాగడం అంత మంచిది కాదు. ఎందుకంటే ఇది శరీరాన్ని త్వరగా చల్లబరుస్తుంది. కాబట్టి వేసవి రోజుల్లో తాగడానికి బాగున్నప్పటికీ జలుబు, దగ్గుతో బాధపడేవారికి ఇది మంచిది కాదు. దీని చల్లబరిచే స్వభావం శ్లేష్మం మొత్తాన్ని పెంచడమే కాకుండా శరీరానికి వెచ్చదనం అవసరమైనప్పుడు శరీరాన్ని చల్లబరుస్తుంది. కాబట్టి అనారోగ్యంతో, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు కొబ్బరి నీళ్లకు బదులుగా అల్లం టీ లేదా వేడి సూప్‌లు తాగడం మంచిది.

**అధిక రక్తపోటు ఉన్నవారికీ డేంజర్:** అధిక రక్తపోటు ఉంటే జాగ్రత్తగా ఉండాలి. కొబ్బరి నీళ్ళలోని పొటాషియం కంటెంట్ కారణంగా రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుందని చెబుతారు. అయితే రక్తపోటు మందులు ముఖ్యంగా ఎసిఇ ఇన్హిబిటర్లు లేదా పొటాషియం-స్పేరింగ్ డైయూరిటిక్స్ తీసుకునే వారికి కొబ్బరి నీళ్ళు ప్రమాదకరం. ఈ మందులు పొటాషియం స్థాయిలను పెంచుతాయి. కొబ్బరి నీళ్ళు వాటిని మరింత పెంచుతాయి. ఇది ఛాతీ నొప్పి, కండరాల తిమ్మిరి, క్రమరహిత హృదయ స్పందనకు కారణమవుతుంది.

# ఆలూ చిప్స్ రోజూ లాగిస్తున్నారా?



చాలా మందికి నూనెలో వేయించిన పొటాటో చిప్స్ తినడం చాలా ఇష్టం. అయితే వీటిని రోజూ తినడం వల్ల ఆరోగ్యంపై ఎలాంటి ప్రభావాలు ఉంటాయి? అలాగే నెలలో ఎన్నిసార్లు ఆలూ చిప్స్ తినవచ్చు? అసలు రోజూ తింటే ఏమవుతుంది? నూనెలో వేయించిన ఆలూ చిప్స్, చైనీస్ ఫ్రైస్ వంటి వేయించిన ఆహారాలు ఇష్టపడని వారుండరు. ఇవి రుచికి భలేగా ఉంటాయి. సినిమాలు, వెబ్ సిరీస్ చూసేటప్పుడు లేదంటే ఆఫీసులో పనిచేసేటప్పుడు కొందరు స్నాక్‌గా వీటిని తింటుంటారు. కానీ ప్రతిరోజూ ఆలూ చిప్స్ తినడం నిజంగా ఆరోగ్యానికి మంచిదేనా? ఆలూ చిప్స్ తినడం వల్ల శరీరంపై ఎలాంటి ప్రభావాలు ఉంటాయి? ప్రతిరోజూ ఆలూ చిప్స్ తినడం వల్ల అది శరీరానికి 'స్లో పాయిజన్' లాగా పనిచేస్తుంది. కాబట్టి మీరు ప్రతిరోజూ ఆలూ చిప్స్ తినే అలవాటు ఉంటే ఇప్పుడే ఆపండం మంచిది. ఎందుకంటే ఇది మీ ఆరోగ్యానికి చాలా ప్రమాదకరం. ఆలూ చిప్స్‌లో ఉప్పు, అదనపు కొవ్వులు, శుద్ధి చేసిన కార్బోహైడ్రేట్లు అధికంగా ఉంటాయి. ఇవి అనేక ఆరోగ్య సమస్యలను ఆహ్వానిస్తాయి. ఆలూ చిప్స్‌లో కేలరీలు ఎక్కువగా ఉంటాయి. నాణ్యమైన కొవ్వులు తక్కువగా ఉంటాయి. ఈ ఆహారాలు సులభంగా జీర్ణం కావు. దీనివల్ల శరీరంలో కొవ్వు పేరుకుపోతుంది. ఫలితంగా బరువు పెరుగుతుంది. ఇది బరువును కూడా పెంచుతుంది. ఆలూ చిప్స్ వేయించడానికి ఉపయోగించే నూనెలో ట్రాన్స్ ఫ్యాట్స్ ఉంటాయి. ఇవి గుండెకు చాలా హానికరం. ఈ కొవ్వులు రక్త నాళాలలో అడ్డంకులను కలిగిస్తాయి. ఇది గుండెపై ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది భవిష్యత్తులో గుండె జబ్బుల అవకాశాలను పెంచుతుంది. ఆలూ చిప్స్‌లో అధిక ఉప్పు శాతం వల్ల రక్తపోటును పెంచుతుంది. ఇది గుండె, మూత్రపిండాలపై అదనపు ఒత్తిడిని కలిగిస్తుంది. ఇది అవయవాల పనితీరును కూడా ప్రభావితం చేస్తుంది. ఆలూ చిప్స్‌లో ఎటువంటి పోషకాలు ఉండవు. ఇవి రుచిగా ఉన్నప్పటికీ ఇందులో కేలరీలు, ఉప్పు, కొవ్వులు మాత్రమే ఉంటాయి. కాబట్టి, శరీరానికి అవసరమైన విటమిన్లు, ప్రోటీన్లు, ఫైబర్ లభించదు. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం ఆలూ చిప్స్ ప్రాసెస్ చేయబడిన ఆహారం కాబట్టి, వాటిని అరుదుగా మాత్రమే తినాలి. నెలలో ఎన్నిసార్లు ఆలూ చిప్స్ తినాలో నిర్దిష్ట సంఖ్య లేదు. కానీ ప్రతిరోజూ ఆలూ చిప్స్ తినడం ఆరోగ్యానికి ఏమాత్రం మంచిది కాదు. మీరు ఆలూ చిప్స్ తినాలనుకుంటే, నెలకు ఒకటి లేదా రెండుసార్లు తినడం మంచిది. కానీ వాటిని తినేటప్పుడు వీలైనంత తక్కువ పరిమాణంలో మాత్రమే తీసుకోవాలి. మొత్తం ప్యాకెట్‌ను ఒకేసారి తినడానికి బదులుగా, తక్కువ మొత్తంలో తినడం వల్ల ఆరోగ్యానికి పెద్దగా హాని జరగదు. మంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆలూ చిప్స్ బదులుగా ఇతర ఆరోగ్యకరమైన ఆహారాలను తీసుకోవడం అవసరం. అంటే యాపిల్, అరటిపండ్లు, నారింజ, బాదం, వాల్‌నట్స్, శనగలు, వేయించిన మఖానా తినవచ్చు. ఈ ఆహారాలు రుచిగా ఉండటం మాత్రమే కాదు, ఆరోగ్యానికి కూడా మంచివి. వీటిని తింటే త్వరగా కడుపు నిండిన భావన కలుగుతుంది. శరీరానికి అవసరమైన పోషకాలు అందుతాయి. అలాగే ఆరోగ్యకరమైన జీవనశైలిని పాటించాలి.

# ఆరోగ్యానికి అమృతం ఈ పండు!

కివి పండు.. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి సహాయపడుతుంది. విటమిన్ సి శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది. ఇది ఇన్ఫెక్షన్లు, వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. కివిలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణవ్యవస్థకు కూడా చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. కివిలో ఉండే ఆక్టినిడిన్ ఎంజైమ్ ప్రోటీన్లను జీర్ణం చేయడంలో సహాయపడుతుంది. ఇది కడుపు సమస్యలను తగ్గిస్తుంది. కివీలో పొటాషియం, ఫైబర్ పుష్కలంగా ఉంటాయి. ఇవి గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. పొటాషియం రక్తపోటును నియంత్రించడంలో సహాయపడుతుంది. ఇది గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అంతేకాకుండా కివీస్ లోని యాంటీఆక్సిడెంట్లు కొలెస్ట్రాల్ స్థాయిలను తగ్గించడంలో కూడా సహాయపడతాయి. కివిలో విటమిన్ సి, విటమిన్ ఇ వంటి యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉంటాయి. ఇవి చర్మానికి చాలా ప్రయోజనకరంగా ఉంటాయి. ఈ పదార్థాలు చర్మాన్ని మెరుగుపరచడంలో, ముడతలను తగ్గించడంలో, చర్మం స్థితిస్థాపకతను కాపాడుకోవడంలో సహాయపడతాయి. కివి తినడం వల్ల వృద్ధాప్య సంకేతాలు తగ్గుతాయి. కివిలో సెరోటోనిన్ ఉంటుంది. ఇది నిద్ర నాణ్యతను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ప్రతిరోజూ పడుకునే ముందు కివి తినడం వల్ల మంచి నిద్ర వస్తుందట. నిద్రలేమి సమస్య ఉన్నవారు రోజుకో కివి తింటే కమ్మని నిద్ర వస్తుంది. కివిలో లుటీన్, జియాక్సంతిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి కళ్ళకు మేలు చేస్తాయి. ఈ పదార్థాలు కంటిశుక్లం, వయస్సు సంబంధిత కంటి సమస్యల నుంచి కళ్ళను రక్షించడంలో సహాయపడతాయి.



బిజినెస్ వాయిస్

# 'గూగుల్ పిక్సెల్ 8ఎ'పై భారీ ఆఫర్

## బీమాను అందరికీ చేర్చడమే లక్ష్యం




దేశంలో ప్రతీ ఒక్కరికీ జీవిత బీమాను చేర్చాలని నిర్దేశించుకున్నామని ప్రభుత్వ రంగంలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఎండీ, సీఈఓ ఆర్ దొరైస్వామి తెలిపారు. 2047 నాటికి అందరికీ బీమా లక్ష్యంగా పెట్టుకున్నామని మంగళ వారం ఓ ఆంగ్ల మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో దొరైస్వామి తెలిపారు. సెప్టెంబర్‌తో ముగియనున్న రెండో త్రైమాసికంలో పాలసీల విక్రయాల్లో మరింత వృద్ధి నమోదు కానుందన్నారు. ప్రస్తుత 2025-26 ఆర్థిక సంవత్సరం ప్రీమియంలో రెండంకెల వృద్ధిని సాధించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టడం, నాన్-పార్టిసిపేటింగ్ ఉత్పత్తులపై దృష్టి సారించడం ద్వారా ఈ లక్ష్యాన్ని సాధించనున్నామని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. 2025 మార్చితో ముగిసిన ఆర్థిక సంవత్సరంలో ఎల్ఐసి పాలసీ అమ్మకాల ప్రీమియం 9.45 శాతం వద్ధితో రూ.54,238 కోట్లకు చేరింది. ఇది 2024-25లో రూ.49,543 కోట్లుగా ఉంది. 2026 జూన్‌తో ముగిసిన మొదటి త్రైమాసికంలో కొత్త బిజినెస్ ప్రీమియం (ఎన్‌సీపీ)19.78 శాతం పెరిగి రూ.11,337 కోట్లకు చేరింది. 2026 మార్చి నాటికి ఐదారు కొత్త ఉత్పత్తులను ప్రవేశపెట్టాలని ఎల్ఐసీ లక్ష్యంగా పెట్టుకుంది. అదే విధంగా కృత్రిమ మేధా (ఏఐ)ను పాలసీ సేవలు, క్లెయిమ్ ప్రాసెసింగ్‌లో ఉపయోగించుకోవాలని ఎల్ఐసి యోచిస్తోంది. గడిచిన జూన్ త్రైమాసికం లో ఎల్ఐసీ నికర లాభాలు 9.61 శాతం పెరిగి రూ.10,461 కోట్లుగా చోటు చేసుకుంది. మొత్తం ప్రీమియం ఆదాయం 15.27 శాతం వృద్ధితో రూ.1.14 లక్షల కోట్లకు చేరింది.

## ఇండిగోకు డీజీసీఏ షోకాజ్ నోటీసులు




విమానాల్లో భద్రత, సిబ్బంది వ్యవహారాలపై కఠినంగా వ్యవహరిస్తున్న డైరెక్టరైట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్(డీజీసీఏ) అందులో భాగంగా ఇండిగోకు తాజా షోకాజ్ నోటీసులు జారీ చేసింది. దాదాపు 1,700 మంది పైలట్లకు నిర్వహించిన సిమ్యులేటర్ శిక్షణలో లోపాలున్నాయని ఆరోపిస్తూ ఏవియేషన్ రెగ్యులేటర్ ఇండిగోకు ఈ నోటీసులు ఇచ్చింది. గత నెలలో ఎయిర్‌లైన్ సంస్థ నుంచి వచ్చిన రికార్డులు, నివేదికలను పరిశీలించిన తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంగళవారం డీజీసీఏ అధికారులు తెలిపారు. దీనికి సంబంధించి ఇండిగో నుంచి ఎలాంటి ప్రకటన వెలువడలేదు. కమాండ్, ఫస్ట్ ఆఫీసర్ పైలట్‌లతో సహా దాదాపు 1,700 మంది పైలట్‌లకు కేటగిరీ సీ లేదా క్రిటికల్ ఎయిర్‌ఫీల్డ్ శిక్షణ అర్హత లేని సిమ్యులేటర్లతో నిర్వహించారని డీజీసీఏ కనుగొంది. పైలట్‌లు శిక్షణ పొందిన కాలికట్, లేహ్, ఖాట్మండు వంటి కొన్ని విమానాశ్రయాలలోని సిమ్యులేటర్లు కార్యకలాపాలకు అర్హత లేనివని కూడా డీజీసీఏ గుర్తించింది. టేబుల్ టాప్ రన్‌వే ఉన్న కాలికట్ లాంటి కొన్ని విమానాశ్రయాలు విమాన కార్యకలాపాల నిర్వహణకు అదనపు అవసరాలు కావాల్సి ఉందని పేర్కొంది.

కొత్త స్మార్ట్‌ఫోన్ కొనుగోలు చేయాలనుకునే వారికి ఇది నిజంగా శుభవార్త. ప్రముఖ టెక్ కంపెనీ గూగుల్ నుంచి వచ్చిన తాజా మోడల్ పిక్సెల్ 8ఎ ఇప్పుడు ఆకర్షణీయమైన ధరకు లభిస్తోంది. ఫ్లిప్‌కార్ట్ ప్రకటించిన ఈ ఆఫర్‌తో, మార్కెట్లో అత్యుత్తమ ఫీచర్లతో ఉన్న ఈ స్మార్ట్‌ఫోన్‌ను ఊహించని తక్కువ ధరకే సొంతం చేసుకోవచ్చు. సాధారణంగా గూగుల్ పిక్సెల్ 8ఎ (128+దీ వేరియంట్) మార్కెట్లో ధర రూ. 52,999. అయితే, ఫ్లిప్‌కార్ట్ ప్రస్తుతం ఏకంగా రూ. 15,000 ఫ్లాట్ డిస్కౌంట్ అందిస్తోంది. దీంతో ఈ ఫోన్ ధర రూ. 37,999కు తగ్గింది.ఫ్లిప్‌కార్ట్ ఆఫర్‌కు తోడు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ క్రెడిట్ కార్డు ఈఎంఐ లావాదేవీల ద్వారా కొనుగోలు చేసే కస్టమర్లకు మరొక రూ. 7,000 తగ్గింపు లభిస్తుంది. ఈ రెండు ఆఫర్లను కలిపితే, పిక్సెల్ 8ఎ ధర కేవలం రూ. 30,999కు చేరింది. కొనుగోలుదారుల సౌలభ్యం కోసం ఫ్లిప్‌కార్ట్, ఎంపిక చేసిన బ్యాంక్ క్రెడిట్ కార్డులపై ఆరు నెలల నోకాస్ట్ జువీ× సదుపాయం అందిస్తోంది. దీని ద్వారా కస్టమర్లు వడ్డీ లేకుండా సులభంగా చెల్లింపులు చేయవచ్చు.మీ పాత స్మార్ట్‌ఫోన్‌ను ఎక్స్ఛేంజ్ చేయడం ద్వారా, గరిష్టంగా రూ. 33,000 వరకు అదనపు తగ్గింపు పొందవచ్చు. ఈ విలువ మీ పాత ఫోన్ బ్రాండ్, మోడల్, కండిషన్‌పై ఆధారపడి ఉంటుంది. పాత ఫోన్ మంచి కండిషన్‌లో ఉంటే, కొత్త పిక్సెల్ 8ఎను మరింత తక్కువ ధరకు సొంతం



చేసుకోవచ్చు.గూగుల్ పిక్సెల్ 8ఎ స్మార్ట్‌ఫోన్ అద్భుతమైన ఫీచర్లతో వినియోగదారులను ఆకట్టుకుంటోంది. ఈ ఫోన్‌లో 6.1 అంగుళాల ఫుల్ హెచ్‌డీ ప్లస్ డిస్‌ప్లే, 120 హెచ్‌జడ్ రిఫ్రెష్ రేట్, 2,000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉన్నాయి. డిస్‌ప్లే రక్షణ కోసం కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 3ని ఉపయోగించారు. గూగుల్ సొంత టెన్సర్ జీ3 చిప్‌సెట్‌తో పనిచేసే ఈ ఫోన్‌లో 8 జీబీ ర్యామ్, 128, 256 జీబీ స్టోరేజ్ ఆప్షన్లు ఉన్నాయి.గూగుల్ పిక్సెల్ ఫోన్లంటేనే కెమెరాలకు పెట్టింది పేరు. దీనికి తగ్గట్టుగానే, ఈ ఫోన్‌లో 64 మెగాపిక్సెల్ ప్రధాన కెమెరా, 13 మెగాపిక్సెల్ అల్ట్రావైడ్ లెన్స్‌తో కూడిన డ్యూయల్ రియర్ కెమెరా సెటప్ ఉంది.

## తగ్గుముఖం పట్టిన బంగారం ధరలు

గత మూడు రోజుల నుంచి బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. బంగారం బార్ల దిగుమతులపై అమెరికా సుంకాలు విధించబోతుందనే వార్తలతో బులియన్ మార్కెట్లో +శ్రీ౹ం ధరలు ఆ మధ్య ఒక్కసారిగా పెరిగాయి. అయితే ట్రంప్ ఎటువంటి సుంకాలు విధించడం లేదని చెప్పడంతో పసిడి ధరలు ఒక్కసారిగా పతనమయ్యాయి. +శ్రీ౹ం మీద సుంకాలు లేకపోవడంతో పెట్టుబడిదారులు బంగారం నుంచి తమ పెట్టుబడులను వెనక్కి తీసుకున్నారు. ఇతర ఆస్తుల వైపు వాటిని మళ్లించారు. ఈ నేపథ్యంలో బంగారం ధరలు తగ్గుముఖం పట్టాయి. ఈ రోజు 100 గ్రాముల +శ్రీ౹ం ధర రూ.100 తగ్గింది. భారత్-అమెరికా దేశాల మధ్య సుంకాల వార్ దెబ్బకి బంగారం ధరల్లో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. ఆగస్టు తొలి వారంలో 10 గ్రాముల ధర దాదాపు రూ. 6 వేలకు పైగానే పెరిగింది. తాజాగా పసిడి నేల చూపులు చూస్తోంది. వచ్చే పండుగ సీజన్ నేపథ్యంలో %+శ్రీ౹ం% ధరలు ఇంకా తగ్గే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. పరిశీలిస్తే..24 క్యారట్ల గ్రాము బంగారం రూపాయి తగ్గింది. ప్రస్తుతం గ్రాము బంగారం ధర రూ.10,139 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 22 క్యారట్ల గ్రాము బంగారం ధర 9,294 వద్ద ట్రేడ్ అవుతోంది. ఇక 18 క్యారట్ల గ్రాము బంగారం ధర రూ.7,604 వద్ద ట్రేడ్ అవుతోంది. 100 గ్రాముల 24 క్యారెట్ల బంగారం రూ.100 తగ్గి రూ. 10,13,900 వద్ద ట్రేడ్ అవుతోంది. అలాగే 22



క్యారట్ల బంగారం ధర 100 గ్రాములు రూ.100 తగ్గి రూ. 9,29,400 వద్ద ట్రేడ్ అవుతోంది. 18 క్యారట్ల బంగారం ధర రూ.100 తగ్గి 100 గ్రాములు రూ.7,60,400 వద్ద ట్రేడ్ అవుతోంది. విజయవాడ విషయానికి వస్తే..10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,390 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,940 పలుకుతోంది. ఇక 10 గ్రాముల 18 క్యారట్ల బంగారం ధర రూ.76,040 గా నమోదైంది. చెన్నైలో బంగారం ధరలను పరిశీలించినట్లయితే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,390 దగ్గర ట్రేడ్ అవుతోంది. ముంబైలో బంగారం ధరలను పరిశీలించినట్ల యితే 10 గ్రాముల 24 క్యారట్ల బంగారం ధర రూ.1,01,390 దగ్గర ట్రేడ్ అవుతోంది. అలాగే 10 గ్రాముల 22 క్యారట్ల బంగారం ధర రూ.92,940 పలుకుతోంది.

## 4 శాతం తగ్గిన ప్రత్యక్ష పన్ను వసూళ్లు

ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు నికర ప్రత్యక్ష పన్ను వసూళ్లు 3.95 శాతం తగ్గి రూ.6.64 లక్షల కోట్లకు చేరుకున్నాయని మంగళవారం విడుదల చేసిన ప్రభుత్వ గణాంకాలు వెల్లడించాయి.గత ఆర్థిక సంవత్సరం (2024-25) ఇదే కాలంలో సేకరించిన రూ.6.91 లక్షల కోట్ల వసూళ్లు జరిగాయి. అధిక రీఫండ్‌ల కారణంగానే వసూళ్లలో క్షీణత నమోదైందని ప్రభుత్వం తెలిపింది. మొత్తం వసూళ్లలో నికర కార్పొరేట్ పన్ను వసూళ్లు దాదాపు రూ.2.29 లక్షల కోట్లు కాగా, కార్పొరేట్ యేతర పన్ను వసూళ్లు రూ.4.12 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 11 మధ్య సెక్యూరిటీస్ లావాదేవీల పన్ను (ఎస్‌టీటీ) వసూళ్లు రూ.22,362 కోట్లు ఉన్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు జారీ చేసిన వాపసులు 10 శాతం పెరిగి రూ.1.35 లక్షల కోట్లకు చేరుకున్నాయి. సమీక్షించిన కాలంలో స్థూల వసూళ్లు (రీఫండ్‌లకు ముందు) రూ.7.99 లక్షల కోట్లుగా ఉన్నాయి. ఇది గత సంవత్సరం ఇదే కాలంలో వచ్చిన రూ.8.14 లక్షల కోట్ల కంటే 1.87 శాతం తగ్గింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి (2025-26) ప్రభుత్వం ప్రత్యక్ష పన్ను వసూళ్లు రూ.25.20 లక్షల కోట్లు వస్తాయని అంచనా వేసింది, ఈ మొత్తం క్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 12.7 శాతం ఎక్కువ.

# ఐపీఎల్-2025లో అట్టర్ ప్లాప్.. కట్ చేస్తే!
# టీమిండియా లెజెండ్‌పై వేటు?

ఐపీఎల్-2026 సీజన్‌కు ముందు లక్నో సూపర్ జెయింట్స్ సపోర్ట్ స్టాఫ్‌లో కీలక మార్పులు చోటు చేసుకోనున్నాయి. ఆ జట్టు మెంటార్, టీమిండియా పేస్ బౌలింగ్ దిగ్గజం జహీర్ ఖాన్‌పై వేటు వేసేందుకు లక్నో యాజమాన్యం సిద్ధమైనట్లు తెలుస్తోంది. గత ఐపీఎల్ సీజన్‌లో లక్నో దారుణ ప్రదర్శన కనబరిచింది. వరుసగా రెండో సీజన్‌లోనూ ప్లే ఆఫ్స్‌కు చేరడంలో లక్నో విఫలమైంది. 14 మ్యాచ్‌లలో కేవలం ఆరింట మాత్రమే విజయం సాధించిన సూపర్ జెయింట్స్.. పాయింట్ల పట్టికలో ఏడో స్థానంతో సరిపెట్టుకుంది. కాగా ఐపీఎల్-2024 సీజన్‌కు ముందు గౌతమ్ గంభీర్ కోల్‌కతా నైట్‌రైడర్స్ ఫ్రాంచైజీతో జత కట్టిన తర్వాత లక్నో కోచింగ్ స్టాఫ్‌లో జహీర్ చేరాడు. ఆ ఏడాది సీజన్‌ను లక్నో ఏడో స్థానంతో ముగించింది. జహీర్ మెంటార్‌గా ఉంటూనే లక్నో బౌలింగ్ కోచ్ బాధ్యతలు కూడా నిర్వర్తించాడు. అయితే జాక్ మెంటార్‌షిప్ పట్ల లక్నో మేనేజ్‌మెంట్ అసంతృప్తితో ఉన్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ క్రమంలో అతడికి వీడ్కోలు పలికి మరొకరిని నియమించాలని సూపర్ జెయింట్స్ ఫ్రాంచైజీ భావిస్తున్నట్లు పలు రిపోర్టులు పేర్కొంటున్నాయి. ఇప్పటికే లక్నో కొత్త బౌలింగ్ కోచ్ అరుణ్ భరత్ ఎంపికయ్యాడు.




త్వరలో కొత్త మెంటార్‌ను కూడా లక్నో నియమించనుంది. అంతేకాకుండా ఆర్‌పీఎస్‌జీ గ్రూపు ఆధ్వర్యంలో ఉన్న అన్ని జట్లను పర్యవేక్షించేందుకు కొత్త క్రికెట్ డైరెక్టర్‌ను కూడా నియమించేందుకు సంజీవ్ గోయెంకా సిద్ధమైనట్లు తెలుస్తోంది. మరోవైపు భారీ అంచనాలు పెట్టుకున్న లక్నో కెప్టెన్ రిషబ్ పంత్ సైతం రాణించలేకపోయాడు. ఒక సెంచరీ, హాఫ్ సెంచరీ మినహా మిగతా మ్యాచ్‌లలో పంత్ విఫలమయ్యాడు. కాగా పంత్‌ను రూ. 27 కోట్ల రికార్డు ధరకు లక్నో ఫ్రాంచైజ్ సొంతం చేసుకుంది.జ

క్రీడా వాయిస్

## 34 ఏళ్ల తర్వాత.. పాకిస్థాన్‌పై వన్డే సిరీస్ నెగ్గిన వెస్టిండీస్




ట్రినిడాడ్: పాకిస్థాన్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను వెస్టిండీస్ సొంతం చేసుకున్నది. మూడో వన్డేలో 202 రన్స్ భారీ తేడాతో విజయం నమోదు చేసింది. విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడన్ సీల్స్ ఆరు వికెట్లు తీసుకోగా, కెప్టెన్ షాయ్ హోప్ అజేయ సెంచరీతో ఆకట్టుకున్నాడు. దీంతో వన్డే సిరీస్‌ను 2-1 తేడాతో విండీస్ కైవసం చేసుకున్నది. 1991 తర్వాత అంటే.. 34 ఏళ్ల తర్వాత పాక్‌తో జరిగిన వన్డే సిరీస్‌ను విండీస్ గెలుచుకున్నది. మూడో వన్డేలో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్లు కోల్పోయి 294 రన్స్ చేసింది. విండీస్ జట్టులో కెప్టెన్ హోప్ 120 రన్స్ చేసి అజేయంగా నిలిచాడు. అతని ఇన్నింగ్స్‌లో 10 ఫోర్లు, ఐదు సిక్సర్లు ఉన్నాయి. విండీస్ బ్యాటర్లలో రోస్టన్ ఛేజ్ 36, జస్టిన్ గ్రీవ్స్ 43 రన్స్ చేశారు. పాక్ బౌలర్లలో నసీమ్ షా, అబ్రార్ అహ్మద్ రెండేసి వికెట్లు తీసుకున్నారు. 295 టార్గెట్‌తో బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు విండీస్ ఫాస్ట్ బౌలర్ జేడన్ సీల్స్ షాకిచ్చాడు. నిప్పులు చెరిగే వేగంతో అతను బంతులు విసిరాడు. దీంతో పాక్ బ్యాటర్లు తడబడ్డారు. కేవలం 92 పరుగులకే ఆ జట్టు ఆలౌటైంది. విండీస్ 42 ఓవర్లలో 184 రన్స్ చేసి ఆరు వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. అయితే ఆ సమయంలో హోప్, గ్రీవ్స్ భారీ పాట్నర్‌షిప్‌తో అలరించారు. ఆ ఇద్దరూ చివరి 8 ఓవర్లలో 110 రన్స్ చేశారు. వన్డేల్లో హోప్ 18వ సెంచరీ నమోదు చేశాడు. అత్యధిక వన్డే సెంచరీలు చేసిన మూడవ విండీస్ బ్యాటర్‌గా నిలిచాడతను. అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్లలో క్రిస్ గేల్ 25, బ్రియాన్ లారా 19 ఉన్నారు.

# 2030 కామన్వెల్త్ గేమ్స్ నిర్వహించేందుకు భారత్ బిడ్!

2030 కామన్వెల్త్ క్రీడలను నిర్వహించడానికి భారత ఒలింపిక్ సంఘం అధికారికంగా ఆమోదం తెలిపింది. 2030 కామన్వెల్త్ క్రీడలకు అహ్మదాబాద్ వేదికగా నిర్వహించేందుకు బిడ్‌ను సిద్ధం చేస్తుందగా.. బుధవారం జరిగిన ప్రత్యేక సర్వసభ్య సమావేశంలో ఏకగ్రీవంగా నిర్ణయం తీసుకున్నారు. వాస్తవానికి పోటీ నుంచి కెనడా తప్పుకోవడంతో భారత్‌కు అవకాశాలు పెరిగాయి. ఇప్పటికే ఆసక్తిని వ్యక్తం చేసిన భారత్.. బిడ్ పత్రాలను ఈ నెల 31లోగా అందజేయాల్సి ఉంది. మెగా ఈవెంట్‌కు అయ్యే ఖర్చులన్నింటినీ భారత ప్రభుత్వమే భరిస్తుందని ఐఓసీ స్పష్టం చేసింది. సమావేశం అనంతరం ఐఓసీ సంయుక్త కార్యదర్శి కల్యాణ్ చౌబే మాట్లాడుతూ కామన్వెల్త్ క్రీడలకు సంబంధించి జనరల్ హౌస్ ప్రతిపాదనలను ఏకగ్రీవంగా ఆమోదం తెలిపిందని చెప్పారు. సన్నాహకాలను వేగవంతం చేయనున్నట్లు పేర్కొన్నారు. ఇటీవల కామన్వెల్త్ స్పోర్ట్ గేమ్స్ డైరెక్టర్ డారెన్ హాల్ నేతృత్వంలోని బృందం అహ్మదాబాద్‌లోని క్రీడా వేదికలను పరిశీలించడంతో పాటు గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వ అధికారులతోనూ సమావేశమైన విషయం తెలిసిందే. మరోసారి ప్రతినిధి బృందం సైతం ఈ నెలలో పర్యటించనున్నది. ఈ నెల చివరలో కామన్వెల్త్ క్రీడల ప్రతినిధి బృందం అహ్మదాబాద్‌కు చేరుకుంటుందని భావిస్తు న్నారు. నవంబర్ చివరి వారంలో గ్లాస్గోలో జరిగే కామన్వెల్త్ క్రీడల జనరల్ అసెంబ్లీ ఆతిథ్య దేశాన్ని నిర్ణయిస్తుంది. వచ్చే ఏడాది గ్లాస్గో వేదికగా జరుగనున్న క్రీడల తరహాలో కాకుండా.. 2030 పూర్తిస్థాయిలో క్రీడలను నిర్వహించనున్నట్లు ఐఓసీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యుడు రోహిత్ రాజ్‌పాల్ పేర్కొన్నారు. షూటింగ్, ఆర్చరీ, రెజ్లింగ్ తదితర క్రీడలతోపాటు ఆటు కబడ్డీ, ఖోఖో పోటీలను సైతం ఈ క్రీడల్లో చేర్చాలని



యోచిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. భారత్ గతంలోనూ కామన్వెల్త్ గేమ్స్‌ను నిర్వహించిన విషయం తెలిసిందే. 2010లో ఢిల్లీ వేదికగా విజయవంతంగా నిర్వహించింది.



## నిధి అగర్వాల్‌కు ప్రభాస్ సర్‌ప్రైజ్.. అదేంటో తెలుసా?

టాలీవుడ్ రెబల్ స్టార్ ప్రభాస్ ఆహార ప్రియుడని మనకు తెలిసిందే. అంతేకాదు.. అతిథులకు మర్యాద చేయడంలో ఇంకా ముందుంటారు. అది సెట్‌లో అయినా.. ఇంట్లో అయినా సరే కడుపునిండా భోజనం పెట్టే పంపిస్తాడు. అలా ఇప్పటికే షూటింగ్స్‌తో పాటు పలువురు సెలబ్రిటీలకు సైతం భోజనాలు ఏర్పాటు చేస్తుంటారు. తాజాగా హరిహర వీరమల్లు హీరోయిన్ నిధి ?అగర్వాల్‌కు భోజనం పంపించారు మన ప్రభాస్. ఈ విషయాన్ని సోషల్ మీడియా వేదికగా పంచుకుంది. ఈ సందర్భంగా ప్రభాస్ పెద్దమ్మ శ్యామలాదేవికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపింది. అలాగే ప్రభాస్‌తో పాటు వంశీకి ధన్యవాదాలు అంటూ ట్వీట్ చేసింది. ఆంధ్ర వంటకాలతో పాటు అద్భుతమైన మీల్స్ దొరికాయని సంతోషం వ్యక్తం చేసింది. ప్రభాస్ హీరోగా వస్తోన్న రొమాంటిక్ హారర్ ఫిల్మ్ ది రాజాసాబ్‌లో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ చిత్రానికి మారుతి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటికే ఈ మూవీ పలుసార్లు వాయిదా పడుతూ వస్తోంది. ఇటీవల టీజర్ రిలీజ్ చేసిన మేకర్స్.. ది రాజాసాబ్ విడుదల తేదీని ఫిక్స్ చేశారు. ఈ ఏడాది డిసెంబర్ 5 థియేటర్లలో సందడి చేయనుందని ప్రకటించారు. ఈ చిత్రంలో నిధి అగర్వాల్‌తో పాటు రిద్ధి కుమార్, మాళవిక మోహన్ కథానాయికలుగా నటిస్తున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇటీవలే ఏపీకి ప్రభుత్వ కారులో నిధి అగర్వాల్ ప్రయాణించారు. ఓ ప్రైవేట్ ఈవెంట్‌కు వెళ్లిన నిధి అగర్వాల్‌కు ఏకంగా ఆన్ గవర్నమెంట్ డ్యూటీ అని బోర్డ్ ఉన్న కారులో వెళ్లారు. ఈ వీడియో కాస్తా సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వంపై పెద్దఎత్తున విమర్శలొచ్చాయి. ఆ తర్వాత ఆ కారు ఏర్పాటులో తన ప్రమేయం లేదంటూ క్లారిటీ ఇస్తూ లేఖను పోస్ట్ చేసింది. గతనెల రిలీజైన హరిహర వీరమల్లులో హీరోయిన్‌గా నిధి అగర్వాల్ కనిపించింది.



## అమ్మాయి సినిమా చేయడం అంత ఈజీ కాదంటూ ఏడ్చేసిన హీరోయిన్

హీరోయిన్ అనుపమ పరమేశ్వరన్ లేటెస్ట్ మూవీ పరదా ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అయింది. సినిమా బండి ఫేమ్ ప్రవీణ్ కంద్రేగుల డైరెక్ట్ చేసిన ఈ చిత్రం ఆగస్టు 22న విడుదల కానుంది. ఈ క్రమంలో ఇప్పటికే ప్రమోషన్స్ మొదలుపెట్టారు. మంగళవారం నాడు విజయవాడలో జరిగిన పరదా ఈవెంట్‌లో అనుపమ కన్నీళ్లు పెట్టుకుంది. ఎన్నో కష్టాలను ఎదుర్కొని పూర్తి చేసిన సినిమా పరదా. దయచేసి ఈ సినిమాకు సపోర్ట్ చేయండి అంటూ కన్నీళ్లు పెట్టుకుంది. ఎందుకిలా ఎమోషనల్ అవుతున్నారన్న ప్రశ్నకు.. ఒక సినిమా చేయడం అంత ఈజీ కాదు. అందులోనూ ఒకమ్మాయి సినిమా చేసి ముందుకు రావడం అంత సులువేమీ కాదు. మూవీ చేయడానికన్నా దాన్ని రిలీజ్ చేయడానికే ఎక్కువ కష్టపడాల్సి వస్తోంది. నా సినిమా కాబట్టి చూడమని చెప్పడం లేదు. నేను చేసిన సినిమాల్లోనే సగం నాకు నచ్చవు. విమర్శిస్తూ ఉంటాను. కానీ, ఈ మూవీలో నేను విమర్శించడానికేం లేదు అంటూ ఏడ్చేసింది.



## సీక్రెట్స్ రివీల్ చేయకండి: హృతిక్, ఎన్టీఆర్ రిక్వెస్ట్

ఎన్టీఆర్, హృతిక్ రోషన్‌లు కలిసి నటించిన వార్ 2 చిత్రం మరికొన్ని గంటల్లో(ఆగస్ట్ 14) ప్రేక్షకుల ముందుకు రాబోతుంది. యశ్ రాజ్ ఫిల్మ్స్ బ్యానర్ మీద ఆదిత్య చోప్రా నిర్మించిన ఈ చిత్రానికి అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహించారు. ఇప్పటి వరకు రిలీజ్ చేసిన టీజర్, ట్రైలర్‌లు 'వార్ 2' మీద అంచనాలు పెంచేసిన సంగతి తెలిసిందే. మరికొన్ని గంటల్లో సినిమా రిలీజ్ అవుతుండడంతో అభిమానులకు స్పాయిలర్‌ల గురించి హీరోలు రిక్వెస్ట్ చేశారు. "వార్ 2' సినిమాను ఎంతో ప్రేమతో, ఎంతో కష్టపడి తెరకెక్కించాం. ఎంతో ప్యాషన్‌తో చేసిన ఈ మూవీ ఆడియెన్స్ ముందుకు రాబోతోంది. ఈ సినిమాటిక్ దృశ్యాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయడానికి అందరూ థియేటర్లలోనే సినిమాను చూడండి. దయచేసి సినిమాలోని సీక్రెట్లు, ట్విస్ట్‌లను రివీల్ చేయకండి. స్పాయిలర్‌లను ఆపండి. ఇది మీడియా, ప్రేక్షకులు, అభిమానులను మేం రిక్వెస్ట్ చేస్తున్నాము' అని అన్నారు. 'మీరు (అభిమానులు) 'వార్ 2'ని మొదటిసారి చూసినప్పుడు అనుభవించినంత ఆనందం, థ్రిల్, వినోదాన్ని మిగతా వారు కూడా అనుభవించాలి. స్పాయిలర్లు సీక్రెట్లు, ట్విస్టులు రివీల్ చేయడం వల్ల మిగతా వాళ్లకు ఆ అనుభూతి, అనుభవం ఉండదు. దయచేసి 'వార్ 2' కథను రహస్యంగా ఉంచండి' అని ఎన్టీఆర్ తెలిపారు.

## నా లక్ష్యం స్టార్ అవడం కాదు.. మిరాయి హీరో తేజ సజ్జా ఇంట్రెస్టింగ్ కామెంట్స్



హనుమాన్ సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో స్టార్‌డమ్ సంపాదించుకున్నాడు యంగ్ యాక్టర్ తేజ సజ్జా ఈ టాలెంటెడ్ యాక్టర్ మరోసారి సిల్వర్ స్క్రీన్‌పై మ్యాజిక్ చేసేందుకు మిరాయి సినిమాతో ప్రేక్షకుల ముందుకొస్తున్నాడని తెలిసిందే. పాన్ ఇండియా అడ్వెంచరస్ మూవీ మిరాయికి కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ చిత్రంలో ఢిల్లీ బ్యూటీ రితికా నాయక్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తుండగా.. మంచు మనోజ్ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఈ మూవీని 2025 సెప్టెంబర్ 5న పలు భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేయనున్నారు. ఈ నేపథ్యంలో ఈ మూవీకి సంబంధించి ఇప్పటికే ప్రమోషన్స్ షురూ అయ్యాయి. ప్రమోషన్స్‌లో భాగంగా ఈవెంట్స్, ఇంటర్వ్యూల్లో పాల్గొంటున్నాడు తేజ సజ్జా. అయితే ఓ ఇంటర్వ్యూలో ఆసక్తికర విషయం చెప్పి అందరినీ షాక్‌కు గురిచేశాడు. తేజ సజ్జా తన లక్ష్యం స్టార్ అవడం కాదన్నాడు. మెగాస్టార్లు దశాబ్ధాలుగా తయారవుతారని తేజ సజ్జా అభిప్రాయపడ్డాడు. హనుమాన్ తర్వాత నా లక్ష్యాలు మారిపోయాయి. నేను ఓ స్టార్ అవాలనుకోవడం లేదు. నాకు ప్రత్యేకించి యువ ప్రేక్షకులపై ప్రభావం చూపించే సినిమాలు తీయాలనుంది. ఇంకో 15-20 సంవత్సరాల తర్వాత కూడా జనాలు నన్ను జాంబిరెడ్డి యాక్టర్‌గానే గుర్తుంచుకుంటారని చెప్పుకొచ్చాడు. ఇప్పుడీ కామెంట్స్ నెట్టింట వైరల్ అవుతున్నాయి. మిరాయి చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వప్రసాద్ తెరకెక్కిస్తుండగా.. గౌరా హరి సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని 2డీ, 3డీ వెర్షన్లలో ప్రపంచవ్యాప్తంగా వివిధ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుందని వస్తున్న వార్తలపై మేకర్స్ నుంచి క్లారిటీ రావాల్సి ఉంది. మేకర్స్ ఇప్పటికే షేర్ చేసిన మిరాయి టైటిల్ గ్లింప్స్ వీడియోకు మంచి స్పందన వస్తోంది.

VISWAM VOICE Telugu Daily: Edited, Printed, Published and Owned by KHANDAVELLI SUNIL KUMAR, H.No:3-168, Pedda Brahmamgariveedi, Rayavaram, Rayavaram (M), East Godavari District, Andhra Pradesh. Pin:533346. Ph:092460 33999, 9238823333, 8099966647, Printed at Kumar Publication, H.No.9-125, Indiramma Colony, Rayavaram, Rayavaram(M), East Godavari District, Andhra Pradesh. Pin:533346, Editor: KHANDAVELLI SUNIL KUMAR. RNI No: APTEL 2017/73603, viswamvoice@gmail.com